తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 06.10.2026 | సంపుటి : 13 సంచిక : 77 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## చట్టాన్ని ఉల్లంఘిస్తే నిర్ణయాలు రద్దు





### సీఈసీ వ్యవహారంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**చట్టబద్ధ ప్రక్రియ పాటించలేదని తేలితే చర్యలు తప్పవు**
**రికార్డుల ఆధారంగా చర్యలు తీసుకుంటాం**
**సీఈసీ, ఈసీ, కేంద్రానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు చట్టానికి అనుగుణంగా, నిర్దేశిత విధానంలోనే ఉండాలని స్పష్టం చేసింది. చట్టాన్ని ఉల్లంఘించి నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారిక రికార్డుల పరిశీలనలో తేలితే.. అలాంటి నిర్ణయాలను రద్దు చేయడానికి వెనుకాడబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సీఈసీ గ్యానేశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం నిర్ణయాలపై దాఖలైన పిటిషన్ల విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది.పత్రికల్లో వచ్చిన కథనాలను మాత్రమే ఆధారంగా చేసుకుని నేరుగా ఆదేశాలు జారీ చేయలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే కథనాల్లో పేర్కొన్న ఆరోపణలు వాస్తవమా ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏ విధంగా తీసుకుంది చట్టపరమైన ప్రక్రియను పాటించిందా? వంటి అంశాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించేందుకు సిద్ధమైంది.సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు, ఇతర ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలపై దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారించింది. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. ఆరోపణలపై వారి స్పందనను, నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అయినప్పటికీ.. అది చట్టానికి అతీతం కాదన్న విషయాన్ని కోర్టు వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. ఎన్నికల సంఘం నిర్ణయాలు చట్టపరమైన అధికార పరిధిలోనే ఉండాలని, నిర్దేశిత విధానాన్ని పాటించాల్సిందేనని పేర్కొంది. బహుళ సభ్యుల ఎన్నికల సంఘంలో నిర్ణయం ఎలా తీసుకున్నారు? సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా? విభేదాలు ఉంటే వాటిని ఎలా నమోదు చేశారు? అన్న అంశాలు కూడా పరిశీలనకు వస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

**రికార్డుల్లో వాస్తవాలు తేలితే..**

పత్రికా కథనం ఆధారంగా ఆదేశాలు ఇవ్వలేమని చెప్పిన కోర్టు.. అదే సమయంలో ఆరోపణలను కొట్టిపారేయలేదు. అధికారిక రికార్డులు తెప్పించుకుని వాటిని పరిశీలించిన తర్వాత చట్ట ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత నిర్ణయాలపై న్యాయపరమైన జోక్యం తప్పదని స్పష్టం చేసింది. అంటే ఎన్నికల సంఘం తీసుకున్న మిగతా 2లో..



### సీఈసీ ద్రోహం చేశారు!

**పార్టీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**
**ఆయన మోదీ, అమిత్ షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని మండిపాటు**
2లో..

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



**కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లకు పురస్కారాలు**







స్వీడన్(జనంసాక్షి): 2026 ఏడాదికి గానూ నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారం నుంచి ప్రారంభమైంది వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ వరించింది. కాంతి నియంత్రిత అయాన్ ఛానల్స్, ఆప్టోజెనెటిక్స్‌కు సంబంధించిన ఆవిష్కరణలకు గానూ కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో విశేష కృషి చేసిన వారి పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్‌పై ప్రకటన రానుంది. నోబెల్ ప్రైజ్ మనీ విలువ 12 లక్షల డాలర్లు (రూ. 11.5 కోట్లు). నోబెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీడన్ – నార్వే దేశాలకు చెందిన నాలుగు వేర్వేరు స్వతంత్ర సంస్థలు వేర్వేరు రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేస్తాయి. 1901 నుంచి నోబెల్ జ్ఞాపకార్థం వీటిని ఇస్తోన్న సంగతి తెలిసిందే.

## 'సర్'పై తప్పుడు సమాచారమిస్తే చర్యలు తీసుకోండి



**కలెక్టర్లకు సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్(జనంసాక్షి): ఓట్లను తొలగించేందుకు బోగస్ ఫారం –7 పత్రాలు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ముందే ప్రింట్ చేసిన ఫారం–7లు భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందు తోందని సీఈవో తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనర్హులకు ఓటు మిగతా 2లో..

## అవినీతి మహారాణులు

**ఏసీబీ వలలో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి**
**రూ.4 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తులసీరామ్ సునీత**
**రూ.లక్ష లంచం తీసుకుంటూ చిక్కిన డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి**


తులసీరామ్ సునీత

హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిణి తులసీరామ్ సునీత ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. రూ. 4లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మెహదీపట్నం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె.. ఖైరతాబాద్ జోన్ కార్యాలయం బయట లంచం తీసుకొని, తన కారులో పెట్టించుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణానికి అనుమతిచ్చేందుకు సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ సహకరిస్తానని నిర్మాణదారుకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధితుడు ఏసీబీకి సమాచారం ఇవ్వడంతో.. అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లంచం కాకుండా అదనంగా సునీత వద్ద లెక్కల్లో చూపని రూ.2.50 లక్షల నగదును అధికారులు గుర్తించారు. మొత్తం రూ.6.5 లక్షలు స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేశారు. ఆమె నివాసంలో డీఎస్పీ మాజిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఏసీబీ వలలో రంగారెడ్డి డీఎంహెచ్‌వో

**రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ స్వర్ణకుమారి**

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా మెడికల్ హెల్త్ అధికారి (డీఎంహెచ్‌వో) స్వర్ణకుమారి ఏసీబీ వలకు చిక్కారు. రూ.లక్ష లంచం మిగతా 2లో..

**మహిళలపై నేరాలకు పాల్పడే..**

## క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలి

**అత్యాచార ఘటనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న వరుస అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మహిళలపై నేరాలకు పాల్పడే వారి గుండెల్లో భయం పుట్టించాల్సిన అవసరం ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది."మహిళల భద్రతకు సంబంధించిన చర్యలు పేపర్లకే పరిమితం కాకూడదు. మేం సురక్షితంగా ఉన్నామని ప్రతి మహిళా భావించేలా మన చర్యలు ఉండాలి. రాత్రి 11 గంటల సమయంలో కూడా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలు రోడ్లపై, మెట్రోలో స్వేచ్ఛగా, భద్రంగా తిరిగే పరిస్థితులు కల్పించాలి. నేరాలు జరిగిన తర్వాత ఏం చేశామన్నదానికంటే కూడా.. మిగతా 2లో..



**పోలీస్‌స్టేషన్ ఎదుటే చిరు వ్యాపారి**

## సజీవదహనానికి యత్నం



**పరిస్థితి విషమం.. పోలీసుల వేధింపులే కారణమని వాంగ్మూలం**
**మా తప్పేమీ లేదు: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి/భీంగల్, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
ఎస్సై వేధింపులు తాళలేక భీంగల్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు హోటల్ యజమాని పొలాస సుధాకర్ తెలిపారు. హోటల్‌కు వచ్చే కస్టమర్లు రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలు నిలిపినందుకు పోలీసులు పలుమార్లు ఫొటోలు తీసి కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే నాలుగుసార్లు కేసులు నమోదు చేశారని, ఇదే ప్రాంతంలోని ఇతర దుకాణాల వద్ద వాహనాలు నిలిపినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. తనపైనే పదేపదే కేసులు నమోదు చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వాంగ్మూలంలో పేర్కొన్నారు. సంఘటనకు ఒక రోజు ముందు కానిస్టేబుల్, ఎస్సై తన హోటల్ వద్దకు వచ్చి బెంచీలు, ఇతర సామగ్రిని కాలితో తన్ని, ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదంటూ బెదిరించారని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

**అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో**

సుధాకర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వారు గేటు ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. మిగతా 2లో..



**ఫోన్ ట్యాపింగ్ కేసు..**

## కోదండ రెడ్డిని విచారించిన సిట్



హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికే వెళ్లి, దాదాపు 40 నిమిషాలకుపైగా వివిధ అంశాలపై ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన మిగతా 2లో..



**కేబీఆర్ పరిసరాల్లో**

## శాశ్వత వన్‌వే..

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్**

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలోని కేబీఆర్ పార్కు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మార్గాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు."కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్–సిటీ పనులను రద్దు చేశాం. పార్కు చుట్టూ వన్‌వే విధానం శాశ్వతంగా అమలు చేస్తాం. దీనివల్ల రూ.400కోట్లు ఆదా అవుతాయి. మిగతా 2లో..

## రక్షణ ఇవ్వాల్సిన వారే ప్రమాదంగా మారుతున్నారు

**సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీ దృశ్యాలను బహిర్గతం చేయాలి**
**మహిళా జర్నలిస్టులపై దాడి పోలీసులు కఠినంగా శిక్షించాలి.. రాహుల్ డిమాండ్**



**"మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి"**
**- రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతో పాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు. "మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ మిగతా 2లో..

**భారత్-అమెరికా ట్రేడ్‌డీల్‌పై**

## పీటముడి



- **ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు ఇక స్తంభించిపోయినట్లుగా కన్పిస్తున్నాయి**
- **నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా అవి కొలిక్కి రాలేదు. ఈ పరిణామాల వేళ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వాణిజ్య మిగతా 2లో..



**సింగరేణి కార్మికులకు రూ.1,10,250 చొప్పున**

## బోనస్

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):దసరా, దీపావళి పండగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. సింగరేణి అనేది బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమన్నారు. లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని కొనియాడారు. "రాష్ట్ర, దేశ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామి. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు మిగతా 2లో..



# యెమెన్‌లో పోరు ఉద్ధృతం..

### కీలక పట్టణం హూతీల చేతుల్లోకి!

టెహ్రాన్(జనంసాక్షి):యెమెన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ మద్దతు కలిగిన హూతీ తిరుగుబాటుదారులు దేశంలో మరింత భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. హూతీలపై స్థానిక ప్రభుత్వం భారీ సైనిక చర్యను ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీలపై విరుచుకుపడుతున్నాయి.కొన్ని రోజులుగా హూతీలు దేశంలోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు చూస్తున్నారు. యెమెన్ సర్కారుకు కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే ప్రధాన రహదారిపై తుర్బా పట్టణం ఉంది. హూతీల నుంచి తైజ్‌ను రక్షించే ప్రభుత్వ బలగాలకు ఇది కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు హూతీలు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మోఖా రేవు పట్టణం, బాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై వారు నియంత్రణ సాధించిన విషయం తెలిసిందే.హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా యెమెన్ ప్రభుత్వం 'డాన్ ఆఫ్ యెమెన్' పేరిట ఆదివారం భారీ సైనిక చర్యను ప్రకటించింది. ఈ క్రమంలోనే బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని తమ నియంత్రణలోకి తీసుకోవడంలో పైచేయి సాధించామని తాజాగా ప్రకటించింది. ధుబాబ్ అనే తీరప్రాంత పట్టణంతోపాటు, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

# ఉగ్రవాదులచేతిలో 'లోరా'..

న్యూఢిల్లీ(జనంసాక్షి):జమ్మూకశ్మీర్ అడవుల్లో ఉగ్రవాదుల ఏరివేతకు ప్రయత్నిస్తోన్న భద్రతా బలగాలకు కొత్త సవాల్ ఎదురైంది. సైన్యం కంట పడకుండా ఉండేందుకు ఉగ్రవాదులు ఓ సరికొత్త ఘోస్ట్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నట్లు తెలిసింది. అదే 'లోరా– లాంగ్ రేంజ్, లో పవర్' ఆయుధం. ఎలాంటి సిమ్ కార్డు, మొబైల్ టవర్, వైఫై అవసరం లేని ఈ నెట్‌వర్క్‌ను (ఒనీఖీజీ) గుర్తించడం భద్రతా బలగాలకు అసాధ్యంగా మారుతోందని సెక్యూరిటీ ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి.జమ్మూకశ్మీర్‌లోని బద్గాం జిల్లాలో ఇటీవల లష్కరే తయ్యిబా చీఫ్ ఆపరేషనల్ కమాండర్ మహమ్మద్ ఆసిఫ్ అలియాస్ హాషిం మూసాను భద్రతా బలగాలు మట్టుబెట్టిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం వద్ద ఓ ఎలక్ట్రానిక్ పరికరం లభించింది. అది స్మార్ట్‌ఫోన్ కాదని, 'లోరా అల్ట్రా' పేరుతో ఉన్న డివైజ్ అని ఓ భద్రతా అధికారి వెల్లడించారు. "ఇది సాధారణ వాకీ–టాకీ కాదు. ఎన్‌క్రిప్ట్ చేసిన వైర్‌లెస్ కమ్యూనికేషన్ డివైజ్. ఒక్కో హ్యాండ్‌సెట్ స్వయంగా టవర్‌లా కూడా పనిచేస్తుంది. దీనికి సిమ్ కార్డు అక్కర్లేదు. రీఛార్జ్ చేయనవసరం లేదు" అని సదరు అధికారి వివరించారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే నిర్ణయాలు రద్దు

నిర్ణయం ఎంత ఉన్నత స్థాయి రాజ్యాంగ సంస్థ నుంచి వచ్చినదైనా.. అది చట్టబద్ధ ప్రక్రియకు లోబడి ఉండాల్సిందేనన్న స్పష్టమైన సందేశాన్ని ధర్మాసనం ఇచ్చింది.ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసం అత్యంత కీలకమని, ఎన్నికల సంఘం నిర్ణయాలు పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్న వాదనల నేపథ్యంలో ఈ విచారణకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం పత్రికా కథనాల ఆధారంగా తక్షణ చర్యలు కాకుండా.. అధికారిక రికార్డుల పరిశీలన ద్వారా అసలు వాస్తవాలను తేల్చేందుకు సుప్రీంకోర్టు ముందుకు సాగుతోంది.చట్టం ఉల్లంఘించారా? నిర్ణయాలు ఎలా తీసుకున్నారు? సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు అధికారిక రికార్డులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఆ సమాధానాల్లో చట్ట ఉల్లంఘన బయటపడితే.. ఎన్నికల సంఘం నిర్ణయాలకు సైతం న్యాయపరీక్ష తప్పదన్నది సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యల సారాంశం.

**సీఈసీ ద్రోహం చేశారు!**

సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసు విషయమై కేంద్రానికి, ఈసీకి నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు చేసింది. ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించింది.ఎస్‌ఐఆర్‌ను తాత్కాలికంగా, చట్టవిరుద్ధంగా, అజాగ్రత్తగా నిర్వహిస్తున్న తీరు. సుప్రీంకోర్టులోని ప్రస్తుత, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల విమర్శలు. సరైన విచారణ లేకుండా విచ్చలవిడిగా ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగించడం. మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని, మన గణతంత్ర దేశ సమగ్రతకు కీలకమైన ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక అద్భుతమైన అవకాశం ఉంది." 'ఎన్నికలు ఎలా నిర్వహించాలనే దానికి తొలి సీఈసీ, దివంగత సుకుమార్? సేన్ మంచి ప్రమాణాలను



నెలకొల్పారు. కానీ వాటిలో ఒక్కదాన్నీ ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్? పాటించలేదు. వాస్తవానికి దురుద్దేశపూరితమైన ఫారమ్?–6 సవరణ, అతని నీచమైన, ఏమాత్రం సమర్థించలేని ప్రవర్తనకు ఒక ఉదాహరణ. వాస్తవానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ అబద్దాలు చెప్పడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించి, రాజ్యాంగాన్ని అక్షర రూపపంలోనూ, స్ఫూర్తి రూపంలోనూ ద్రోహం చేశారు' అని జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు.

రాజ్యసభ ఎన్నికలు..

# సిట్టింగ్ ఎంపీలకు భాజపా షాక్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉత్తర్‌ప్రదేశ్ (10), ఉత్తరాఖండ్ (1), పశ్చిమ బెంగాల్ (1) రాష్ట్రాలకు సంబంధించిన 12 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భాజపా ఉత్తర ప్రదేశ్ (జఖ) నుంచి పార్టీ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల జాబితా (ఖీజీటీఎజీ ాజీఎష్ట్రజీ జూనీశ్రీశ్రీ శ్రీతిబబి) ప్రకటించింది. ఈ జాబితా నుంచి భాజపా ఏడుగురు సిట్టింగ్ ఎంపీలను పక్కన పెట్టింది. కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురీ, బీఎల్ వర్మలను చేర్చకుండా 8మంది అభ్యర్థులను ప్రకటించింది. ధరంపాల్ సింగ్, రాధాకాంత్ ఓర్ఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోంకర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శృతి గంగ్వార్‌లను ఎన్నికల బరిలోకి దింపింది. హర్దీప్ సింగ్, బీఎల్ వర్మతో పాటు ఇతర సిట్టింగ్ ఎంపీలు అరుణ్ సింగ్, సీమా ద్వివేది, నీరజ్



శేఖర్, బ్రిజ్ లాల్, గీతా శాక్య పేర్లు ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం. కేంద్ర మంత్రి మండలిలో మార్పులు జరగనున్నాయని వార్తలు వస్తున్న వేళ ఈ మార్పులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు భాజపా తరఫున పశ్చిమ బెంగాల్ నుంచి రుక్మిణి మల్లిక్, ఉత్తరాఖండ్ నుంచి దినేశ్ ఆర్యను పోటీలో దింపుతున్నట్లు పార్టీ ఇప్పటికే వెల్లడించింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రుక్మిణి మల్లిక్ రాజీనామా చేసి భాజపాలో చేరి మళ్లీ పోటీ చేస్తున్నారు. ఎన్నికలు జరగనున్న 12 రాజ్యసభ స్థానాల్లో 11 స్థానాలు నవంబరు 25న ఖాళీ అవుతున్నాయి.

# నిమిషాల్లో 28 వేల అడుగులు కిందికి..

### మరో విమానంలో ఎమర్జెన్సీ

అబుదాబి(జనంసాక్షి):ఫ్లైదుబాయ్ ఘటన మరువకముందే.. గగనతలంలో మరో ఎమర్జెన్సీ చోటుచేసుకుంది. లండన్ నుంచి షికాగోకు బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం ఐర్లాండ్ గగనతలంపై ఉండగా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. అంతర్జాతీయ ఎమర్జెన్సీ కోడ్ 7700ను పంపింది. ఆ వెంటనే మళ్లీ లండన్ దిశగా మళ్లినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రాడర్24' సూచిస్తోంది. నిమిషాల వ్యవధిలోనే విమానం 37 వేల అడుగుల నుంచి 9 వేల అడుగుల ఎత్తుకు దిగినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# నదిలో ఢీకొన్న పడవలు..

### 30 మంది మృతి!

నైరోబీ(జనంసాక్షి):ఆఫ్రికాలోని కాంగోలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాంగో నదిలో రెండు పడవలు ఢీకొన్న ఘటనలో 30 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గల్లంతయ్యారు. ఒక పడవ ఉబాంగి నుంచి దేశ రాజధాని కిన్షాషాకు, మరొకటి కిన్షాషా నుంచి లూకోలెలాకు వెళ్తుండగా.. ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు.

# 'సర్'పై తప్పుడు సమాచారమిస్తే చర్యలు తీసుకోండి

ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం– 7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌లోని ముషీరాబాద్, గోషామహల్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొందరి ఓటు తొలగించేందుకు భారీగా బోగస్ ఫారం–7లు సమర్పిస్తున్నారని ఇటీవల సీఈవోకు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన సీఈవో కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఫారం–7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం చేసింది. ఫారం 7తో పాటు కొత్త ఓటు కోసం ఫారం 6, ఇతర దరఖాస్తుల్లోనూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం, డిక్లరేషన్ ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని సీఈవో స్పష్టం చేశారు. మరోవైపు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు బుధవారంతో ముగియనుంది.

# కేబీఆర్ పరిసరాల్లో శాశ్వత వన్‌వే..

నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు 6 లైన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతాం. వచ్చే ఏడాది నాటికి దాన్ని పూర్తిచేస్తాం. కేబీఆర్ పార్కు నుంచి అండర్‌పాస్ నిర్మిస్తాం"అని కర్ణన్ తెలిపారు.

# కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని విచారించిన సిట్

పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల సమయంలో ఆయన ఫోన్ కొన్ని నెలలు ట్యాప్ అయినట్లు గుర్తించారు.

# అవినీతి అధికారిణిలు

తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. ఆస్పత్రి తెరిచేందుకు డీఎంహెచ్‌వో లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆయన డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లంచం డిమాండ్‌పై ఆరా తీస్తున్నారు.

# మేడిపల్లిలో భారీ చోరీ..

### రూ.కోటి విలువైన వజ్రాభరణాలు అపహరణ!

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలోని మేడిపల్లి పరిధిలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. క్యారెట్ లేన్ జువెలరీ షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.కోటి విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. అర్ధరాత్రి షట్టర్ తొలగించి షాపులోకి ప్రవేశించిన దుండగులు.. డైమండ్ నగలతో పాటు బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిపై మేడిపల్లి పోలీసులు సమాచారం అందుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

# సింగరేణి కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్

కోసం సింగరేణి యాజమాన్యం పనిచేయాలి. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సంస్థకు ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి. కార్మికులకు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ (భూ సేకరణ)

**ఫారం - 6**

(చట్టం - 30/2013లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)

**ప్రాథమిక నోటిఫికేషన్**

G1/6210/2026 — తేది: 28.09.2026
నెం. సి/71/2024 — తేది : 25.09.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా ఎలికట్టే గ్రామం, మండలం చిట్యాల, భూమి విస్తీర్ణం: ఎ.5.16¼ గుంటల పట్టా భూమి ప్రజా ప్రయోజనార్థం ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా డి.టి.ఇ. ఎడమ ప్రధాన కాలువ కిమీ. 3.573 నుండి కిమీ. 3.998 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయిఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013లోని సెక్షన్ (11) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.ఎస్.నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్/2ఎ) క్యాడ్ & డిపార్టుమెంటు) తేది: 25.07.2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ.నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యాయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండజిల్లా, ఎలికట్టే గ్రామం, మండలం చిట్యాల విస్తీర్ణం ఎ.5.16¼ గుంటల భూమి ఈ క్రింద చూపినవిధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

**షెడ్యూల్**

గ్రామం : ఎలికట్టే — మండలం : చిట్యాల — జిల్లా : నల్లగొండ

| క్రమ సంఖ్య | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి/ పట్టా/ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 340 ఖుష్కి/పట్టా 2.02 | 0.20 | అంతటి గోపాల్ తండ్రి పాపయ్య | 2బోర్లు, 3తాటిచెట్లు, 1 ఉప్పలమ్మ గుడి, ఫెన్సింగ్ పైప్‌లైన్ |
| 2 | | 0.20 | బోడిగే మల్లయ్య తండ్రి వెంకటయ్య | 1టేకుచెట్టు, 2బోర్లు,పైప్‌లైన్ వాటర్‌సంప్, చిన్నవాటర్ ట్యాంకులు-2,ఫెన్సింగ్ |
| 3 | | 0.21 | బోడిగే సుజాత భర్త అంజయ్య | 1 సమాధి |
| 4 | | 0.21 | బోడిగే కృష్ణవేణి భర్త సత్యం | 1 సమాధి |
| 5 | 341 ఖుష్కి/పట్టా 3.14¼ | 0.11 ¼ | ఊదుగురు పాండు తండ్రి నర్సింహ్మ | 10 తాటిచెట్లు |
| 6 | | 0.36 ½ | పోషమోని ఇస్తారి తండ్రి పరుశురాములు | 2 వేపచెట్లు, 3 చింతచెట్లు |
| 7 | | 0.09 ½ | కల్లూరి మల్లారెడ్డి తండ్రి గంగారెడ్డి | 1 వేపచెట్టు, 4 తాటిచెట్లు |
| 8 | | 1.37 | గోపిడి ధర్మారెడ్డి తండ్రి వాపిరెడ్డి | 2బోర్లు,1 చింతచెట్టు, 3 మామిడిచెట్లు, 1 సపోటా, పశువుల కొట్టం, 3అరటిచెట్లు 1 వాటర్‌ట్యాంక్, పైప్‌లైన్ 2 వేప చెట్లు |
| | మొత్తం విస్తీర్ణం | 5.16¼ | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టం నెం. 30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) సంబంధిత భూయజమానులకు సరియైన భూనష్టపరిహారం చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఎ, విభాగం-2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం.6, జి.వి.గూడెం, నల్గొండ, గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఎ, విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండగారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్ & ఆర్ & ఎల్.ఎ, విభాగం-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీచేసిన 60 (అరవై) దినములలోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/-.ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఏ. విభాగము-2, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్, నల్లగొండ
సం/-. జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO.NO: 953/LA/PP/Advt/Pub/2026-27


# మహిళలపై నేరాలకు పాల్పడే.. క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలి

వాటిని కట్టడి చేయడమే అత్యంత ముఖ్యమైన అంశం. ఇలాంటి నేరం చేస్తే ప్రాణాలు పోతాయి అని క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించినప్పుడే.. వీటిని మనం అరికట్టగలం" అని సుప్రీంకోర్టు వెల్లడించింది.మహిళలపై నేరాల కట్టడికి పోలీసులు కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని న్యాయస్థానం సూచించింది. "ఈ విషయంలో కొంత కర్కశంగా ఉన్నా వెనుకాడొద్దు. మానవహక్కుల వంటి సమస్యలు ఎదురైనా.. అవసరమైనప్పుడు కఠిన చర్యలు తీసుకోండి" అని కోర్టు పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో నిరంతర పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని న్యాయస్థానం ఈ సందర్భంగా సూచించింది. సీసీటీవీలు నిరంతరం పనిచేసేలా చూడాలని తెలిపింది.ఇటీవల దిల్లీలోని ఓ పార్క్‌లో 17ఏళ్ల అమ్మాయిపై సామూహిక అత్యాచారం జరిగిన సంగతి తెలిసిందే. అంతకుముందు, స్వరూప్ నగర్‌లోని ఓ టీనేజీ అమ్మాయిని కొంతమంది దుండగులు గ్యాంగ్‌రేప్ చేసి చంపిన ఘటన వెలుగుచూసింది. ఇక, స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. వీటిపై సుమోటోగా విచారణ చేపట్టింది.

# రక్షణ ఇవ్వాల్సిన వారే ప్రమాదంగా మారుతున్నారు

"మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# పశ్చిమాసియా ఘర్షణలు.. ఇరాన్ మహిళల చేతుల్లో తుపాకులు

పశ్చిమాసియాలో ప్రస్తుతం బాంబుల వర్షం కురవట్లేదు కానీ.. యుద్ధ వాతావరణం మాత్రం అలాగే ఉంది. ఏ క్షణం ఎటునుంచి ఎవరు దాడిచేస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ విషయంలో తాను త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో.. టెహ్రాన్ నుంచి కొన్ని దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ దేశ మహిళల చేతుల్లో తుపాకులు కనిపించాయి. అమెరికా , ఇజ్రాయెల్ దేశాలు భూతల దాడులు చేపట్టొచ్చనే భయాలతో ఇరాన్ సైన్యం మహిళలకు మిలిటరీ శిక్షణను మొదలుపెట్టినట్లు కనిపిస్తోంది.టెహ్రాన్‌లోని ఇమామ్ హుస్సేన్ స్క్వేర్‌లోని సైనిక కేంద్రంలో ఇరాన్ మహిళలకు శిక్షణా కార్యక్రమం జరుగుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. హ్యాండ్‌గన్ సహా ఇతర ఆయుధాలు ఎలా వాడాలో నేర్పు తున్నారు. యుద్ధ సమయంలో కుటుంబాలను, చుట్టుపక్కలవారిని ఎలా రక్షించుకోవాలో నేర్చుకోవడం వల్ల తమ భయాలు కాస్త తగ్గుతున్నాయని ఆ మహిళలు చెప్తున్నారు.

# పోలీస్‌స్టేషన్ ఎదుటే చిరు వ్యాపారి సజీవదహనానికి యత్నం



ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఎస్పై సత్తార్ తమను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారని ఆందోళనకారులు ఆరోపించారు. అనంతరం ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు.

**పోలీసుల తప్పేమీ లేదు : కమిషనర్**

సుధాకర్ అర్ధరాత్రి వరకు హోటల్ నడిపిస్తున్నాడని, పోలీసులు విధుల్లో ఉండగా అతనిపై ఈ–పీటీ కేసు నమోదు చేశారని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఆ విషయం మనసులో పెట్టుకొని పోలీస్ స్టేషన్‌కు వచ్చి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడని, ఈ ఘటనలో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**పోలీసుల వేధింపులే కారణం: ప్రశాంత్‌రెడ్డి**

పోలీసుల వేధింపులు తాళలేకే సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. భీంగల్ ఎస్సై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పోలీస్ స్టేషన్‌లో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, దీనివల్లే సుధాకర్ ఆవేదనకు గురై ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. భీంగల్ ఎస్సైతో పాటు మోర్తాడ్, బాల్కొండ ఎస్సైలు కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ఈ విషయంపై ఇప్పటికే పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారత్-అమెరికా ట్రేడ్‌డీల్‌పై పీటముడి

చర్చలు ఇక స్తంభించిపోయినట్లుగా కన్పిస్తున్నాయని అన్నారు. ఈ డీల్‌తో ఇరుదేశాలు మరిన్ని రాయితీలు పొందడం దాదాపు అసాధ్యంలాగే ఉందన్నారు. దిల్లీలో జరిగిన ఓ బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్న నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ట్రేడ్ డీల్ కోసం ఇంకా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ.. ఇరుపక్షాల మధ్య పీటముడి పడినట్లుగా అనిపిస్తోంది. చర్చల పురోగతి నిలిచిపోయే స్థితికి పరిస్థితులు చేరుకున్నట్లుగా ఉన్నాయి. ఇక, ఈ దశ దాటి.. పరస్పరం రాయితీలు ఇవ్వడం, తీసుకోవడం చాలా కష్టమైన పని. అయితే, ఇరుపక్షాలూ అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తే.. చర్చలు ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉండొచ్చని భావిస్తున్నా" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

**అమెరికాకు ఆయుధంలా టారిఫ్‌లు..**

భారత్‌తో వాణిజ్య లోటును పూడ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అయితే, దాన్ని సంప్రదాయ చర్చలతో పరిష్కరించుకోకుండా.. టారిఫ్‌లను ఆయుధంలా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆరంభంలో జరిగిన భారత్–ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ప్రస్తావించారు. అది ఒక విజయవంతమైన డీల్ అని అన్నారు. దాని వల్ల భారత్‌లోని సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

**మార్కెట్లపై ప్రభావం..**

భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌పై నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో భారత స్టాక్ మార్కెట్లు ఊగిసలాడాయి. సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠ స్థాయి నుంచి ఒక్కసారి 450 పాయింట్లకు పైగా పతనమైంది. ప్రస్తుతం 11.30 గంటల సమయంలో సెన్సెక్స్ 323 పాయింట్ల లాభంతో 72,232 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు పెరిగి 22,507 వద్ద కొనసాగుతున్నాయి. ఈ ఉదయం ఆరంభంలో సెన్సెక్స్ ఒక దశలో 750 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది.

# రష్యాలో కలకలం!

### ల్యాబ్ నుంచి ప్లేగు బ్యాక్టీరియా లీక్..

రష్యాలో ప్రమాదకరమైన ప్లేగు వ్యాధి వ్యాప్తి భయాలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సైబీరియాలోని యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసే 28 ఏళ్ల షిపిలోవా అనే మహిళా ల్యాబ్ టెక్నీషియన్ మృతి చెందడం తీవ్ర చర్చకు దారితీసింది. ప్లేగు వ్యాప్తి కారణంగానే ఆమె మృతిచెందినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. రష్యా ప్రజారోగ్య అధికారులు మాత్రం ఆమె మృతికి న్యుమోనియా కారణమని చెబుతున్నారు. ఆమె శరీరంలో ప్రమాదకర సూక్ష్మజీవులను గుర్తించలేదని వెల్లడించారు.సెప్టెంబరు 25న ప్రయోగశాలలో ప్లేగు బ్యాక్టీరియా ఉన్న టెస్ట్ ట్యూబ్ పగిలినట్లు సమాచారం. "ఆ తర్వాత షిపిలోవా అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ మృతి చెందారు" అంటూ స్థానిక మీడియాలో వార్తలు



వచ్చాయి.ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు.. ఆమెతో సన్నిహితంగా ఉన్న కుటుంబసభ్యులు, సిబ్బంది దాదాపు 200 మందిని వైద్య పర్యవేక్షణలో ఉంచారు. పలు ఆసుపత్రుల్లో క్వారంటైన్ చర్యలు చేపట్టారు. ఐదు ఆసుపత్రులను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తోంది. అయితే క్వారంటైన్‌లో ఉన్నవారిలో ఇప్పటి వరకు వ్యాధి లక్షణాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. ప్లేగు వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ.. వ్యాధి వ్యాపించినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడిపోతే కాదా?

### రామచందర్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): నెహ్రూ కుటుంబంలోని వ్యక్తి ప్రధాని కావడంలేదని కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అందుకే భాజపా అక్రమంగా గెలుస్తోందని నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు చెప్పినట్లుగా ఎన్నికలు అక్రమంగా జరిగితే.. సీఎం రేవంత్ రెడ్డి కూడా చట్టవిరుద్ధంగా గెలుపొందారని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలనూ రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ, దిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా? మీరు గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడిపోతే మంచివి కాదా? తెలంగాణలో భాజపాను అధికారంలోకి తెచ్చుకుందాం" అని రామచందర్‌రావు పిలుపునిచ్చారు.



# తెలంగాణ ఉద్యమకారిణి జ్యోతి కిరణ్‌కు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలి



**సిరిసిల్ల నుంచి పద్మశాలి ముద్దుబిడ్డకు ప్రాతినిధ్యం కల్పించాలి**

- తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర
- న్యాయవాదిగా నాలుగు దశాబ్దాల ప్రజాసేవ
- ఉద్యమ వారసత్వం, న్యాయ అనుభవం కలిగిన మహిళకు అవకాశం కల్పించాలి

**తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని, న్యాయవాదిగా ప్రజా సమస్యలపై పోరాడిన జ్యోతి కిరణ్‌కు సిరిసిల్లలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ బలపడుతోంది. ఉద్యమ నేపథ్యం, న్యాయ రంగంలో సుదీర్ఘ అనుభవం, మహిళా సమస్యలపై స్పందించే స్వభావం ఉన్న ఆమెకు రాజకీయంగా అవకాశం కల్పిస్తే సిరిసిల్ల ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**




**సిరిసిల్ల (జనంసాక్షి) :**
సిరిసిల్లకు చెందిన జ్యోతి కిరణ్ గుడ్ల లక్ష్మీ నర్సయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు) కుమార్తె. 1961 డిసెంబర్ 8న అప్పటి కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ విద్యను అభ్యసించి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వద్ద న్యాయవాదిగా వృత్తి అనుభవాన్ని ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా న్యాయ రంగంలో కొనసాగుతూ వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా, అప్పటి ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి స్టాండింగ్ కౌన్సిల్‌గా, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు న్యాయవాదిగా సేవలందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2017లో తెలంగాణ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై, ప్రస్తుతం సహకార, వ్యవసాయ శాఖలకు సంబంధించిన కేసుల్లో ప్రభుత్వ తరఫున వాదనలు విని పిస్తున్నారు.

### ఉద్యమంలో ముందువరుసలో..

తెలంగాణ ఉద్యమ సమయంలో జ్యోతి కిరణ్ క్రియా శీలకంగా వ్యవ హరించారు. తెలం గాణ అడ్వకేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కో-కన్వీనర్‌గా, తెలంగాణ కో-ఆర్డినేట్ కమిటీలో కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ హక్కులు, న్యాయవా దులకు సముచిత వాటా, సామాజిక న్యాయం వంటి అంశాలపై సమావే శాలు, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్తర బ్లాక్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో తెలంగాణ అంశంపై న్యాయ వాదుల బృం దానికి నాయకత్వం వహించినట్లు ఆమె ప్రొఫైల్‌లో పేర్కొన్నారు.

### న్యాయపోరాటమే ఆమె బాట

తెలంగాణ ప్రాంతానికి చెందిన న్యాయవాదులకు ప్రభుత్వ ప్లీడర్లు, స్టాండింగ్ కౌన్సిళ్లు, అడ్వకేట్ జనరల్ వంటి నియామకాల్లో 42 శాతం న్యాయమైన వాటా కల్పించాలనే డిమాండ్‌తో నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళన ఆరు రోజులపాటు కొనసాగిన అనంతరం 2010 సెప్టెంబర్ 18న ప్రభుత్వం డిమాండ్లను అంగీకరించిందని ప్రొఫైల్‌లో వివరించారు. ఉస్మానియా విశ్వవి ద్యాలయంలో పోలీసు కాల్పుల అంశంపై మానవ హక్కుల కమిషన్ నియమించిన కమిటీలో సభ్యురాలిగా పనిచేశారు. విశ్వవి ద్యాలయంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, మూసి వేసిన హాస్టళ్లను తిరిగి తెరవడం వంటి అంశాలపై న్యాయ పోరాటం చేశారు. తెలంగాణ ప్రాంతానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పేర్కొంటూ నాబార్డ్ పథకాలపై కూడా న్యాయపోరాటం చేసినట్లు ఆమె వివరాలు చెబుతున్నాయి.

**సిరిసిల్లకు ఇప్పుడు కొత్త స్వరం అవసరం**

తెలంగాణ కోసం ఉద్యమించిన వారిలో చాలా మందికి రాజకీయ, ప్రజా ప్రాతినిధ్య అవకాశాలు లభించినప్పటికీ, ఉద్యమంలో కీలకంగా పనిచేసిన మహిళా ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇంకా దక్కలేదన్న అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యమకారిణి, న్యాయవాది, మహిళా ప్రతినిధిగా జ్యోతి కిరణ్‌కు సిరిసిల్లలో అవకాశం కల్పించాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. ప్రాంత సమస్యలపై అవగాహన, న్యాయపరమైన పరిజ్ఞానం, తెలంగాణ ఉద్యమ అనుభవం ఉన్న ఆమెకు ప్రాతినిధ్యం కల్పిస్తే సిరిసిల్ల ప్రజల గొంతుకకు మరింత బలం చేకూరుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# రోడ్డు గుంతల రూపంలో మృత్యుపాశాలు



- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా మారని పరిస్థితి..
- నేడు తప్పిన పెను ముప్పు!

**కుంటాల, అక్టోబర్ 05(జనం సాక్షి):** మండల పరిధిలోని రహదారులు గుంతలమయమై ప్రాణాంతకంగా మారిన నేపథ్యంలో సోమవారం అందకుర్ - కుంటాల మధ్య మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది పెంకకల్పాడు గ్రామానికి చెందిన యువకుడు బైక్‌పై వెళుతుండగా, రోడ్డుపై ఉన్న భారీ గుంతల కారణంగా వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు ఈ ప్రమాదంలో ఆ యువకుడికి తల, చేతులకు తీవ్ర గాయాలై, అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పినప్పటికీ, తీవ్ర గాయాలైన ఆ యువకుడిని స్థానికులు తక్షణమే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మండలంలోని అధ్వాన్నపు రహదారులను బాగు చేయాలని కోరుతూ గత ఆగస్టు నెలలోనే బిఆర్ఎస్ కన్వీనర్ పడకంటి దత్తద్రి నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు స్వయంగా వినతిపత్రం (ప్రజావాణి గ్రీవెన్స్) అందజేశారు ఈ ఫిర్యాదుపై స్పందించిన రోడ్లు ఒ భవనాల శాఖ అధికారులు, కుంటాల నుండి అంబకంటి-గొల్లమడ వరకు ఉన్న వాంజర్-వనాల్‌పాడ్ రోడ్డు మార్గాన్ని సిఆర్ఐఎఫ్ పథకం కింద వెడల్పు చేయడానికి ప్రతిపాదనలు పంపామని, తక్షణ అత్యవసర మరమ్మత్తుల కోసం అంచనాలు సిద్ధం చేశామని లేఖలో పేర్కొన్నారు కానీ నెలలు గడుస్తున్నా క్షేత్ర స్థాయి లో పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజలు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం తప్ప క్షేత్రస్థాయిలో గుంతలు పూడ్చే చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈరోజు ఒక యువకుడు తీవ్రంగా గాయపడవలసి వచ్చిందని స్థానికులు మండిపడుతున్నారు ప్రతిరోజూ ఈ దారి గుండా వెళ్లే వందలాది మంది ప్రయాణికులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అందకుర్, కల్లూరు నుండి కుంటాల వరకు ఉన్న అన్ని రోడ్డు గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి మరమ్మత్తులు చేయించాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# నడికూడ గుట్టపై అక్రమ నిర్మాణాల కూల్చివేత



- అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల ఉక్కుపాదం
- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు తహసిల్దార్ రాణి

**నడికూడ అక్టోబర్ 5 (జనం సాక్షి) :** నడికూడ గ్రామ శివారు లో గల ప్రభుత్వ భూమి 525 సర్వేనెంబర్ గుట్ట పై నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు ఉక్కు పాదం మోపి కూల్చివేశారు. తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఈ కూల్చివేత చేపట్టగా, గ్రామపంచాయతీ సిబ్బంది సహకరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రాణి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి పలుమార్లు నోటీసులు జారీ చేసి ఆఫీస్ కి పిలిచి స్వచ్ఛందంగా అక్కడి నుంచి తొలగిపోవాలని సూచించడం జరిగిందని తెలిపారు వారు నిర్లక్ష్యం వ్యవహరించడం వలన సోమవారం అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగిందని తెలియజేశారు నడి కూడ మండల పరిధిలో ఏ చోట అయినా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శంకర్ సృజన్ మరియు సంబంధిత రెవెన్యూ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# మహాత్మ జ్యోతి రావుపూలే హాస్టల్‌లో దారుణం



- 5వ,తరగతి విద్యార్థిని కరిచిన ఎలుక
- రాత్రి వేళల్లో ఎలుకల భయంతో విద్యార్థుల భయాందోళన
- ఎలుకల భయంతో షూస్, గ్లౌజులు,వేసి నిద్రిస్తున్న విద్యార్థులు

**గూడూరు, అక్టోబర్05 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి రావు పూలే హాస్టల్ లో దారుణం చోటుచేసుకుంది. మహాత్మ జ్యోతి రావు పూలే పాఠశాలలో 5వ,తరగతి చదువుతున్న విద్యార్థిని భీమగాని హర్ష ను ఆదివారం ఎలుకలు కరిచిన ఘటన కలకలం రేపింది. రాత్రి వేళల్లో హాస్టల్ లో నిద్రిస్తుండగా ఎలుకలు వచ్చి కరిచినట్లు,దింతో రాత్రి వేళల్లో విద్యార్థులు షూస్, గ్లౌజులు,వేసుకొని నిద్రిస్తు భయాందోళనకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. గతంలో వర్ష అనే విద్యార్థినిని కూడా ఎలుకలు కరిచినట్లు ఘటనలు జరిగయని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న గూడూరు తహసీల్దార్ నాగ భవాని ఘటన స్థలానికి చేరుకొని హాస్టల్ లోని నిద్రిస్తున్న రూమ్ లను పరిశీలించి, ఎలుకలు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలెనని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎలుకలు కరిచిన విద్యార్థినితో తహసీల్దార్ నాగ భవాని మాట్లాడారు. అవిద్యార్థిని భయపడకుండా రాత్రి పడుకున్న సమయంలో ఎలుక వచ్చి కరిచినట్లు విద్యార్థిని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో తహసీల్దార్ మాట్లాడారు. విద్యార్థుల భద్రత కోసం పడుకునే సమయంలో రాత్రి వేళల్లో షూస్, గ్లౌజులు వేసుకోవాలినని ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ నాగ భవాని ఉపాధ్యాయులతో మాట్లాడి వారికీ పలు సూచనలు చేశారు.

హాస్టల్ ను సందర్శించిన తహసీల్దార్ నాగ భవాని మాట్లాడుతూ విద్యార్థినిని అడగగా ఎలుక కరిచిందని,సాక్స్ లు ధరించి పడుకోగా తెల్లారి లేచి చూసే సరికి సాక్స్ ను కొరికి ఉన్నట్లు గుర్తించారాని,అరికాలు కింది భాగం డామేజ్ ఐనట్లు కనిపిస్తుందని ఎమ్మార్వో తెలిపారు. కొంత మంది విద్యార్థులను అడిగి తెలుసుకుంటే ర్యాక్ మాకు కనపడలేదని,అది కరిచిందో లేదో మాకు తెలియదని సమాధానమిచ్చారని, హాస్టల్ కు చుట్టూ పక్కల పొలాలు ఉండటం వలన ఎలుకలు రావడం సహజమేనని,డార్మెంటరీ రూమ్ లో ఉన్న బ్యాగ్స్ ని అన్ని సర్దమని,ఎలుకలు రాకుండా తగిన చర్యలు తీసుకోవేలేనని,విద్యార్థులకు ఏమైనా ఇబ్బందిగా ఉన్నట్లయితే కింద ఉన్న క్లాస్ రూమ్స్ కాలి చేసి, విద్యార్థులు రాత్రి పడుకోవడానికి సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని,విద్యార్థినికి మెడికల్ ట్రీట్ మెంట్ ఇప్పించాలని,ఉపాధ్యాయులను కోరారు. హాస్టల్ ఇటువంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూసుకోవాలెనని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా ఇబ్బంది ఉంటే నాకు సమాచారం అందించాలని అన్నారు. విద్యార్థుల సమస్య శాశ్వత పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

# గంజాయి సాగుదారులపై పోలీసుల ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ నితికా పంత్
- గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా పోలీసుల విస్తృత తనిఖీలు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 05(జనంసాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అక్రమ గంజాయి సాగు,రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.అశోక్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా లింగాపూర్,సిర్పూర్ (యు),కెరమెరి పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 500 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని,అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న 5గురు నిందితులను అరెస్టు చేసి,న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. 2025 సంవత్సరంలో అక్రమ గంజాయి సాగుకు సంబంధించి 39 కేసులు నమోదు చేసి,35 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.1.13 కోట్ల విలువైన 1,134 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ గంజాయి సాగులో పాల్గొన్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ప్రయోజనాలను 20 మంది భూ యజమానులకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సంబంధిత లబ్ధులను నిలిపివేయడం జరిగింది అని అన్నారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు అక్రమ గంజాయి సాగుకు సంబంధించి 23 కేసులు నమోదు చేసి,27 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.2.36 కోట్ల విలువైన 2,366 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు అని అన్నారు. ఈ కేసుల్లో నమోదైన నిందితుల భూ యజమానుల వివరాలను స్థానిక తహసీల్దార్ల ద్వారా సేకరించి,సంబంధిత సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కి పంపిస్తాము అని,కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధులను నిలిపివేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

### డ్రై గంజాయిపై ఉక్కుపాదం

2026లో ఇప్పటివరకు డ్రై గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి 32 కేసులు నమోదు చేసి,వారి నుంచి సుమారు విలువ సుమారుగా 3లక్షల విలువైన,10 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం,68 మంది నిందితులను అరెస్టు చేశాము అని తెలిపారు. అక్రమ గంజాయి సాగు వల్ల యువత,విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున,గంజాయి సాగుకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేత వంటి చర్యలు కూడా కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా నిరంతర తనిఖీలు,ప్రత్యేక దాడులు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.



# కరెంట్ కటింగ్ వద్దు

- పంటలు ఎండిపోతున్నాయి
- ఎస్ ఈ కి వినతిపత్రం ఇచ్చిన రైతులు

**కౌటాల అక్టోబర్ 05 (జనంసాక్షి) :** వారం రోజులుగా ఎండ తీవ్రత రోజు రోజుకు పెరిపోతుండ డంతో చేతికి వచ్చే పంటలు ఎండిపోతు న్నాయి. పంటలకు సరిపడే సాగునీరు అందక వరి, మిర్చి, పత్తి పంటల్లో బీటలు తేలుతున్నాయి. దాంతో పాటు విద్యుత్ కటింగ్ లతో చాలా ఇబ్బంది పడుతున్నామని సోమవారం విద్యుత్ శాఖ ఎస్ ఈ జాడే తుకారాం కు తాటిపల్లి గ్రామ రైతులు వినతిపత్రం అందించారు. పంటలకు సరిపడే విద్యుత్ అందించి, త్రి పేస్ సమయం లో విద్యుత్ కోతలు లేకుండా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందిం చిన వారిలో గ్రామ సర్పంచ్ బడగే సంతోష్, దత్తు పటేల్ గ్రామ రైతులు ఉన్నారు.

# పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై మంత్రులు జూపల్లి, పొంగులేటి సమీక్ష



**నిర్మల్ బ్యూరో , అక్టోబరు 5: (జనంసాక్షి )** జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక , ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని అంశాలపై కలెక్టర్లు, ఉన్నతాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై దృష్టి: రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల అంశాలపై మంత్రులు సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, జిల్లాల వారీగా కార్యక్రమాల పురోగతిని మంత్రులు తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత,ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ.23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

సంపాదకీయం

# రాజీనామాకు ఇంకా ఆలస్యమెందుకు?

ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ. కానీ రాజ్యాంగ సంస్థ అంటే చట్టానికి అతీతమని అర్థం కాదు. చట్టాన్ని ఉల్లంఘించి నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారిక రికార్డుల్లో తేలితే వాటిని రద్దు చేయడానికి వెనుకాడబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల సంఘానికి, కేంద్రానికి నోటీసులు ఇచ్చి రికార్డులు తెప్పించుకుంటామని కోర్టు చెప్పింది. ఇది దేశ ప్రజాస్వామ్యానికి చిన్న హెచ్చరిక కాదు.

ఇక్కడ ప్రధాన ప్రశ్న ఫామ్ సిక్స్ విషయంలోనే. ఎన్నికల సంఘానికి ఆ సవరణ చేసే అధికారం లేదని సహచర ఎన్నికల కమిషనర్ల అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, వారి అభ్యంతరాలను పట్టించుకోకుండా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పార్లమెంటు చట్ట సవరణ చేయాల్సిన అంశాన్ని, చట్టంలో మార్పు లేకుండానే ఎన్నికల సంఘం తనకు లేని అధికారాన్ని వినియోగించి మార్చినట్లయితే అది సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు. చట్టాన్ని రూపొందించే అధికారం పార్లమెంటుదే.. దాన్ని అమలు చేసే బాధ్యత ఎన్నికల సంఘానిది. చట్టంలో లేని అధికారాన్ని స్వయంగా వినియోగించుకోవడం చట్ట అమలు కాదు.. అధికార పరిధిని దాటడమే.

అందుకే ప్రశ్న ఒక్క నిర్ణయం గురించే కాదు.. నిర్ణయం తీసుకున్న విధానం గురించి కూడా. బహుళ సభ్యుల ఎన్నికల సంఘంలో సహచర కమిషనర్ల అభ్యంతరాలను ఎందుకు పట్టించుకోలేదు? విభేదాలను నమోదు చేశారా? చట్టపరమైన అభ్యంతరాలను ఎందుకు పక్కనపెట్టారు? వీటన్నింటికీ అధికారిక రికార్డులే సమాధానం చెప్పాలి.

ఇలాంటి పరిస్థితిలో ఎన్నికల సంఘం ప్రతిష్ఠకు అత్యంత కీలకమైనది ప్రజల విశ్వాసం. ఓటరుకు ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, చట్ట పరిధిలోనే పనిచేస్తుందన్న నమ్మకం లేకపోతే ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే ఈ ఆరోపణలను తేలికగా తీసుకోవడం సాధ్యం కాదు.

పత్రికా కథనాల ఆధారంగా నేరుగా ఆదేశాలు ఇవ్వలేమని కోర్టు చెప్పింది నిజమే. కానీ ఆరోపణలను పరిశీలించేందుకు అధికారిక రికార్డులు కోరడం కూడా అంతే ముఖ్యమైన విషయం. రికార్డుల్లో చట్ట ఉల్లంఘన తేలితే నిర్ణయాలు రద్దవడమే కాదు.. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. జ్ఞానేష్ కుమార్ ముందున్న మార్గం స్పష్టంగా ఉంది. తాను చట్ట పరిధిలోనే వ్యవహరించానని నమ్మకం ఉంటే పూర్తి రికార్డులను కోర్టు ముందు ఉంచి నిరూపించుకోవాలి. ముఖ్యంగా ఫామ్ సిక్స్ సవరణకు ఎన్నికల సంఘానికి అధికారం ఉందని స్పష్టమైన చట్టపరమైన ఆధారం చూపాలి. లేదంటే నైతిక బాధ్యత వహించి తప్పుకోవాలి. అత్యున్నత న్యాయస్థానం విచారణ ఎదుర్కొంటున్న పరిస్థితిలో పదవిలో కొనసాగడం కంటే ప్రజాస్వామ్య సంస్థ ప్రతిష్ఠను కాపాడే నిర్ణయం తీసుకోవడమే గౌరవప్రదం. రాజీనామా చేయకుండా కొనసాగడం దేనికి? దేశం సమాధానం కోరుతోంది.

# జైలు గోడల వెనుక పేదలే ఎందుకు?



"భారతదేశంలోని జైళ్లలో 90 శాతం మంది పేదలే ఉన్నారు. కొందరికి తాము ఎందుకు అరెస్టయ్యారో, ఏ కేసులో జైలుకు వచ్చారో కూడా తెలియదు. ప్రజలకు పోలీసులతో ఎలాంటి ప్రయోజనం లేదు. పోలీస్ అకాడమీలు డంపింగ్ యార్డులుగా మారాయి. పోలీసులు అధికారానికి కాదు, చట్టానికి జవాబుదారీగా ఉండాలి" – తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న ఐపీఎస్ అధికారి వీకే సింగ్ 2019లో చేసిన ఈ వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం సృష్టించాయి.

అయితే అసలు ప్రశ్న ఏమిటంటే–ఇలాంటి ఆలోచనలు ఒక్క వీకే సింగ్‌కే వచ్చాయా? సమాధానం స్పష్టంగా "కాదు". భారత న్యాయవ్యవస్థ, పోలీసు సంస్కరణల కోసం పోరాడిన ఉన్నతాధికారు లు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, మేధావులు దశాబ్దాలుగా ఇదే సమస్యను వివిధ రూపాల్లో ఎత్తిచూపుతున్నారు. వీకే సింగ్ వ్యాఖ్యలు ఆ దీర్ఘకాలిక ఆందోళనకు మరో ప్రతిధ్వని మాత్రమే.

1979లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి నేతృత్వంలోని బెంచ్ "హుస్సైనారా ఖాతూన్ వర్సెస్ హోం సెక్రటరీ, బీహార్" కేసులో దేశంలోని అండర్‌ట్రయల్ ఖైదీల దుస్థితిని తీవ్రంగా ప్రశ్నించింది. నేరం నిరూపితం కాకముందే సంవత్సరాల తరబడి జైలులో మగ్గుతున్న పేద ఖైదీల పరిస్థితిని కోర్టు "షాకింగ్"గా పేర్కొంది. డబ్బులేక బెయిల్ ఇవ్వలేక జైలులో ఉండటం న్యాయానికి అవమానమని చెప్పింది. పేద నిందితుడికి ఉచిత న్యాయ సహాయం కల్పించడం దానం కాదని, అది రాజ్యాంగ బద్ధమైన బాధ్యత అని స్పష్టం చేసింది.

అదే కాలంలో జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ జైలు సంస్కరణలను మానవ హక్కుల ప్రశ్నగా మలిచారు. "సునీల్ బాత్రా" కేసుల్లో జైలు గోడలు రాజ్యాంగ హక్కులను ఆపలేవని ఆయన న్యాయతత్వం స్పష్టం చేసింది. ఏ ఖైదీ అయినా నేరస్తుడిగా శిక్షపడిన తర్వాత కూడా మానవుడే; జైలులో ఉన్నంత మాత్రాన అతని గౌరవం, మానవ హక్కులు పూర్తిగా రద్దు కావు. సుప్రీంకోర్టు తరువాతి తీర్పులు కూడా కృష్ణ అయ్యర్ ఆలోచనలను పునరుద్ఘాటించాయి.

జస్టిస్ కృష్ణ అయ్యర్ మహిళా ఖైదీల పరిస్థితిపై కూడా ప్రత్యేకంగా పనిచేశారు. 1986లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా ఖైదీలపై నేషనల్ ఎక్స్‌పర్ట్ కమిటీకి ఆయన అధ్యక్షత వహించారు. అదే సమయంలో జస్టిస్ ఎ.ఎన్. ముల్లా నేతృత్వంలోని ఆల్ ఇండియా కమిటీ ఆన్ జైల్ రిఫార్మ్స్ 1983లో విస్తృతమైన జైలు సంస్కరణలను సూచించింది. అంటే "జైలు అంటే కేవలం బంధించే స్థలం కాదు; సంస్కరణ, పునరావాసానికి అవకాశం కల్పించే వ్యవస్థ" అనే భావన కొత్తది కాదు.

ఇదే సమస్యను మరో కోణంలో మాజీ ఉత్తరప్రదేశ్, అసోం డీజీపీ ప్రకాశ్ సింగ్ ప్రస్తావించారు. పదవీ విరమణ తర్వాత ఆయన పోలీసు సంస్కరణల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2006లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పులో పోలీసులపై రాజకీయ జోక్యాన్ని తగ్గించడం, పోలీసు అధికారులకు స్థిరమైన పదవీకాలం ఇవ్వడం, పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డులు, రాష్ట్ర భద్రతా కమిషన్లు, పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీలు ఏర్పాటు చేయడం వంటి కీలక మార్గదర్శకాలు ఇచ్చింది. పోలీసు వ్యవస్థ ప్రజలకు సేవ చేయాలి; వ్యక్తి హోదా, సంపద ఆధారంగా పోలీసు ప్రవర్తన మారకూడదని ఆ తీర్పు స్పష్టం చేసింది.

అంటే వీకే సింగ్ చెప్పిన "డబ్బు, అధికారం ఉన్నవారితోనే పోలీసులు స్నేహంగా ఉంటున్నారు" అన్న విమర్శకు రాజ్యాంగపరమైన నేపథ్యం ఉంది. పోలీసు వ్యవస్థను రాజకీయ అధికారానికి అనుబంధంగా కాకుండా చట్టానికి విధేయమైన స్వతంత్ర వృత్తిపరమైన సంస్థగా మార్చాలన్నదే ప్రకాశ్ సింగ్ కేసు ప్రధాన ఉద్దేశం. కానీ దాదాపు రెండు దశాబ్దాల తరువాత కూడా ఆ సంస్కరణలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న విమర్శ కొనసాగుతూనే ఉంది.

అరెస్టు విషయంలో కూడా సుప్రీంకోర్టు ఎన్నోసార్లు హెచ్చరించింది. "జోగిందర్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్"లో కేవలం అరెస్టు చేసే చట్టబద్ధమైన అధికారం ఉందనే కారణంతో అరెస్టు చేయకూడదని కోర్టు చెప్పింది. అరెస్టుకు వాస్తవమైన అవసరం, సమర్థించగల కారణం ఉండాలని స్పష్టం చేసింది. "డీ.కే. బసు" కేసులో కస్టడీలో హింసను అరికట్టేందుకు అరెస్టు, నిర్బంధ ప్రక్రియకు కఠినమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

జస్టిస్ మదన్ బి. లోకూర్ కూడా జైళ్లలో అండర్‌ట్రయల్ ఖైదీల అధిక సంఖ్యపై తీవ్రంగా స్పందించారు. 2015లో "రీ–ఇన్‌హ్యూమన్ కండిషన్స్ ఇన్ 1382 ప్రిజన్స్" కేసులో సుప్రీంకోర్టు ముందు ఉన్న గణాంకాల ప్రకారం అప్పట్లో జైళ్లలోని ఖైదీలలో సుమారు 67 శాతం మంది అండర్‌ట్రయల్స్. అనంతరం అండర్‌ట్రయల్ రివ్యూ కమిటీలను సమర్థంగా పనిచేయించాలని కోర్టు చర్యలు తీసుకుంది.

ఇది ఇప్పటికీ ఎంత పెద్ద సమస్యో తాజా గణాంకాలు చెబుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2024 గణాంకాల ప్రకారం దేశంలోని జైళ్లలో 5,11,542 మంది ఉండగా, వారిలో 3,71,440 మంది–అంటే 72.6 శాతం–అండర్‌ట్రయల్ ఖైదీలు. జైళ్ల మొత్తం ఆక్యుపెన్సీ కూడా 112.7 శాతంగా ఉంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2024 చివరికి దాదాపు 9,000 మందికి పైగా అండర్‌ట్రయల్స్ ఐదేళ్లకు మించి జైలులో ఉన్నారు. పేదరికం, బెయిల్, న్యాయ సహాయం మధ్య ఉన్న సంబంధాన్ని కూడా విస్మరించలేం. సుప్రీంకోర్టు సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్ అధ్యయనం ప్రకారం, బెయిల్ మంజూరైనప్పటికీ బెయిల్ బాండ్లు సమర్పించలేక జైలులోనే కొనసాగుతున్న ఖైదీలు ఉన్నారు. అంటే చట్టపరంగా స్వేచ్ఛ లభించినా ఆ స్వేచ్ఛను ఆచరణలో కొనుగోలు చేయలేని పరిస్థితి పేదలకు ఎదురవుతోంది. ఇదే "చట్టం ముందు సమానత్వం"కు ఉన్న అతిపెద్ద పరీక్ష.

ఇక్కడ న్యాయవాది, మేధావి డాక్టర్ ఉపేంద్ర బక్షి వంటి వారి కృషిని కూడా గుర్తు చేసుకోవాలి. ఆయన పేరుతో వచ్చిన ప్రజాహిత వ్యాజ్యాల్లో నిర్బంధ గృహాల్లోని అమానవీయ పరిస్థితులు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చాయి. సీనియర్ అడ్వకేట్ కోలిన్ గోన్సాల్వేస్ కూడా అండర్‌ట్రయల్ ఖైదీల దీర్ఘకాలిక నిర్బంధం, బెయిల్ హక్కు, ఖైదీల మానవ హక్కుల కోసం న్యాయపోరాటాలు చేశారు. జైలు సంస్కరణలపై ఆయన సంపాదకత్వంలో వెలువడిన "ప్రిజనర్స్ రైట్స్" వంటి న్యాయ సంకలనాలు కూడా ఈ అంశంపై సాగిన న్యాయ ఉద్యమానికి ఉదాహరణలు.

అందువల్ల వీకే సింగ్ ప్రశ్నను కేవలం "ఒక ఐపీఎస్ అధికారి వివాదాస్పద వ్యాఖ్యలు"గా చూడటం సమస్యను చిన్నది చేయడమే. అసలు ప్రశ్న మరింత లోతైనది. పేదవాడు పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లినప్పుడు అతనికి రక్షణ లభిస్తున్నదా? అరెస్టయినప్పుడు తన హక్కులు తెలుసుకునే అవకాశం ఉందా? బెయిల్ పొందడానికి అతని దగ్గర డబ్బు లేకపోతే న్యాయం అతనికి అందుతున్నదా? పోలీసు అధికారి తన రాజకీయ లేదా అధికార సంబంధాల కంటే రాజ్యాంగానికి విధేయుడిగా పనిచేస్తున్నాడా? జైలులో ఉన్న వ్యక్తిని మనిషిగా చూస్తున్నామా?

ప్రజాస్వామ్యంలో పోలీసు ప్రజలపై అధికారాన్ని ప్రదర్శించే సంస్థ కాదు; ప్రజల హక్కులను రక్షించే సంస్థ. జైలు ప్రతీకార కేంద్రం కాదు; న్యాయం పూర్తయ్యే వరకు వ్యక్తిని చట్టబద్ధంగా నిర్బంధించే స్థలం, సాధ్యమైన చోట సంస్కరణకు మార్గం చూపే వ్యవస్థ. న్యాయస్థానం నేరాన్ని నిరూపించే వరకు ఒక నిందితుడు నేరస్తుడు కాదు. ఈ ప్రాథమిక సూత్రం పేదవాడికి మాత్రమే వర్తించకుండా, ధనవంతుడికీ, అధికారవంతుడికీ సమానంగా వర్తించినప్పుడే రాజ్యాంగం సజీవంగా ఉంటుంది.

కాబట్టి పోలీసు శిక్షణలో ఆయుధ వినియోగం, చట్టాల పఠనం, నేర పరిశోధన ఎంత ముఖ్యమో, పౌర హక్కులు, రాజ్యాంగ నైతికత, పేదలతో వ్యవహరించే తీరు, కస్టడీ హక్కులు, మానవ గౌరవం, రాజకీయ ఒత్తిడిని నిరాకరించే వృత్తి ధైర్యం కూడా అంతే ముఖ్యమైనవి. వీకే సింగ్ "అకాడమీలు డంపింగ్ యార్డులుగా మారాయి" అన్న వ్యాఖ్య వెనుక ఉన్న అసలు హెచ్చరిక ఇదే.

దేశంలో జైళ్లు పేదలతో నిండిపోతున్నాయంటే సమస్య కేవలం జైళ్లలో లేదు. అది పోలీస్ స్టేషన్ నుంచి మొదలై, దర్యాప్తు వ్యవస్థ, బెయిల్ విధానం, న్యాయ సహాయం, ప్రాసిక్యూషన్, న్యాయస్థానాల ఆలస్యం వరకు విస్తరించిన మొత్తం క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు సంబంధించిన సమస్య. ఆ వ్యవస్థలో డబ్బు ఉన్నవాడికి వేగంగా న్యాయం, పేదవాడికి దీర్ఘకాలిక నిర్బంధం అనే పరిస్థితి కొనసాగితే, చట్టం సమానంగా ఉందని చెప్పడం రాజ్యాంగ సత్యం కాదు–కాగితంపై ఉన్న ఓ హామీ మాత్రమే.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# పల్లె మట్టిలో పుట్టిన ప్రజాకవి మామిండ్ల సాయిలు

*తెలంగాణ సాహిత్య చరిత్రలో ప్రజల జీవితాల నుంచి పుట్టిన సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. పుస్తకాలలో చదివిన జీవితాన్ని కాదు. తాను చూసిన సమాజాన్ని, అనుభవించిన బాధను, పల్లె ప్రజల కష్టాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని, సామాజిక వాస్తవాలను పాటగా మలిచిన కవులు తెలంగాణ నేలపై ఎందరో ఉన్నారు. వారిలో మామిండ్ల సాయిలు ఒకరు. సాహిత్య సంస్థల వెలుగులకు దూరంగా, పల్లె మట్టిలో జీవిస్తూ ప్రజల మధ్య నుంచి ఎదిగిన ఈ జానపద కవి పేరు తెలంగాణ ప్రజా సంస్కృతి చరిత్రలో గుర్తించాల్సిన పేరు.*



పాల్కురికి సోమనాథుడు పుట్టిన పాలకుర్తి నేల కవిత్వానికి, జానపద కళలకు, ప్రజా చైతన్యానికి సుదీర్ఘ వారసత్వాన్ని అందించింది. అదే నేలపై మామిండ్ల సాయిలు జానపద కవిగా ఎదిగారు. ఆయనకు సాహిత్యం పుస్తకాల నుంచి రాలేదు. జీవితం నుంచే వచ్చింది. పొలం, పశువులు, చెరువు, పల్లె, శ్రమజీవుల బతుకు, ప్రకృతి, పేదరికం, దోపిడీ, ప్రజల పోరాటాలు ఆయన సాహిత్యానికి వస్తువులు. అందుకే ఆయన పాటల్లో పల్లె జీవితం కేవలం కనిపించదు, జీవిస్తుంది.

ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి గ్రామంలో 1930 ప్రాంతంలో మామిండ్ల లక్ష్మీదేవి, సోమయ్య దంపతులకు పది మంది సంతానం. ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలలో సాయిలు చివరి సంతానం. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఆ కుటుంబం సంప్రదాయంగా మత్స్యకార వృత్తిపై ఆధారపడింది. ఆర్థిక ఇబ్బందులు బాల్యాన్నే శ్రమలోకి నెట్టాయి. పశువులు మేపడం, వ్యవసాయ పనులు చేయడం, కుటుంబ జీవనానికి తోడ్పడటం ఆయన బాల్యంలోనే అలవాటయ్యాయి.

పాఠశాల విద్య సాయిలుకు అందలేదు. కొద్దికాలం రాత్రి బడిలో చదివినప్పటికీ, అక్షరాలపై ఆయనకు ఉన్న ఆసక్తి ఆగలేదు. పాఠశాల గడప దాటలేకపోయినా జ్ఞానాన్ని వెతుక్కోవడం మాత్రం ఆపలేదు. గాలికి ఎగిరివచ్చిన పాత పత్రికలను ఏరుకుని, వాటిలోని అక్షరాలను గుర్తిస్తూ స్వయంగా చదవడం నేర్చుకున్నారు. తన విద్యాభ్యాసాన్ని ఆయన స్వయంగా ఇలా గుర్తుచేసుకున్నారు.

"పెంట గడ్డలపైన పేపర్లు గాలికి కొట్టుకుపోవంగా పట్టుకొనియూ ఇదే ఇ, ఈయని, అదే అ, ఆయని సంతోషమందు చదువుకొంటి" ఈ పంక్తుల్లో ఒక నిరక్షరాస్య గ్రామీణ బాలుడు అక్షరజ్ఞానం కోసం చేసిన పోరాటం కనిపిస్తుంది. పాఠశాల ఆయనకు విద్య ఇవ్వలేదు. జీవితం ఇచ్చింది. పుస్తకాలు అందుబాటులో లేకపోయినా పత్రికలే ఆయనకు పాఠ్యపుస్తకాలయ్యాయి. ప్రజలే ఆయన గురువులయ్యారు. అనుభవమే ఆయన విశ్వవిద్యాలయమైంది. సాయిలు బాల్యం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో గడిచింది. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలు, విస్నూర్ దేశ్‌ముఖ్ దమనకాండ, గ్రామీణ ప్రజలపై జరిగిన దోపిడీ, హింస ఆయన కళ్లముందే జరిగాయి. మరోవైపు ఆ దమనానికి వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేదలు, మహిళలు సాగించిన ప్రతిఘటనను కూడా చూశారు. ఈ అనుభవాలు ఆయనలో చిన్న వయసులోనే సామాజిక స్పృహను పెంచాయి.

సాయిలు కుటుంబానికీ రైతాంగ పోరాటంతో సన్నిహిత సంబంధం ఉంది. ఆయన సోదరుడు మామిండ్ల రామయ్య రజాకార్ల చేత చిత్రహింసలకు గురయ్యారు. మామిండ్ల ఐలయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడిగా నిలిచారు. కుటుంబంలోని పలువురు కమ్యూనిస్టు ఉద్యమానికి సహకరించారు. ఈ వాతావరణంలో పెరిగిన సాయిలు బాల కమ్యూనిస్టుగా వాలంటీర్‌గా పనిచేశారు. ప్రజల విముక్తి కోసం సాగిన ఉద్యమాన్ని దగ్గరగా చూశారు. ఆ అనుభవం ఆయన జీవితాంతం కొనసాగిన కమ్యూనిస్టు నిబద్ధతకు పునాది వేసింది. సాయిలు కేవలం పాటలు పాడిన జానపద కళాకారుడు కాదు. ప్రజల జీవితం నుంచి పాటను పుట్టించిన కవి. గ్రామీణ సమాజంలోని సంబంధాలు, శ్రమ, పేదరికం, ప్రకృతి, నమ్మకాలు, బాధలు, ఆశలు, సామాజిక వైరుధ్యాలు ఆయన గేయాల్లో ప్రతిఫలించాయి. కథలు చెప్పడం, భజనలు నిర్వహించడం, పాటలు పాడటం ద్వారా ఆయన పల్లె సంస్కృతిని ప్రజల మధ్య సజీవంగా ఉంచారు. ఆయన కళకు వేదిక ప్రజలే. ప్రేక్షకులు కూడా ప్రజలే. అందుకే ఆయన సాహిత్యంలో కృత్రిమతకు చోటు లేదు.

ఆయన కవిత్వానికి గొప్ప బలం మౌఖిక సంప్రదాయం. పుస్తకాలలో బంధించని అనేక గేయాలు ప్రజల నోటినుంచి ప్రజలకే చేరాయి. గ్రామీణ భాష, స్థానిక పలుకుబడి, సామెతలు, జీవన అనుభవాలతో ఆయన పాటలు సహజంగా రూపుదిద్దుకున్నాయి. తెలంగాణ మాండలికంలోని జీవం ఆయన సాహిత్యానికి ప్రత్యేకతను ఇచ్చింది. పల్లె మనిషి ఎలా మాట్లాడతాడో, ఎలా ఆలోచిస్తాడో, ఎలా బాధపడతాడో ఆయన పాటల్లో అదే స్వరం వినిపిస్తుంది. సాయిలు జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులను గుర్తించాలి. పేదరికం ఆయనను వెనక్కి నెట్టలేదు. నిరక్షరాస్యత ఆయన సృజనను ఆపలేదు. వృత్తిపరమైన పరిమితులు ఆయన ఆలోచనలకు అడ్డుకాలేదు. ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు అనుభవ సంపదను ఇచ్చింది. అందుకే ఆయనకు ప్రజల జీవితం పుస్తకమైంది; శ్రమజీవి అనుభవం సాహిత్యమైంది.

1993లో సోమనాథ కళాపీఠం ఆయనకు "జానపద బ్రహ్మ" బిరుదు ప్రదానం చేయడం ఆయన కళా జీవితానికి లభించిన ముఖ్యమైన గుర్తింపు. అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు ఆయనను సన్మానించాయి. అయితే గౌరవాలు వచ్చిన తరువాత కూడా ఆయన జీవనశైలి మారలేదు. ప్రజల మధ్యే ఉన్నారు. తన మూలాలను విడిచిపెట్టలేదు. తనను తాను ప్రజల కంటే ఎత్తులో నిలబెట్టుకోలేదు. 2000 అక్టోబర్ 7న మామిండ్ల సాయిలు మరణించారు. ఒక మనిషి జీవితం ముగిసింది. కానీ ఆయన సృష్టించిన ప్రజా జ్ఞాపకం ముగియలేదు. ఆయన పాటలు పల్లెల్లో మిగిలాయి. ఆయన కథలు ప్రజల నోట నిలిచాయి. ఆయన జీవితం తెలంగాణ ప్రజా సంస్కృతిలో ఒక విలువైన జ్ఞాపకంగా మిగిలింది.

మామిండ్ల సాయిలును కేవలం ఒక జానపద కవిగా గుర్తించడం ఆయన స్థాయిని చిన్నదిగా చేయడమే. ఆయన ఒక కాలానికి సాక్షి. ఒక ప్రజా ఉద్యమానికి అనుబంధితుడు. శ్రమజీవి జీవితాన్ని సాహిత్యంగా మలిచిన సృజనకారుడు. పాఠశాల విద్య లేకపోయినా స్వయంకృషితో అక్షరాలను నేర్చుకుని ప్రజాకవిగా ఎదిగిన అసాధారణ వ్యక్తి. తెలంగాణ సాహిత్య చరిత్రలో వెలుగులోకి రాని ఇలాంటి ప్రజా సృజనకారుల జీవితాలను వెలికితీయడం అవసరం. ఎందుకంటే సాహిత్య చరిత్ర పుస్తకాల్లో ప్రచురితమైన రచనల చరిత్ర మాత్రమే కాదు; ప్రజల నోట జీవించిన పాటల చరిత్ర కూడా. మామిండ్ల సాయిలు ఆ ప్రజా సాహిత్య వారసత్వానికి ప్రతినిధి. పల్లె మట్టిలో పుట్టి, శ్రమజీవుల మధ్య పెరిగి, ప్రజా పోరాటాల స్ఫూర్తితో ఎదిగి, తన అనుభవాలను పాటగా మలిచిన మామిండ్ల సాయిలు పేరు తెలంగాణ ప్రజా సాహిత్యంలో చిరస్థాయిగా నిలవాలి. ఆయన జీవితం ఒక నిజాన్ని చెబుతుంది. అక్షరాలు పాఠశాలలోనే పుట్టవు, ప్రజల జీవితాల్లోనూ పుడతాయి. కవిత్వం పుస్తకాలలోనే ఉండదు, శ్రమించే ప్రజల గొంతుల్లోనూ జీవిస్తుంది.



- మామిండ్ల రమేష్ రాజా
సెల్: 78932 30218

# నీటి కోసం ప్రపంచం - ఎదురుచూపులు!

*నీరు లేకుండా జీవితం లేదు. మనిషి ఆవిర్భావం నుంచి నాగరికతల నిర్మాణం వరకు నీరే కేంద్రబిందువుగా నిలిచింది. ప్రపంచంలోని గొప్ప నాగరికతలన్నీ నదుల ఒడ్డునే అభివృద్ధి చెందాయి. అయితే ఆధునిక నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనిషి నీటి విలువను మరచి పోతున్నాడు. జనాభా పెరుగుతోంది, నగరాలు విస్తరిస్తున్నాయి, పరిశ్రమలు పెరుగుతున్నాయి, వ్యవసాయానికి నీటి అవసరం పెరుగుతోంది. అదే సమయంలో అడవులు తగ్గుతున్నాయి, చెరువులు కనుమరుగవుతున్నాయి, భూగర్భ జలాలను విచక్షణారహితంగా తోడేస్తున్నారు. వాతావరణ మార్పు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. ఫలితంగా నీటి సంక్షోభం ఇప్పుడు భవిష్యత్తు సమస్య కాదు; ఇప్పటికే ప్రపంచంలోని అనేక ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న అత్యవసర సమస్య.*



ఐక్యరాజ్యసమితి అనేక సంవత్సరాలుగా ప్రపంచాన్ని నీటి భద్రత విషయంలో హెచ్చరిస్తూనే ఉంది. 2015లో విడుదల చేసిన ఐక్యరాజ్యసమితి ప్రపంచ జల అభివృద్ధి నివేదిక అప్పటి ధోరణులు కొనసాగితే 2030 నాటికి ప్రపంచంలో నీటి సరఫరా–అవసరాల మధ్య దాదాపు 40 శాతం లోటు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అంటే ప్రపంచం నీటి వినియోగం, సంరక్షణ, పునర్వినియోగం, నిర్వహణ విధానాలను సమూలంగా మార్చకపోతే 2030 నాటికి నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. "2030లో ప్రపంచం మొత్తం నీరు అయిపోతుంది" అనే అర్థం ఈ హెచ్చరికకు లేదు. నీటి కొరత ప్రాంతానుసారం, వాతావరణ పరిస్థితులనుసారం, జనాభా, ఆర్థిక అభివృద్ధి, నీటి నిర్వహణ సామర్థ్యాలనుసారం మారుతుంది. అయితే నీటి డిమాండ్ పెరుగుతున్న వేగానికి అనుగుణంగా నీటి వనరులను నిర్వహించలేకపోతే ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన అసమతుల్యత ఏర్పడుతుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. ఇప్పటికే పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఐక్యరాజ్యసమితి తాజా సమాచార ప్రకారం ప్రపంచ జనాభాలో సుమారు సగం మంది సంవత్సరంలో కనీసం కొంతకాలం తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. మరో అంచనా ప్రకారం సుమారు 4 బిలియన్ మంది ప్రజలు సంవత్సరంలో కనీసం ఒక నెల తీవ్రమైన నీటి కొరతను అనుభవిస్తున్నారు. నీటి వినియోగంలో వ్యవసాయ రంగం అత్యంత పెద్ద వినియోగదారుగా ఉంది. ఐక్యరాజ్యసమితి––యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మంచినీటి ఉపసంహరణలో వ్యవసాయం దాదాపు 70 శాతం వాటాను కలిగి ఉంది. పరిశ్రమల వాటా 20 శాతానికి కొద్దిగా తక్కువగా ఉండగా, గృహ––పట్టణ వినియోగం సుమారు 12 శాతంగా ఉంది. తాజా 2025 ప్రపంచ జల అభివృద్ధి నివేదికలో వ్యవసాయం వాటా సుమారు 72 శాతం, పరిశ్రమ 15 శాతం, గృహ వినియోగం 13 శాతంగా నమోదైంది.

అంటే నీటి సంక్షోభాన్ని పరిష్కరించాలంటే ఇంట్లో కుళాయి మూసివేయడం మాత్రమే సరిపోదు. వ్యవసాయంలో నీటి సామర్థ్యాన్ని పెంచడం, పరిశ్రమల్లో నీటి పునర్వినియోగాన్ని పెంచడం, పట్టణ నీటి సరఫరాలో లీకేజీలను తగ్గించడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పునర్భర్తీ చేయడం వంటి సమగ్ర చర్యలు అవసరం.

ప్రపంచ నీటి సంక్షోభంలో మరో తీవ్రమైన అంశం భూగర్భ జలాలపై పెరుగుతున్న ఆధారపడటం. ప్రపంచవ్యాప్తంగా సాగునీటి అవసరాల్లో సుమారు నాలుగో వంతు భూగర్భ జలాల ద్వారా నెరవేరుతోంది. గృహ అవసరాలకు ఉపయోగించే మంచినీటిలో కూడా భూగర్భ జలాల పాత్ర చాలా పెద్దది. ఒకసారి భూగర్భ జలమట్టం తీవ్రంగా పడిపోతే దాన్ని తిరిగి సహజ స్థాయికి తీసుకురావడానికి సంవత్సరాలు, కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాలు పట్టవచ్చు. అందువల్ల భూగర్భ జలాలను అంతులేని వనరులుగా భావించడం అత్యంత ప్రమాదకరం.

నీటి సమస్య కేవలం నీటి పరిమాణానికి సంబంధించినది కాదు. నీటి నాణ్యత కూడా అంతే ముఖ్యమైనది. కలుషితమైన నీరు అందుబాటులో ఉన్నా అది తాగడానికి పనికిరాదు. పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ రసాయనాలు, మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు నదులు, చెరువులు, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నీరు ఉన్నప్పటికీ సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేకపోవడం కూడా ఒక పెద్ద సంక్షోభమే. ఐక్యరాజ్యసమితి–యునెస్కో 2025 నివేదిక ప్రకారం 2022లో 2.2 బిలియన్ మంది ప్రజలకు సురక్షితంగా నిర్వహించబడే తాగునీటి సౌకర్యం అందుబాటులో లేదు.

వాతావరణ మార్పు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రమం చేస్తోంది. హిమనదులు కరుగుతున్నాయి. పర్వత ప్రాంతాల నుంచి ప్రపంచంలోని అనేక నదులకు వచ్చే నీటి ప్రవాహాలపై దీని ప్రభావం పడుతోంది. 2025 ఐక్యరాజ్యసమితి ప్రపంచ జల అభివృద్ధి నివేదిక ప్రకారం ప్రపంచ వార్షిక మంచినీటి ప్రవాహాల్లో సుమారు 55–60 శాతం పర్వత ప్రాంతాల నుంచి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2 బిలియన్ మంది ప్రజలు పర్వత జలాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల కొనసాగితే 2100 నాటికి ప్రస్తుత ఉష్ణోగ్రత పెరుగుదల పరిస్థితులపై ఆధారపడి పర్వత హిమనదుల ద్రవ్యరాశిలో 26–41 శాతం వరకు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నివేదిక హెచ్చరిస్తోంది.

దీని అర్థం ఏమిటంటే నీటి భవిష్యత్తు కేవలం నదులు, చెరువులతో నిర్ణయించబడదు. హిమనదులు, పర్వతాలు, అడవులు, నేల, భూగర్భ జలాలు అన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమైన సహజ వ్యవస్థలు. ఈ వ్యవస్థలో ఒక భాగాన్ని ధ్వంసం చేస్తే దాని ప్రభావం మరొక ప్రాంతానికి చేరుతుంది. 2050 నాటికి పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఐక్యరాజ్యసమితి సమాచార ప్రకారం ప్రపంచ నీటి డిమాండ్ 2050 నాటికి ప్రస్తుత స్థాయి కంటే 20–30 శాతం పెరిగే అవకాశం ఉంది. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, జీవన ప్రమాణాల మార్పు దీనికి ప్రధాన కారణాలు. మరో ఆందోళనకరమైన అంచనా ఏమిటంటే, 2050 నాటికి ప్రపంచంలో తీవ్రమైన నీటి కొరతకు గురయ్యే ప్రజల సంఖ్య 2.7 నుంచి 3.2 బిలియన్లకు చేరే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి సంబంధిత గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాలతో పోలిస్తే ఇది భవిష్యత్తులో సమస్య ఎంత విస్తరించవచ్చో చూపిస్తుంది.

నీటి కొరత ఆర్థిక వ్యవస్థపై కూడా భారీ ప్రభావం చూపుతుంది. నీరు లేకపోతే వ్యవసాయం దెబ్బతింటుంది. వ్యవసాయం దెబ్బతింటే ఆహార భద్రత దెబ్బతింటుంది. పరిశ్రమలకు నీరు అందకపోతే ఉత్పత్తి తగ్గుతుంది. విద్యుత్ ఉత్పత్తి, ఆరోగ్యం, పట్టణ జీవనం, ఉపాధి అన్నీ ప్రభావితమవుతాయి. ఐక్యరాజ్యసమితి 2019 నివేదిక ప్రకారం సహజ వనరుల క్షీణత, ప్రపంచ నీటి వనరులపై అస్థిరమైన ఒత్తిడి ప్రస్తుత ధోరణుల్లో కొనసాగితే 2050 నాటికి ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో 45 శాతం, ప్రపంచ ధాన్య ఉత్పత్తిలో 40 శాతం ప్రమాదంలో పడే అవకాశం ఉందని అంచనా వేసింది. అందువల్ల నీటి సంక్షోభం పర్యావరణ సమస్య మాత్రమే కాదు. అది ఆర్థిక సమస్య, ఆహార భద్రత సమస్య, ఆరోగ్య సమస్య, సామాజిక సమస్య, వలసల సమస్య, చివరకు శాంతి–భద్రతలకు సంబంధించిన సమస్య కూడా. నీటి కొరత పెరిగే కొద్దీ ఒకే నీటి వనరుపై ఆధారపడే ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య పోటీ పెరిగే అవకాశం ఉంటుంది.

నీటి వనరులపై సమానమై న హక్కు, న్యాయమైన పంపిణీ, అంతర్జాతీయ సహకారం అత్యవసరమవుతాయి.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఉదయం ప్రజావాణిలో.. సాయంత్రం ఏసీబీ వలలో..

- ఏసీబీ వలలో జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి
- రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఓ ప్రైవేట్ వ్యక్తి

**రంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో ఏసీబీ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తూ అవినీతి అధికారుల భరతం పడుతున్న జిల్లా స్థాయి అధికారుల తీరు మాత్రం మారడం లేదు. లక్షల రూపాయల లంచాలు తీసుకుంటూ ఏసీబీ వలలో పడుతున్నారు. అందులో భాగంగానే లక్ష రూపాయల లంచం తీసుకుంటూ జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి ఎసిపి అధికారులకు చిక్కారు. ఉదయం ప్రజావాణికి హాజరైన స్వర్ణకుమారి, సాయంత్రం ఏసీబీ అధికారులకు వలలో పడ్డారు. అందుకు సంబంధించిన వివరాలు.. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సంచలన దాడులు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా నడుస్తున్న ఫిజియోథెరపీ సెంటర్‌పై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి కొత్త లైసెన్స్ మంజూరు చేయడానికి లంచం డిమాండ్ చేసిన కేసులో డీఎంహెచ్‌ఓ, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో ప్రైవేట్ వ్యక్తి ఏసీబీకి చిక్కారు. రంగారెడ్డి జిల్లా



డీఎంహెచ్‌ఓ ఎస్. సువర్ణ కుమారి ఆదేశాల మేరకు, అదే కార్యాలయంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్, ఆయన ప్రైవేట్ డ్రైవర్ మద్దుల కృష్ణయ్య బాధితుడిని లంచం డిమాండ్ చేశారు. బాధితుడి సీజ్ చేసిన ఫిజియోథెరపీ సెంటర్ తాళాలు వెనక్కి ఇవ్వడానికి, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు మొదట రూ. 2 లక్షలు డిమాండ్ చేశారు. చివరికి రూ. 1,00,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.1,00,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుండా అక్రమ లబ్ధి కోసం అనైతిక చర్యలకు పాల్పడినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి వీరిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరుస్తున్నట్లు అధికారులు




వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచినట్లు తెలిపారు.

### లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి..

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఏసీబీ అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ ల, ఎక్స్ (ఏ తెలంగాణ ఏసీబీ) సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆనంద్ కుమార్ తెలిపారు. బాధితులు, ఫిర్యాదుదారుల పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు
- సర్పంచులు శంకరప్ప, విష్ణువర్ధన్ రెడ్డి

మోమిన్ పేట, అక్టోబర్ 5 (జనం సాక్షి) : అర్హులైన నిరుపేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం సంతోషించే దగ్గ విషయమని తెల్ల రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అమ్రాత్ కలాన్, సర్పంచ్ శంకరప్ప, టేకులపల్లి సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి లు పేర్కొన్నారు, సోమవారం మండల అమ్రాత్ కలానీ టేకులపల్లి గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ కార్డుల ప్రక్రియను వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉప సర్పంచ్ లో వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

- రాష్ట్ర నాయకులు శివరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి



**మర్పల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరాలని రాష్ట్ర నాయకులు శివరాజ్, మర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి హైదరాబాద్ మహబూబ్నగర్ రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాశాల ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇప్పటినుండే ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక శుద్ధి సాధించాలని వారు అన్నారు. మండలంలో అర్హులైన పట్టబదులందర్నీ గుర్తించి అత్యధిక సంఖ్యలో ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు నమోదుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కన్వీనర్ జంగం జైపాల్, కో కన్వీనర్ గణేష్, సంగమేష్, మధు, బలరాం గౌడ్, నాగన్న, లక్ష్మన్, గణేష్, మైపాల్ రెడ్డి, శుభాష్, రమేష్, భద్రన్న, మధు, మురళిందర్ రెడ్డి, రాజేష్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

# క్యారెట్ లేన్ గోల్డ్ షాపులో సినీ ఫక్కీలో చోరీ

- షట్టర్ పగులగొట్టి రూ.2 కోట్ల సొత్తుతో పరార్
- సీసీ కెమెరాల్లో 7 మంది దుండగులు...అంతరాష్ట్ర ముఠాపై అనుమానం
- మేడిపల్లిలో కలకలం..ప్రత్యేక బృందాలతో పోలీసుల వేట

**బోడుప్పల్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్యారెట్ లేన్ గోల్డ్ షాపులో జరిగిన భారీ చోరీ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సినీ ఫక్కీలో షట్టర్ పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు సుమారు రూ. 2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు,ఇతర విలువైన వస్తువులను అపహరించి పరారయ్యారు.ఈ ఘటన మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనంగా మారింది.సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో దుండగులు షాపు షట్టర్‌ను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.ఉదయం 7 గంటల ప్రాంతంలో బిల్డింగ్ వాచ్‌మన్



షట్టర్ ధ్వంసమైనట్లు గుర్తించి షాపు యాజమాన్యానికి సమాచారం అందించాడు. యాజమాన్యం అక్కడికి చేరుకుని పరిశీలించగా షాపులోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో భారీ చోరీ జరిగినట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న వెంటనే ఏసీపీ మోహన్ కుమార్, క్రైమ్ ఏసీపీ గుణశేఖర్, మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి, ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించి దర్యాప్తును ముమ్మరం చేశారు.

### సీసీ కెమెరాల్లో రికార్డు...

షాపులోని సీసీ కెమెరాల ఫుటేజీలో మొత్తం ఏడుగురు వ్యక్తులు షట్టర్ పగులగొట్టినట్లు, వారిలో ఒకరు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు స్పష్టంగా కనిపించినట్లు సమాచారం. నిందితుల కదలికలు, వ్యవహరించిన తీరు పరిశీలించిన పోలీసులు ఇది అంతరాష్ట్ర దొంగల ముఠా పని కావచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక బృందాల గాలింపు

దుండగులు ఏ మార్గంలో వచ్చారు,ఎంతసేపు షాపులో ఉన్నారు,చోరీ చేసిన సొత్తును ఎలా తరలించారు అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించి నిందితుల జాడ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.చోరీకి గురైన సొత్తు ఖచ్చితమైన విలువ యాజమాన్యం ఫిర్యాదు,దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్




**కల్వకుర్తి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** రెండు లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కల్వకుర్తి పోలీసులు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ,,అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి,స్కూటీ హామీలను సైతం నెరవేర్చాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి యువత తగిన గుణపాఠం చెబుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఉపసర్పంచ్‌పై దాడి..

- సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలి
- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్ డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 (జనం సాక్షి) : గుంతపల్లి గ్రామంలో ఉపసర్పంచ్ కరిమెల నర్సింగ్‌రావుపై జరిగిన దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన




గ్రామసభలో తనపై సర్పంచ్ హేమలత జంగయ్యగౌడ్ దాడి చేశారని ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అధికారిక కార్యక్రమాల్లో తన స్థానంలో సర్పంచ్ భర్త జంగయ్యగౌడ్ జోక్యం చేసుకుంటున్నారని, ప్రజా సమస్యలపై మాట్లాడినందుకు తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామసభలో పలువురి సమక్షంలో తనను చెప్పుతో కొట్టారని తెలిపారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో గ్యార మల్లేష్ మాట్లాడుతూ, "ఎన్నికైన ప్రజాప్రతినిధిపై దాడి జరిగిందన్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కుల వివక్షకు సంబంధించిన ఆరోపణలు నిజమైతే వాటిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. సర్పంచ్ హేమలత జంగయ్యగౌడ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, వార్డు సభ్యుడు చెరుకూరి అరుణ్, బీఎస్పీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు చిత్రం కృష్ణ, జిల్లా సామాజిక మాధ్యమాల కన్వీనర్ యంజాల ప్రహ్లాద్, కరిమెల శ్రీనివాస్, కరిమెల రవి, బత్తిని దేవేందర్‌గౌడ్, అంతటి నాగరాజుగౌడ్, బాబు, పచ్చల జంగయ్య, శ్రీకాంత్, యంజాల రాంబాబు, చిత్రం బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు కబ్జాపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** ఉప్పర్‌పల్లిలోని శ్రీ హస్త వీరభద్ర స్వామి, కాళికామాత సహిత హీరన్నగుట్ట దేవాలయ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పరిశీలించారు. దేవాలయ భూములను ఒక వర్గం వారు కొద్దికొద్దిగా ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో



రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ శాఖ, హైడ్రా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేను కలిసి దేవాలయ పరిధిలోని కోనేరు కబ్జాకు గురవుతున్న తీరును వివరించారు. కోనేరు చుట్టూ భారీ ప్రహరీ నిర్మించి స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, దేవాలయ భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే దేవాలయ భూమి అన్యాక్రాంతమైందని, అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కోనేరు వద్ద భారీ ప్రహరీ నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కబ్జాను అడ్డుకుని దేవాలయ ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. దేవాలయ భూములు, ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో బొమ్మ రాములు, ఈఓ రమాదేవి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, హైదర్గూడ డివిజన్ అధ్యక్షుడు సామా భూపాల్ రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు మహేష్ యాదవ్, వై శ్రీధర్, కొమురయ్య బొక్క బాల్రె రెడ్డి, సందీప్ ముదిరాజ్, బి.బాలకృష్ణ, ఎస్ వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించండి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** భూమి గర్భంలోని నేల బొగ్గును వెలికి తీసి తెలంగాణ రాష్ట్రానికి, ఇతర ప్రాంతాలకు వెలుగులు విరబూయిస్తున్న సింగరేణి కార్మికుల కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని, కార్మికుల జీవితాలు ఆధునిక సమాజానికి దూరంగా ఎదుగు బొదుగూ లేకుండా సాగిపోతున్నాయని శేరిలింగంపల్లి నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్చార్జి వాసిలి చంద్రశేఖర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకు నగరంలోని సింగరేణి భవన్ ముట్టడికి శేరిలింగంపల్లి నుండి భారీగా కార్యకర్తలు




నాయకులతోకలిసి వాసిలి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు అనాదిగా మూలిక సదుపాయాలు కొరత ఉంటుందని, భూమి అంతర్ పొరలలో పనిచేసే కార్మికులకు రకరకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్న వారికి నిర్దిష్టమైన వైద్య వ్యవస్థ లేదని, వైద్య సదుపాయం అందడం లేదన్నారు. నెలకు కనీసం రెండుసార్లు మెడికల్ బోర్డు సమావేశం ఏర్పాటు చేసి కార్మికులకు సరైన వైద్య సదుపాయం అందేలా ప్రభుత్వం చొరవ చూపాలని, సింగరేణి ద్వారా సమకూరుతున్న వనరులలో 35 శాతం వాటాను వారికి లాభాలుగా అందజేయాలని, సింగరేణిలో ఉద్యోగుల కొరత విపరీతంగా ఉన్నందున వెంటనే ఖాళీల భర్తీని పూర్తి చేయాలని, ప్రతి కార్మికుడికి సొంతింటి కలను నెరవేర్చాలని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అతి తక్కువ ధరకు క్యాంటీన్ ద్వారా అందించాలని వాసులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రతి స్వప్నాన్ని సహకారం చేయడమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన ఆశయమని, ఆశయ సాధన కోసం తాము అవిశ్రాంతంగా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

# 'జనంసాక్షి' కథనానికి సీఎంఓ స్పందన..

- రంగారెడ్డి జిల్లాలో ప్రజావాణిపై ఆరా
- ఇబ్రహీంపట్నం మండల ప్రజావాణి సందర్శన
- ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఓ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- అధికారుల గైర్హాజరీ, నిర్వహణ లోపాలపై తీవ్ర ఆగ్రహం
- ప్రతి దరఖాస్తుకు రిసిప్ట్

రంగారెడ్డి , అక్టోబర్ 5 (జనంసాక్షి) : వినతులు వింటారు.. పరిష్కరించరు.. ప్రజావాణి గోడు అధికారులకు వినిపించదా?" అనే శీర్షికన 'జనంసాక్షి' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) స్పందించింది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌తో పాటు వివిధ మండలాల్లో సోమవారం కొనసాగుతున్న 'ప్రజావాణి' కార్యక్రమాలపై సీఎంఓ ప్రత్యేకంగా దృష్టిసారించి ఆరా తీసింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంతో పాటు పలు మండలాల్లో ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజావాణి నిర్వహణ తీరుతెన్నులు, అధికారుల హాజరు శాతాన్ని పరిశీలించారు.

### అధికారుల గైర్హాజరీ, ఆలస్యంపై మండిపాటు..

ప్రజావాణికి సమయానికి రాకుండా ఆలస్యంగా వచ్చిన ఇబ్రహీంపట్నం అగ్రికల్చర్ (వ్యవసాయ) అధికారిపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, మున్సిపల్ శాఖ




కమిషనర్ ఎందుకు రాలేదని ప్రశ్నిస్తూ మందలించారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన క్షేత్రస్థాయి అధికారులు సైతం విధులకు గైర్హాజరు కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ఇదేం ప్రజావాణి నిర్వాహణ..?

కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్న తీరును చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. "కంప్యూటర్ ఆపరేటర్ ఎక్కడ? కంప్యూటర్ ఏదీ?" అంటూ సిబ్బందిని నిలదీశారు. కనీస సదుపాయాలు, బాధ్యత లేకుండా జరుగుతున్న ఈ తంతుపై మండిపడ్డారు. ఇలా చేస్తే ఎలా సమస్యలు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేసి పరిస్కరించాలి. కానీ ఇక్కడ కంప్యూటర్ లేదు, అపరేటర్ లేరు ఎందుకని నిలదీశారు.

### రికార్డుల సేకరణ..

గత సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏయే అధికారులు హాజరయ్యారనే దానిపై ఆరా తీశారు. గత వారానికి సంబంధించిన మూమెంట్ రిజిస్టర్, నేటి ప్రజావాణికి హాజరైన అధికారుల వివరాలతో కూడిన రిజిస్టర్‌ను పరిశీలించి, వాటి ఫోటో కాపీలను తనిఖీ బృందం తమ వెంట తీసుకెళ్లారు. 'జనంసాక్షి' కథనంతో అప్రమత్తమైన సీఎంఓ అధికారులు చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీలు స్థానిక అధికారుల్లో గుబులు పుట్టించాయి.

### ప్రతి దరఖాస్తుకు ఆన్లైన్ రిసిప్ట్..

కాగా నిన్నటి వరకు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ఎలాంటి ఆన్లైన్ దరఖాస్తు ఇవ్వకుండానే అధికారులు తతంగాన్ని కానిచ్చారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను బదిలీ చేస్తామని చెప్పుకొచ్చారు. కానీ జనంసాక్షి కథనంతో కదిలిన అధికార యంత్రాంగం సోమవారం ప్రజావాణిలో అర్జీలు ఇచ్చిన ప్రతి లబ్ధిదారునికి వెనువెంటనే ఆన్లైన్ రిసిప్ట్ జారీ చేశారు. సమస్య ఏమిటి? దాని పరిష్కారం ఎప్పటిలోగా చేస్తామన్న హామీతో రిసెప్ట్ ను అందజేశారు. కేవలం సమస్యను గుర్తుచేయడమే కాకుండా దాని పరిష్కార మార్గాలు చూపించడంలో జనం సాక్షి ముందుంటుందని ఎందుకు నేడు ప్రజావాణిలో చోటుచేసుకున్న నూతన ఉరవడినే నిదర్శనం. ప్రజావాణిలో వస్తున్న దరఖాస్తుల పట్ల అధికారుల నిర్లక్ష్యం ధోరణి కళ్లకు కట్టినట్టు ఇచ్చిన కథనంతో ఏకంగా సీఎంవో అధికారులే క్షేత్రస్థాయికి కదిలొచ్చారు.

## వసతి గృహాలపై పర్యవేక్షణ అవసరం

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 5 (జనం సాక్షి) :** ఎల్‌నినో వంటి పరిస్థితులను అధిగమించేందుకు జల సంరక్షణకు ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో డిస్టిక్ వాటర్, శానిటేషన్ మిషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విబిజి రాంజీ పథకంలో జల సంరక్షణ పనులను చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటికి ప్రాధాన్యత నివ్వడమే కాక రైతులకు కూడా మేలు జరిగేలా పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రోత్సహిస్తుందన్నారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ, భవిష్యత్తు తరాలకు నీటి కొరత రానివ్వకుండా ముందు చూపుతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని వసతిగృహాలు, గురుకులాలు, కస్తూరిబా, ఇతర పాఠశాలలతో పాటు ఆసుపత్రులను సంబంధిత శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు తరచు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎండిడికేవై కు సంబంధించి జిల్లాలో చేపట్టిన వివిధ పనులపై ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ అందజేస్తుండాలని సూచించారు. వివిధ శాఖల పనితీరుపై కూడా నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి

- టియుడబ్ల్యూజే-హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా ఖాన్

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** జర్నలిస్టులు అందరికీ హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని అలాగే జర్నలిస్టులకు జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని , అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు అందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు నాయక్ లు డిమాండ్ చేశారు. టీయూ డబ్ల్యూజె -హెచ్143 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ లో గల మహాత్మా గాంధీ విగ్రహం ముందు సోమవారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు,జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు అందించాలని రాతపూర్వకంగా జర్నలిస్టులు పోస్టు కార్డుల ఉద్యమానికి శ్రీకారం చుట్టా రు. ఈ సందర్భంగా అబ్దుల్లా ఖాన్ చందు నాయక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. గతంలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగపడ్డాయని ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్ కార్డులకు కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులలో చిన్నాచితికా వైద్యం కూడా అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో నాల్గవ స్తంభంగా చెప్పుకునే మీడియా రంగంలో



పనిచేసే జర్నలిస్టులకు కనీసం హెల్త్ కార్డు సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హెల్త్ కార్డులను ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా జారీ చేయాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా జర్నలిస్టులకు ఇండ్లు ఇళ్ల స్థలాలను కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా వృత్తినే సర్వస్వంగా భావించి ఈ వృత్తిలో కొనసాగుతున్న వారికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న వృత్తినే నమ్ముకొని పనిచేస్తున్న వారికి కనీసం గూడు కూడా లేకపోవడం బాధాకరమైన అంశం కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన నాలుగు ఎకరాలలో స్థలాలు కేటాయిస్తూ శాశ్వత పట్టాలు అందించాలని ఇందుకోసం ఎమ్మెల్యే కూచకుల్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీకూచకుల్లా దామోదర్ రెడ్డి లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను వెంటనే జారీ చేసి జర్నలిస్టులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే హెచ్ 143 పోరాట ఫలితంగా మూడవ విడత అక్రిడేషన్ కార్డులను నాగర్ కర్నూల్ జిల్లాలో జారీ చేయడం జరిగిందని అనేక ఉద్యమాల ఫలితంగా మూడవ విడతలు కార్డులు వచ్చాయని దీనిని కార్డులు వచ్చిన రోజే ప్రత్యర్థి యూనియన్ వారు తమ వల్లే అక్రిడేషన్ వచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. అధికారపక్షమైన యూనియన్ సభ్యులు అయి ఉండి కనీసం జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మొదటి రెండవ పూర్తి చేయాల్సి ఉండగా లోపాభూఇష్టమైన కమిటీ వ్యవహారం వల్ల జర్నలిస్టులకు తీరని ఆలస్యం జరిగిందని వారు ఆరోపించారు. జిల్లాలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల ఆలస్యానికి కారణం ఎవరో అందరికీ తెలుసు అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ లు శేఖరాచారి, ఏటి గడ్డ వెంకటేష్,పులిజాల బాలస్వామి, రమేష్, అహ్మదుల్లా ఖాన్, యూనియన్ రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాస్ గౌడ్, జర్నలిస్టులు మహమ్మద్ సాదిక్,శేఖర్, రామకృష్ణ, జంగిటి రాజేష్, గంధం ప్రసాద్, సయ్యద్ రబ్బాని, వెంకటస్వామి, ఇర్ఫాన్ ఖాన్, విజయేందర్ రెడ్డి, అచ్చంపేటకు చెందిన జర్నలిస్టులు ప్రకాష్, గోపి, బాలిశ్వర్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

- నెల రోజుల క్రితం పుట్టిన పసికందుకు విక్రయించి, డబ్బుల కోసం రాక్షసానందం
- హత్యకు ఉపయోగించిన ఆటో, రాయి, రక్తపు దుస్తులు స్వాధీనం

**మక్తల్, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** మక్తల్ మండలం జక్లేర్ గ్రామ శివారులో ఇటీవల సంచలనం సృష్టించిన భార్య హత్య ఉదంతాన్ని మక్తల్ పోలీసులు ఛేదించారు. భార్యను కడతేర్చిన భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మక్తల్ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన కంసాలి లక్ష్మణ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కంసాలి యశోద (40)తో తరచూ గొడవలు జరిగేవి. కాగా, సుమారు నెల రోజుల క్రితం వీరికి జన్మించిన మగ శిశువును నిందితుడు లక్ష్మణ్ రూ.60,000/-లకు గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించాడు. ఆ వచ్చిన డబ్బును పూర్తిగా తాగుడుకే తగలేశాడు. దీనిపై భార్యాభర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. దీంతో సెప్టెంబర్ 30వ తేదీ రాత్రి నిందితుడు లక్ష్మణ్ మద్యం తాగి, భార్య యశోదతో కూడా మద్యం సేవింపజేశాడు. రాత్రి 11:00 గంటల సమయంలో మక్తల్‌లో పని ఉందని చెప్పి తన ఆటోలో ఆమెను ఎక్కించుకుని బయలుదేరాడు. రాత్రి 11:30 గంటల ప్రాంతంలో జక్లేర్ గ్రామ శివారులోని NH-167 రోడ్డు కల్వర్టు సమీపంలోకి రాగానే, నిర్మానుష్య ప్రాంతంలో ఆమెపై దాడి చేసి కిందకు తోసేశాడు. అనంతరం అక్కడే ఉన్న పెద్ద రాయితో ఆమె తల, ముఖంపై బలంగా మోదడంతో యశోద అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ?అక్టోబర్ 1వ తేదీ ఉదయం పొదల్లో మహిళ శవం పడిఉన్నట్లు సమాచారం అందడంతో మక్తల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి సోదరుడు కంసాలి కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ, పోలీసు సిబ్బంది క్లూస్ టీమ్ సహాయంతో సంఘటనా స్థలంలో వేలిముద్రలు, రక్తపు మరకలు ఉన్న మట్టి, రాయిని




సేకరించారు. దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు, సోమవారం గుడిగండ్ల గ్రామ బస్‌స్టాప్ వద్ద నిందితుడు కంసాలి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన ఆటో రిక్షా, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, మొబైల్ ఫోన్, పెద్ద రాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని వైద్య పరీక్షల నిమిత్తం తరలించి, అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మక్తల్ పోలీసుల సమర్థవంతమైన పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం మరియు శాస్త్రీయ ఆధారాల సేకరణ ద్వారా తక్కువ సమయంలోనే ఈ కేసును ఛేదించడం పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు.

## కల్వకుర్తిలో పశువుల దొంగల ముఠా అరెస్టు

- రూ.లక్ష నగదు,టాటాఏసీ ఆటో స్వాధీనం

**కల్వకుర్తి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** కల్వకుర్తిమండలం,పరిసర ప్రాంతాల్లో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన దేగ పుల్లయ్య, పగ్గాలరాముడు, యమ్మనిచంద్ర, ఎం.డి.ఇబ్రహీంను పోలీసులు అరెస్టు చేశారు.వారి నుంచి రూ.లక్ష నగదు, టాటా ఏసీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.పశువుల దొంగతనాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## కస్తూర్బా ఎస్ఓను బదిలీ చేయాలని డిమాండ్

**రేవల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** రేవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బహుజన్ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ సందర్శించి పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మిద్దె మహేష్ మాట్లాడుతూ, కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వినియోగించాల్సిన వంట సామాగ్రిని సంబంధిత అధికారుల అనుమతి లేకుండా బయటకు, వ్యక్తిగత అవసరాల కోసం తీసుకెళ్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ విషయం గతంలో కూడా పలుమార్లు జరిగినప్పటికీ, పాఠశాల ఎస్ఓ జ్యోతి దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న కస్తూర్బా పాఠశాలలో వారికి ప్రభుత్వం అందిస్తున్న వసతులు, ఆహారం, వంట సామాగ్రి సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థులకు అందాల్సిన వనరులు దుర్వినియోగం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నప్పుడు అధికారులు వాటిని నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బీఎస్పీ తరఫున డిమాండ్ చేస్తున్నామని మిద్దె మహేష్ తెలిపారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పాఠశాలలో పనిచేస్తున్న వంట సిబ్బందిని మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, విద్యార్థుల సమస్యలపై తగిన స్థాయిలో స్పందించడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ఎస్ఓ జ్యోతి పై ఉన్నతాధికారులు విచారణ




జరిపి, అవసరమైతే బదిలీ చేయాలని రేవల్లి మండల ఎంపీడీవో కీర్తనకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల హక్కులు, వారి విద్యా భద్రత, ఆహారం మరియు ప్రభుత్వ వనరుల పరిరక్షణ విషయంలో బహుజన్ సమాజ్ పార్టీ రాజీపడబోమని మిద్దె మహేష్ స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపకపోతే, విద్యార్థుల ప్రయోజనాల కోసం బీఎస్పీ తరఫున తదుపరి కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటి మధు, సెక్టార్ అధ్యక్షులు పూర్ణ కంటి దేవేందర్, కార్యదర్శి అంకూరి రాము బూత్ అధ్యక్షులు కలుమూరి కిరణ్, తప్పేట దేవరాజ్, వాడల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్యం అందించాలి

- ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలి
- ప్రభుత్వ వైద్యం ప్రజల హక్కు
- నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**కోహెడ, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరింత బలోపేతం చేయాలని, 24 గంటల అత్యవసర వైద్య సేవలు పూర్తిస్థాయిలోఅందుబాటులో ఉండేలా చూడాలని ఏ ఐ ఎస్ ఎఫ్ కోహెడ మండల కార్యదర్శి రాచూరి యుగేందర్ అన్నారు. అవసరమైన వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ యుగేందర్ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులు, కూలీలు అత్యవసర వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారని, ముఖ్యంగా రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యుగేందర్ అన్నారు. "ప్రభుత్వ వైద్యం ప్రజలకు దక్కాల్సిన హక్కు. పేద ప్రజలకు వైద్యం అందకుండా చేసే సిబ్బంది కొరతను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి" అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సంఖ్య, మంజూరైన పోస్టులు, ఖాళీగా ఉన్న పోస్టులపై అధికారికంగా సమీక్ష నిర్వహించి, పగలు--రాత్రి విధులకు సరిపడే సంఖ్యలో వైద్యులు, నర్సులు అలాగే ఇతర సిబ్బంది




అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే సిబ్బంది హాజరు పట్టిక, విధుల పట్టిక, రాత్రి వేళలో విధుల వివరాలు, క్షేత్రస్థాయి పర్యటనల రికార్డులను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పడం సరికాదని, అవసరమైన పోస్టులకు వెంటనే ప్రభుత్వ అనుమతులు మంజూరు చేసి, నియామక ప్రక్రియ చేపట్టాలని యుగేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య హక్కు కోసం ప్రశ్నించడం ఆపేది లేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్‌టీఐ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ఎఫ్ఆర్ఎస్ హాజరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలోగా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది హాజరుపై ఎఫ్ఆర్ఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయంతో కలిసి ఆర్‌టీఐ, ఎఫ్ఆర్ఎస్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది హాజరు తదితర అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఐ దరఖాస్తుల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు



వెంటనే పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించి, నిబంధనల మేరకు దరఖాస్తుదారులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఐ దరఖాస్తులను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు సమాచారం అందించే విషయంలో పారదర్శకతతో విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు, సమాచారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వెలుపల ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా సమాచారాన్ని అందించే అధికారి వివరాలతో పాటు సంబంధిత అధికారి ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది హాజరును పర్యవేక్షించేందుకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానంపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదవుతున్న సిబ్బంది హాజరును క్రమం తప్పకుండా పరిశీలించాలని, ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరై ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా శాఖాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యాలయాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగంపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.ఈ సమావేశంలో డీఆర్వో పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- సంగారెడ్డిలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రారంభం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వృత్తి శిక్షణ విభాగాలను మంత్రి పరిశీలించి, అందిస్తున్న కోర్సులు, శిక్షణ వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

# కాల్ నాయక్ తండాలో నూతన విద్యుత్ మినీ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

- 'జనం సాక్షి' కథనానికి స్పందన



**చెన్నారావుపేట, అక్టోబర్ 5( జనం సాక్షి ):** కాల్ నాయక్ తండాలో నూతన విద్యుత్ మినీ ట్రాన్స్ ఫార్మర్ ( డిటిఆర్) ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం 'జనం సాక్షి' దినపత్రికలో 'కాల్ నాయక్ తండాలో కాలిపోయిన విద్యుత్ మినీ ట్రాన్స్ ఫార్మర్... 15 రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం.... పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు'... అని వచ్చిన కథనానికి విద్యుత్ ఏఈ సంపత్ వెంటనే స్పందించారు. కాల్ నాయక్ తండ గ్రామంలో కాలిపోయిన విద్యుత్ మినీ ట్రాన్స్ ఫార్మర్ ను విద్యుత్ లైన్మెన్ రామ్ చందర్, అన్మాండ్ బుచ్చిబాబు, స్థానిక ఎలక్ట్రీషియన్ రవిల సహాయంతో తొలగింపజేశారు. అనంతరం నూతన విద్యుత్ మినీ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయించి తండాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పునరుద్ధరించారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన 18 ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్నారు. సంబంధిత సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడమే తమ బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

# నెట్ బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్ధార్థ విద్యార్థులు



**చెన్నారావుపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు నెట్ బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి సోమవారం తెలిపారు. హనుమకొండలోని జెఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో నిర్వహించిన నెట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి 12 మంది విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈనెల 13 ,14, 15 తేదీలలో మేడ్చల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను చైర్మన్ గోపాల్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డిలు , కోచ్ కోరుకొండ ప్రణయ్ గౌడ్ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు పొన్నం రమేష్, ఆరె రాజు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో సాగు చేసిన పత్తి క్షేత్రం పరిశీలన శాస్త్రవేత్తలు..



**దుగ్గొండి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** దుగ్గొండి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట క్షేత్రాన్ని సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు, కాటన్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. నాగపూర్ కాటన్ రీసెర్చ్ స్టేషన్ పత్తి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రియాంక గైక్వాడ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, ఏఓ టెక్నికల్ కృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి రైతు ఊరటి రవి సాగు చేస్తున్న పత్తి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో రైతు ఇప్పటివరకు అవలంబించిన సాగు విధానాలు, చేపడుతున్న సస్యరక్షణ చర్యలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక గైక్వాడ్ మాట్లాడుతూ, క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల యూనిట్ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలు ఉండే అవకాశం ఉంటుందని, తద్వారా పంట పక్వానికి వచ్చే సమయం ఒకే దశలో ఉండి, రైతులు పత్తిని ఒకేసారి ఏరుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ పద్ధతి ద్వారా పంట దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులకు వివరించారు. అలాగే పంటను నిరంతరం పరిశీలిస్తూ, అవసరానికి అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను ఇతర రైతులకు కూడా వివరించి, ఈ విధానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ధరావత్ శ్రీను, ధరావత్ లింగమూర్తి, రాజు తదితరులు, మండల వ్యవసాయ అధికారి గాజుల శ్యామ్, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి చరిత్రలో తొలిసారి ఆయిల్‌పామ్ తోటలు

- మందమర్రి ఏరియాలో 2 హెక్టార్లలో 285 మొక్కల నాటకం



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 05(జనంసాక్షి):** బొగ్గు గనుల తవ్వకాలు పూర్తయిన భూములను పర్యావరణహితంగా వినియోగించడంలో భాగంగా సింగరేణి మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సింగరేణి చరిత్రలో తొలిసారిగా మందమర్రి ఏరియాలో మూసివేసిన కె.కె-2 భూగర్భ గని ఆవరణలో ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రారంభించింది.

సుమారు 2 హెక్టార్ల విస్తీర్ణంలో 285 ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుధ ప్రకాష్ జ్యోతి దిశానిర్దేశంలో, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, జీఎం ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ బి. సైదులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు.

మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, జీఎం ఎస్ఓ జి.ఎల్. ప్రసాద్, వివిధ గనుల ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు, అటవీశాఖ అధికారులు, ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు.

బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ప్రాధాన్యత ఇస్తోందని, ఆయిల్‌పామ్ తోటల పెంపకం భవిష్యత్‌లో ఇతర గనుల ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# వైద్యమందక తలడిల్లుతున్న గిరిజనం

- కాటారంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వైద్య సేవలు కరువు
- వైద్యం అందుబాటులో లేక ప్రాణాలు పోగొట్టుకున్న యువరైతు
- పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది కొరతతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- 30 పడకల ఆసుపత్రి ఉన్నా.. పెరుగుతున్న జనాభాకు అందని వైద్యం
- కాటారం సబ్‌డివిజన్ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్



కాటారం అక్టోబర్ 5 (జనం సాక్షి): ఉత్తర తెలంగాణ తూర్పు డివిజన్ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోదావరి పరీవాహక ప్రాంతాలు, కాటారం సబ్ డివిజన్ ఏటూరునాగారం కారిడార్‌లోని గిరిజన, హరిజన, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు వైద్య సేవలు ఇప్పటికీ అందని ద్రాక్షగానే మారాయి. విశాలమైన భూభాగంలో చిన్నచిన్న గ్రామాలు, మారుమూల గూడేలు, పూరి గుడిసెల్లో జీవిస్తున్న పేద ప్రజలు అనారోగ్యానికి గురైతే సరైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. హనంకొండ, వరంగల్ , హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లలేక ఆ ఖర్చులు భరించలేక ప్రాణాన్ని మధ్యలో తెగించి వదిలేస్తున్నారు. మనసులో బాధపడుతూ ప్రభుత్వాన్ని నిందిస్తూ ప్రాణాలు గాల్లో వదిలిపెడుతున్నారు. తెలుస్తున్నది డాక్టర్లు చెబుతున్నారు, ఐదు లక్షలు , 10 లక్షలు ఖర్చవుతుందని ఎక్కడి నుంచి తేవాలి, ఎలా భరించాలి అని ఈ నిరుపేద కుటుంబాల ఆవేదన బ్రతకడమే ఒక భారం, బ్రతుకు జీవించడమే ఒక బాధ, పిల్లల చదువులు వ్యవసాయ ఖర్చులు కనీస జీవన విధానానికి సరిపోయేంత లేక తల్లడిల్లి పోతున్నారు . ఎటునాగారం గిరిజన ప్రాంత కారిడార్ గిరిజన జీవితాలు పై ఇకనైనా ఆలోచించాలి . ప్రభుత్వం పరంగా వైద్య సేవలు, సహజ జీవనానికి సరిపోయేంతగా చూడాలని వేడుకుంటున్నారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నప్పటికీ మారుమూల ప్రాంతాల ప్రజలకు అవి సకాలంలో అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి అనారోగ్యాలు సైతం తీవ్ర సమస్యలుగా మారుతున్నాయి. వైద్య ఖర్చులు భరించే స్థోమత లేక పేద కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి. ఒకవైపు కుటుంబ పోషణ కోసం నిత్యం కష్టపడుతుండగా, మరోవైపు వైద్య ఖర్చులు భారంగా మారడంతో అనేక కుటుంబాలు కన్నీటి పర్యంతమవుతున్నాయి. కాటారం, మహాముత్తారం, మల్హర్ తదితర మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ అవసరమైన స్థాయిలో వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో ఒకరిద్దరు సిబ్బందితోనే వైద్య సేవలు కొనసాగుతున్న పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య అవగాహన కొరవడటం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోలేకపోవడం, రవాణా సౌకర్యాల కొరత తదితర కారణాలతో అనేక మంది వ్యాధులను ముదిరిన తర్వాతే ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం మరింత పెరుగుతోంది. మహాదేవపూర్ 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ఉన్నప్పటికీ అక్కడి పరిసర ప్రాంతాల పెరుగుతున్న జనాభాకు అది సరిపోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రం లేదా ఇతర పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, వృద్ధులు, మహిళలు, కూలీ కుటుంబాలు వైద్య సేవల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యం కారణంగా పిల్లల చదువులకు సైతం ఆటంకం కలుగుతోందని, కుటుంబాల్లో సంపాదించే వ్యక్తి అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుంగిపోతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కాటారంలో 100 పడకల ఆసుపత్రి అత్యవసరం

విశాలమైన భౌగోళిక పరిధి, మారుమూల గ్రామాలు, గిరిజన జనాభా, పెరుగుతున్న వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాటారం సబ్‌డివిజన్ కేంద్రంలో కనీసం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో గిరిజన, పేద, వెనుకబడిన వర్గాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుందని, అత్యవసర సేవలు, ప్రసూతి వైద్యం, చిన్నారుల వైద్యం, శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు తదితర సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారు.

గోదావరి పరీవాహక ప్రాంతంలోని గిరిజన, పేద ప్రజల ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని, కాటారం సబ్‌డివిజన్ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రికి తక్షణమే అనుమతి మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# భూపాలపల్లిలో సందడి చేసిన సినీ తార నిధి అగర్వాల్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో సినీ తార నిధి అగర్వాల్ సందడి చేసింది. కాసం ప్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ప్రముఖ సినీ తార నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి స్టోర్ ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్ తో, నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందని అన్నారు. లేడీస్, జెంట్స్, కిడ్స్ వేర్ విభాగాల్లో కలియతిరిగి సందడి చేశారు. చుట్టుపక్కల ప్రాంత వాసులు షాపింగ్ కోసం కాసం ఫ్యాషన్స్ ను సందర్శించాలని పిలుపునిచ్చారు. ఆటపాటలతో అభిమానులను అలరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ భూపాలపల్లిలో కాసం ఫ్యాషన్స్ రావడం సంతోషంగా ఉందని, ఇకపై ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండానే లేటెస్ట్ వెరైటీలను ఇక్కడే కొనుగోలు చేయవచ్చని అన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఇదిలా ఉండగా ఉదయం నుండే నిధి అగర్వాల్ ను చూసేందుకు అభిమానులు, యువతీ యువకులు బారులు తీరడంతో మాల్ పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాసం షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాద్ తో పాటు పుల్లూరు అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, కాసం ఫణిత్, సాయికృష్ణ, దీక్షిత్, యాంసాని ప్రవీణ్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన



**హనుమకొండ ప్రతి నిధి అక్టోబర్ 5 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని జిల్లా పరిషత్ కు సంబంధించిన స్థలం, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఖాళీ ప్రదేశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సోమవారం పరిశీలించారు. హనుమకొండ తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. క్వార్టర్స్, ఖాళీ స్థలానికి సంబంధించిన వివరాలను జెడ్పీ సీఈఓ శేషాద్రి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు వరంగల్ తూర్పు కళాశాల విద్యార్థి ఎంపిక



**వరంగల్ మండలం, అక్టోబర్ 05( జనం సాక్షి) :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, వరంగల్ ఈస్ట్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం బీఎస్సీ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థిని తుడి విఘ్నేశ్వరి ప్రతిష్ఠాత్మక సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ కు ఎంపికై తన కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ ఫెలోషిప్‌లో భాగంగా విఘ్నేశ్వరి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( గౌహతిలోని కెమిస్ట్రీ విభాగంలో రెండు నెలల పరిశోధనా ఇంటర్న్‌షిప్‌ను ప్రొఫెసర్ సుభాష్ చంద్ర పాన్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేశారు. ఇంటర్న్ షిప్ లో భాగంగా హర్నెస్సింగ్ ఎసిమెట్రిక్ ఆర్గానో క్యాటాలసిస్ అన్ లాకింగ్ ద ఎనాన్సో సెలెక్టివ్ ఆల్కలైజేషన్ ఆఫ్ పైరజోలోన్స్ విత్ ఆక్సిటెన్స్‌అనే పరిశోధనా ప్రాజెక్టుపై ఆమె పనిచేశారు. ఈ పరిశోధనా ప్రాజెక్ట్ 2026 జూన్ నుంచి రెండు నెలల వరకు నిర్వహించబడింది. దేశవ్యాప్తంగా ఎంపికైన 184 మంది విద్యార్థుల్లో విఘ్నేశ్వరి ఒకరు. విఘ్నేశ్వరి సాధించిన ఈ ఘనతను కళాశాల ప్రిన్సిపాల్ డా. రాధిక,వైస్ ప్రిన్సిపల్ డా.రాజ్యలక్ష్మి కెమిస్ట్రీ అధ్యాపకులు డా. కె. స్వప్న, డా. ఎల్. హారతి, పి.మాణిక్యరేఖ, కె. స్వప్న రాణి తదితరులు అభినందించారు. పరిశోధన పట్ల విఘ్నేశ్వరి చూపిన అంకితభావం, ఆసక్తిని కళాశాల యాజమాన్యం ప్రశంసించింది. ఆమె సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులను ఉన్నత విద్య, శాస్త్రీయ పరిశోధనల వైపు ప్రోత్సహిస్తుందని వారు ఆకాంక్షించారు.

# ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పించాలి



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 05 ( జనం సాక్షి ) :** రానున్న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పద్మశాలికి చెందిన ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్చార్జి, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి ప్రభుత్వానికి కోరారు, ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రానున్న గవర్నర్ కోటా లో ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పిస్తే పద్మశాలిలకు న్యాయం జరుగుతుంద ని,సుముచిత స్థానం కల్పించినట్లు జరుగుతుంద ని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం సామాజిక రంగంలో ప్రత్యేక జ్ఞానం, లేదా అనుభవం ఉన్న వ్యక్తులను గవర్నర్ కోట ద్వారా శాసనమండలికి నామినేట్ చేయవ చ్చని అన్నారు.

# ప్రారంభం రోజునే ఊడిన లైటింగ్ సీలింగ్..!

- కాసం ఫ్యాషన్స్‌పై తొలగని అనుమానాలు..
- ఆగమేఘాల పనులే కారణమా?
- వేలాది మంది వచ్చిన వేళ ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు..
- భద్రతా ప్రమాణాలపై అధికారుల తనిఖీలెక్కడ?






జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి పట్టణంలో అట్టహాసంగా ప్రారంభమైన కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్‌పై తొలిరోజే భద్రతా ప్రశ్నలు తలెత్తాయి. ప్రారంభోత్సవం రోజునే షాపింగ్ మాల్‌లోని లైటింగ్ ఫాల్స్ సీలింగ్ భాగం ఊడిపడి వేలాడుతూ కనిపించడం కలకలం రేపింది. ప్రారంభోత్సవానికి అతిథులు, ప్రజలు తరలివచ్చిన సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదన్న ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. సినీ నటి నిధి అగర్వాల్ చేతుల మీదుగా భూపాలపల్లిలో కాసం ఫ్యాషన్స్ 30వ స్టోర్‌ను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భారీగా జనసందోహం తరలిరావడంతో షాపింగ్ మాల్ అంతా రద్దీగా మారింది. ఈ సమయంలో మొదటి అంతస్తులోని లైటింగ్ సీలింగ్ సెటప్ ఒక్కసారిగా ఊడిపోయి కిందకు వేలాడుతూ కనిపించింది. దీంతో అక్కడున్న వారు ఉలిక్కిపడ్డారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించినా.. ప్రారంభం రోజునే సీలింగ్ పరిస్థితి ఇలా ఉంటే భవనం నిర్మాణం, అంతర్గత పనుల నాణ్యత ఏ స్థాయిలో ఉందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆగమేఘాల పనులే కారణమా..?**

కాసం ఫ్యాషన్స్ భవనం నిర్మాణం, అంతర్గత అలంకరణ పనులు తక్కువ సమయంలోనే పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గతంలోనే భవనం నిర్మాణం, అంతస్తులు, భద్రతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో.. ఇప్పుడు ప్రారంభం రోజునే సీలింగ్ ఊడిపడటం ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. భవనం అందంగా కనిపించేలా ఇంటీరియర్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారా? లేక నిర్మాణ నాణ్యత, మెటీరియల్ నాణ్యత, భద్రతా ప్రమాణాలను కూడా అదే స్థాయిలో పరిగణనలోకి తీసుకున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వందలాది మంది వినియోగదారులు ప్రతిరోజూ రాకపోకలు సాగించే షాపింగ్ మాల్‌లో సీలింగ్ వంటి నిర్మాణ భాగాలు ఊడిపడటం సాధారణ ఘటనగా తీసుకోవడానికి వీలులేదని ప్రజలు అంటున్నారు.

**నిబంధనలకు తూట్లు.. తనిఖీలు ఎక్కడ?**

భారీ వాణిజ్య భవనాలకు ఫైర్ సేఫ్టీ, విద్యుత్ భద్రత, మున్సిపల్ అనుమతులు, నిర్మాణ ప్రమాణాలు తదితర అంశాలు కీలకం. ఇలాంటి భవనాలను ప్రారంభానికి ముందే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా ప్రమాణాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. అయితే కాసం ఫ్యాషన్స్ భవనానికి సంబంధించి అన్ని అనుమతులు, భద్రతా ప్రమాణాలు పూర్తిగా పాటించారా? అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గతంలోనే భవనం నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం కాగా.. తాజాగా ప్రారంభం రోజునే లైటింగ్ సీలింగ్ ఊడిపడటంతో సంబంధిత శాఖల అధికారుల పనితీరుపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభానికి ముందే భవనం మొత్తాన్ని అధికారులు పరిశీలించి ఉంటే.. ఇలాంటి లోపాలు గుర్తించలేదా? గుర్తిస్తే వాటిని సరిచేయించకుండా ప్రారంభానికి ఎలా అనుమతించారు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ప్రమాదం తప్పింది.. ఇకనైనా మేల్కొంటారా?**

ప్రారంభోత్సవానికి వేలాదిగా జనం వచ్చిన సమయంలో సీలింగ్ ఊడిపడటం.. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇదే ఘటన మరోసారి జరిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? షాపింగ్ మాల్‌లో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు, సిబ్బంది ఉంటున్న నేపథ్యంలో భద్రతా లోపాలను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ సీలింగ్ భాగం పూర్తిగా కూలి కింద ఉన్న వారిపై పడితే బాధ్యత ఎవరిది? నిర్మాణం, ఇంటీరియర్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకునే వ్యవస్థ ఏది? భద్రతా ప్రమాణాలను ధృవీకరించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు కావాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల సమగ్ర తనిఖీకి డిమాండ్..**

ప్రారంభం రోజునే చోటుచేసుకున్న ఈ ఘటనపై కాసం ఫ్యాషన్స్ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. సీలింగ్ ఎందుకు ఊడింది? ఉపయోగించిన మెటీరియల్ నాణ్యత ఏంటి? భవనం నిర్మాణం, ఇంటీరియర్ పనులను ఎవరు పర్యవేక్షించారు? భద్రతా అనుమతులు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పూర్తిగా పాటించారా? వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం ప్రారంభోత్సవం హంగామాతో సరిపెట్టకుండా.. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశంగా తీసుకుని భవనం మొత్తాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని పలువురు కోరుతున్నారు. తొలిరోజే సీలింగ్ ఊడిన ఘటనను అధికారులు హెచ్చరికగా తీసుకుని, భవనం భద్రతపై పూర్తి స్థాయి పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
06 అక్టోబర్ 2026

# వార్తల పేరుతో బెదిరింపులు, అక్రమ వసూళ్లు..!

- అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులే టార్గెట్..
- ఇద్దరి అరెస్టుతో కలకలం
- పలువురు బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు..
- ఇంకా ఎంతమంది బాధితులు బయటకు వస్తారో..?



**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 5 (జనంసాక్షి) :** వార్తలు రాస్తామంటూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై తిరుమలగిరి సాగర్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. సోమవారం నాగార్జునసాగర్ సిఐ శ్రీను నాయక్ తిరుమల సాగర్ ఎస్సై కే వీరశేఖర్ తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన చింతమల్ల శ్రీనివాస్, ఇరిగి శ్రీనులు విలేకరుల పేరు చెప్పుకొని ప్రజాప్రతినిధులను, అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడంతో వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

**రూ.30 వేలు ఇవ్వాలంటూ డిమాండ్**

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న తిరుమలగిరి గ్రామానికి చెందిన పగడాల సైదులును చింతమల్ల శ్రీనివాస్ సంప్రదించి, గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వార్త రాస్తానంటూ బెదిరించి, రూ.30 వేలు ఇస్తే వార్త రాయకుండా ఉంటానని లేదంటే నీ భార్య సర్పంచ్ పదవి పోతుందని డబ్బుల కోసం డిమాండ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు .అయితే ఇదే వ్యవహారంలో గతంలోనూ పగడాల సైదులు నుంచి రెండుసార్లు డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఒకసారి రూ.10 వేలు, మరోసారి రూ.20 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. వార్తలు ప్రచురిస్తామంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రంగుండ్ల సర్పంచ్.. కార్యదర్శులూ బాధితులే?**

ఇదే తరహాలో రంగుండ్ల సర్పంచ్‌తో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులను కూడా వార్తల పేరుతో బెదిరించి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే గరికనేటి తండా పంచాయతీ కార్యదర్శిని కూడా వార్తల పేరుతో బెదిరించి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. వీరి అరెస్టుతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఇద్దరూ కలిసి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు**

ఇరిగి శ్రీను కూడా చింతమల్ల శ్రీనివాస్‌తో కలిసి తాను ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడినని చెప్పుకుంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. తప్పుడు వార్తలు రాస్తామంటూ భయపెట్టి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు.మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీనంఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

నల్గొండలోనూ ఇదే తరహా ఘటనలువార్తలు, డిజిటల్ మీడియా పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోనూ వెలుగుచూశాయి. 2025లో నల్గొండ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసిన కేసులో ప్రభుత్వ అధికారులు, వ్యాపారులను డిజిటల్ పత్రికలో వార్తలు ప్రచురిస్తామంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. మిర్యాలగూడ రూరల్ సీఐ నుంచి కూడా రూ.2 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.అదే విధంగా 2026లో తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ వార్తలు ప్రచురిస్తామని, పరువుకు నష్టం కలిగిస్తామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనల్లో కేసులు, అరెస్టులు నమోదయ్యాయి.

**ఇంకెంతమంది బాధితులు బయటకు వస్తారో..?**

తిరుమలగిరి సాగర్‌లో తాజా అరెస్టులతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో ఇంకా ఎంతమంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాధితులుగా ఉన్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఈ వ్యవహారంలో మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విలేకరుల మంటూ ఎవరినైనా బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

## సుమతి సేవలు స్ఫూర్తిదాయకం




**ముషీరాబాద్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మహిళా, అభ్యుదయ ఉద్యమాల పట్ల సుమతి చూపిన అంకితభావం, నిబద్ధత స్ఫూర్తిదాయకమని ఐద్వా సీనియర్ నాయకురాలు టి. జ్యోతి అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లింగంపల్లి లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన సుమతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమతి చిత్రపటానికి సుధా సుందరరామన్, కేఎన్ ఆశాలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టి. జ్యోతి మాట్లాడుతూ వీఆర్ఎస్ అనంతరం సుమతి రాష్ట్ర కేంద్రంలో మహిళా సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పనిచేశారని తెలిపారు. 'మానవి' పత్రిక బాధ్యతలు నిర్వహిస్తూ పత్రికను సకాలంలో తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని, ప్రజాశక్తి, చైతన్య, మానవి పత్రికల్లో అనేక వ్యాసాలు రాశారని గుర్తుచేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యమంలో సుమతి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180.00 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్...?

- అధికారుల పర్యవేక్షణ లోపంతో రెండు రోజులకే పగుళ్లు..



**మునుగోడు, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మునుగోడు మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా చేపడుతున్న అండర్ డ్రైనేజీ పనులపై నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు పూర్తయిన కొద్ది రోజులకే సిమెంట్, కాంక్రీట్‌కు పగుళ్లు ఏర్పడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అండర్ డ్రైనేజీ నిర్మాణంలో సిమెంట్ కాంక్రీట్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయిన రెండు మూడు రోజులకే పగుళ్లు ఏర్పడటం పట్ల కాంట్రాక్టర్ పనితీరుపై, సంబంధిత అధికారుల పర్యవేక్షణపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉండగా, పనుల సమయంలో సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నాసిరకం పనుల వల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా, భవిష్యత్తులో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు అండర్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ నాణ్యతపై సాంకేతికంగా తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. నాణ్యతలో లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పశు అక్రమ రవాణాకు అడ్డుకట్ట ఏది..?

- రాత్రివేళల్లో యథేచ్ఛగా గోవుల తరలింపు.. అధికారులు ఎక్కడ..?
- అమాయక రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు..
- కబేళాలకు తరలిస్తున్నారంటున్న స్థానికులు

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 5 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో పశువుల అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేకంగా రూపొందించిన వాహనాల్లో పశువులను తరలిస్తున్నారని, వారానికి రెండు, మూడు రోజుల పాటు మండలం నుంచి పదుల సంఖ్యలో పశువులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రివేళల్లో రవాణా.. ప్రమాదాల భయం**

పశువులను తరలించే వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో రహదారులపై ప్రమాదాల భయం నెలకొంటోందని ప్రజలు చెబుతున్నారు. వాహనాల్లో అధిక సంఖ్యలో పశువులను ఎక్కించి తరలించడం వల్ల మూగజీవాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, రవాణా సమయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**తక్కువ ధరకు కొనుగోలు.. అధిక ధరకు తరలింపు..?**

మండలంలోని కొందరు వ్యాపారులు దూర ప్రాంతాలకు వెళ్లి అమాయక రైతులు, పశుపోషకుల వద్ద నుంచి తక్కువ ధరలకు గోవులను కొనుగోలు చేసి, అనంతరం సూర్యాపేట ప్రాంతంలోని సంతలు, కబేళాల వైపు అధిక ధరలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువులను బయటకు కనిపించకుండా ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారనే అనుమానాలను కూడా స్థానికులు



వ్యక్తం చేస్తున్నారు.

**పట్టుబడని వాహనాలపై అనుమానాలు**

మండలం నుంచి తరచూ పశువులతో వాహనాలు వెళ్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎక్కడా పట్టుబడకపోవడం, వాహనాలు సీజ్ కాకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పశువుల రవాణాపై సంబంధిత శాఖలు సమన్వయంతో నిఘా ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో వాహనాలను తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**

మూగజీవాలను వాహనాల్లో అధిక సంఖ్యలో ఎక్కించి ఇబ్బందులకు గురిచేస్తూ తరలించడం బాధాకరమని జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు. పశువుల రవాణాకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# గిరిజనుల అర్జీలకు సత్వర పరిష్కారం

- నిర్ణీత గడువులో సంక్షేమ పథకాలు అందించాలి
- ఐటీడీఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం, అక్టోబరు 5 (జనంసాక్షి) :** గిరిజనుల నుంచి అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అధికారులను ఆదేశించారు. గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డీడీ గిరిజన సంక్షేమం చందన, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఆర్‌సీవో అరుణకుమారి, ఈఈ మధుకర్, ఏడీఎంహెచ్‌వో సైదులతో కలిసి పీవో గిరిజనుల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలు, పోడు పట్టాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై గిరిజనులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని పీవో సూచించారు. క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ దర్బార్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని స్పష్టం చేశారు. గిరిజన దర్బార్‌లో అధికంగా పోడు భూముల పట్టాలు, పట్టాల ఆన్‌లైన్ నమోదు, పేర్ల మార్పిడి, గిరి వికాసం ద్వారా విద్యుత్, బోర్లు, మోటార్ల మంజూరు, స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం, మారుమూల గ్రామాలకు రహదారులు, విద్యుత్ సౌకర్యం, వితంతు, ఒంటరి మహిళల పింఛన్లు, ఉపాధి శిక్షణ, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సహాయం వంటి అంశాలపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గిరిజనులు అర్జీలతో పాటు సంబంధిత



ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని పీవో రాహుల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ వేణు, పీవీటీజీ అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏఈఈ వసుంధర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, హౌసింగ్ ఏఈ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో దారుణం

- హాస్టల్‌లో 8వ తరగతి విద్యార్థిపై దాడి
- వార్డెన్లు కొట్టడంతో చెవిలో రక్తస్రావం జరిగిందని తండ్రి ఫిర్యాదు

**నాచారం,అక్టోబర్ 5 (జనం సాక్షి) :** నాచారం పరిధిలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిపై ఇద్దరు వార్డెన్లు దాడి చేసిన ఈ ఘటన ఆలస్యంగా బయటపడింది. 30వ తేదీ ఈ దాడి జరిగినట్లు విద్యార్థి తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. యాప్రాల్‌కు చెందిన ఆరుగోలను మోహనరావు కుమారుడు ఆరుగోలను గౌతమ్ దీప్ (13) నాచారంలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ స్కూల్‌లో సీబీఎస్ఈ 8వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. సెప్టెంబర్ 30న ఉదయం సుమారు 6 గంటల సమయంలో గౌతమ్ దీప్ ఇతర విద్యార్థులతో కలిసి గది నుంచి బయటకు వచ్చాడు. అదే సమయంలో ఛార్జింగ్‌కు పెట్టిన మొబైల్ ఫోన్ ఎవరు తీశారంటూ వార్డెన్లు విద్యార్థులను ప్రశ్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ క్రమంలో వార్డెన్ చందు, గౌతమ్ దీప్‌నే ఫోన్ తీసినట్లు ఆరోపించగా, తాను ఫోన్ తీయలేదని విద్యార్థి చెప్పినట్లు తండ్రి ఫిర్యాదులో తెలిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం సుమారు 6.30 గంటలకు వార్డెన్లు చందు, రాజేష్‌లు గౌతమ్ దీప్‌ను ఓ గదిలోకి తీసుకెళ్లి పొట్ట, చెంపలపై కొట్టినట్లు ఆరోపించారు. ఈ దాడిలో విద్యార్థి కుడి చెవి నుంచి రక్తస్రావం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన అనంతరం గౌతమ్ దీప్‌కు కాప్రాలోని ఏసీఈ ఈఎన్‌టీ హెడ్ అండ్ నెక్ సెంటర్‌లో చికిత్స చేయించినట్లు తండ్రి తెలిపారు. తన కుమారుడిపై దాడి చేసి గాయపరిచిన వార్డెన్లు చందు, రాజేష్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను మోహనరావు కోరారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని నాచారం అడ్మిన్ ఎస్ఐ మైబెల్లీ తెలిపారు.

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు 'కళ్యాణ లక్ష్మి' కొండంత అండ

- పేదలకు సీఎం సహాయనిధి ఒక సంజీవని
- లబ్ధిదారుల సభలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి



**గుర్రంపోడు, అక్టోబర్ 5, (జనంసాక్షి) :** నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. సోమవారం గుర్రంపోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్ము శ్రీను వాస్, జిల్లా కార్యదర్శి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు గాలి రవికుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి, చనమల జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తగుళ్ల సర్వయ్య, కుప్ప రాములు గౌడ్, జాల చిన్నసత్తయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేడి వెంకన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గంగలి కృష్ణ, కమతం జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం మండలంలోని ఎండిపోయిన చెరువులను నీటితో నింపాలని కోరుతూ స్థానిక నాయకులు, రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి వారంలోగా మండలంలోని చెరువులన్నింటినీ నీటితో నింపుతామని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, రైతులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- రూ.20 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- 8 చోరీ కేసులు ఛేదించిన పోలీసులు, ఐదుగురు నిందితుల అరెస్ట్
- జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లలో దొంగతనాలు, వైన్స్ షాపుల్లో మద్యం చోరీలు, వ్యవసాయ బావుల వద్ద సబ్‌మర్సిబుల్ మోటార్లు, కరెంట్ వైర్లు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను ఆత్మకూర్ (ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ కేసు వివరాలను వెల్లడించారు.నిందితుల వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన నగదు, బంగారపు వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వ్యవసాయ పరికరాలు, మద్యం సీసాలు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఆగస్టు 30న రాత్రి ఆత్మకూర్ (ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన బొక్క వెంకట్ రెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది.ఈ ఘటనలో వ్యవసాయ మోటార్, కేబుల్ వైర్, సీసీ కెమెరా హార్డ్ డిస్క్, ఇన్వర్టర్, బ్యాటరీ, బంగారు ఆభరణాలు,నగదు తదితర వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆత్మకూర్ (ఎస్) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు దర్యాప్తులో భాగంగా నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున పాత సూర్యాపేట క్రాస్ రోడ్డు వద్ద, సూర్యాపేట దంతాలపల్లి రహదారిపై ఆత్మకూర్ (ఎస్) ఎస్సై ఎం.ఐలయ్య తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు.మూడు మోటార్ సైకిళ్లపై ఐదుగురు వ్యక్తులు ఒక వ్యవసాయ మోటార్‌ను తీసుకుని అనుమానాస్పదంగా వెళ్తుండటాన్ని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పాత సూర్యాపేటకు చెందిన సురికంటి నరేష్, మేరెడ్డి మహిపాల్ రెడ్డి, పన్నాల గిరిధర్ రెడ్డి, శివరాత్రి అరవింద్,కాసాల ఉదయ్ కిరణ్ రెడ్డిగా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితులు గత సంవత్సరం కాలంగా గ్రూపుగా ఏర్పడి సూర్యాపేట జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో,నల్లగొండ జిల్లా నకిరేకల్ పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుల విచారణలో ఇప్పటివరకు కింది ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆత్మకూర్ (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు మొత్తం 8 చోరీ కేసులకు ఈ ముఠా పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. 8 కేసులకు సంబంధించి సుమారు రూ.20 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు సురికంటి నరేష్ తన స్నేహితులు, బంధువులతో కలిసి ముఠాగా ఏర్పడినట్లు వెల్లడైంది.మద్యం సేవించడం, జల్సాలకు అలవాటుపడటం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత సంవత్సరం కాలంగా వివిధ ప్రాంతాల్లో ఇళ్లను, వ్యవసాయ బావుల వద్ద ఉన్న



మోటార్లను, వైన్స్ షాపులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ఎస్పి తెలిపారు.చోరీ చేసిన నగదు, వస్తువులను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బును జల్సాలకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ తెలిపారు.ఈ అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకోవడంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో సూర్యాపేట రూరల్ సీఐ పర్యవేక్షణలో ఆత్మకూర్ (ఎస్) సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. ఐలయ్య పోలీసు సిబ్బంది సమన్వయంతో చురుకుగా వ్యవహరించారు.నమ్మదగిన సమాచారం సేకరించి, సమయస్ఫూర్తితో వాహన తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.ప్రజలు తమ ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు భద్రపరచుకునే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.




# ఈ మూడు అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం

## టాటా సన్స్ ఛైర్మన్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ అన్నారు. దీర్ఘకాలిక స్థిరమైన వృద్ధికి ఇంధనం భద్రత, తయారీ రంగంలో ఉద్యోగాలు, మానవ వనరులపై పెట్టుబడులే అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.'వికసిత్ భారత్ -2047 విజన్ దేశంలోని పలు రంగాలకు విస్తరించింది. ఆయా రంగాల్లో స్థిరమైన అభివృద్ధికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అవసరం. సకాలంలో ఇంధన లభ్యత, తయారీ రంగంలో ఉద్యోగాల సృష్టి, ప్రజలకు అవసరమైన వనరుల్లో పెట్టుబడులు.. ఈ మూడు దేశ ఆర్థిక రంగానికి కీలకం. ఏడేళ్లుగా భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా పుంజుకుంటోంది. వృద్ధి అంచనాలను అధిగమిస్తోంది. స్థిరమైన వృద్ధికి డొమెస్టిక్ డిమాండ్ బలంగా ఉండడం, సేవా రంగాల్లో ఎగుమతులు పెరగడం, ప్రభుత్వాల నుంచి అనుకూలమైన విధానాలు.. ఇవన్నీ కారణమే" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటోమొబైల్ రంగంతో పాటు క్రెడిట్, విద్యుత్, సిమెంట్ రంగాలు కూడా ఆర్థిక నిర్మాణంలో కీలకంగా మారయన్నారు. తయారీ రంగంలో నాణ్యతతో పాటు ఆవిష్కరణలు, ఉత్పాదకతపైనా దృష్టి సారించాల్సిన అవసరముందని చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. దీంతో పెద్ద కంపెనీలే కాకుండా మధ్యతరహా పరిశ్రమలు సైతం పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, టాటా గ్రూపులో వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. టాటా సన్స్ ఛైర్మన్‌గా మరో ఐదేళ్ల పాటు చంద్రశేఖరన్ కొనసాగాలని టాటా సన్స్ బోర్డ్ ఆమోదం తెలపగా.. ఆ నియామకం

### చెల్లుబాటు కాదని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రయాణికులపై మరింత భారం.. ఇంధన సర్‌ఛార్జీలను పెంచిన ఇండిగో దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై ఇంధన సర్ ఛార్జీలను పెంచింది. వరుసగా మూడు నెలలుగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరిగాయి. దాంతో నిర్వహణ వ్యయాలు భారం కావడంతో ఈ ఛార్జీలను పెంచినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. అక్టోబర్ 6 నుంచి జరిగే కొత్త బుకింగ్‌లకు ఈ ధరలు వర్తిస్తాయని చెప్పింది. ఈ పెంపుతో విమాన ప్రయాణాలు భారం కానున్నాయి.దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు ఈ పెంపు రూ. 100 నుంచి రూ. 350 వరకు ఉంటుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాంతో ఏటీఎఫ్ వ్యయం గత దశాబ్ద కాలంలోనే అత్యధిక స్థాయికి చేరిందని ఇండిగో వెల్లడించింది.

# వరుస నష్టాలకు బ్రేక్..

## రాణించిన సూచీలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం రాణించాయి. క్రూడాయిల్ ధరలు, బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు కాస్త చల్లారడం, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై అంచనాలు కాస్త తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ ఉదయం 72,340.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 71,909.70) లాభాల్లో ప్రారంభమైంది. రోజులో చాలా వరకు లాభాల్లోనే కదలాడిన సూచీ ఓ దశలో 700 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివరికి 472.77 పాయింట్లు లాభపడి 72,382.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 133.80 పాయింట్లు పెరిగి 22,555.75 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.29గా ఉంది. సెన్సెక్స్ -30లో ఐటీసీ, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 102.43 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,157.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌కు పీటముడి

### నిర్మలా సీతారామన్

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా అవి కొలిక్కి రాలేదు. ఈ పరిణామాల వేళ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వాణిజ్య చర్చలు ఇక స్తంభించిపోయినట్లుగా కన్పిస్తున్నాయని అన్నారు. ఈ డీల్‌తో ఇరుదేశాలు మరిన్ని రాయితీలు పొందడం దాదాపు అసాధ్యంలాగే ఉందన్నారు. దిల్లీలో జరిగిన ఓ బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్న నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ట్రేడ్ డీల్ కోసం ఇంకా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ.. ఇరుపక్షాల మధ్య పీటముడి పడినట్లుగా అనిపిస్తోంది. చర్చల పురోగతి నిలిచిపోయే స్థితికి పరిస్థితులు చేరుకున్నట్లుగా ఉన్నాయి. ఇక, ఈ దశ దాటి.. పరస్పరం రాయితీలు ఇవ్వడం, తీసుకోవడం చాలా కష్టమైన పని. అయితే, ఇరుపక్షాలూ అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తే.. చర్చలు ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉండొచ్చని భావిస్తున్నా" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

**అమెరికాకు ఆయుధంలా టారిఫ్‌లు..**

భారత్‌తో వాణిజ్య లోటును పూడ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అయితే, దాన్ని సంప్రదాయ చర్చలతో పరిష్కరించుకోకుండా.. టారిఫ్‌లను ఆయుధంలా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆరంభంలో జరిగిన భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ప్రస్తావించారు. అది ఒక విజయవంతమైన డీల్ అని అన్నారు. దాని వల్ల భారత్‌లోని సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

మార్కెట్లపై ప్రభావం..

## ఏఐ ప్రయాణించే మార్గం సరైనది కాదు

### ఓపెన్ ఏఐ సేఫ్టీ సిస్టమ్ అధిపతి రాజీనామా



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏఐ సాంకేతికతను నియంత్రించకుండా వదిలేస్తే.. అది మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని పలువురు టెక్ అధినేతలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ అభివృద్ధికి కృషి చేసిన పలువురు కీలక సంస్థల నిపుణులు పదవుల నుంచి వైదొలుగుతున్నారు. ఈ జాబితాలో తాజాగా ఓపెన్ ఏఐ సేఫ్టీ సిస్టమ్ అధిపతి డేవిడ్ రాబిన్సన్ చేరారు. ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం సరైనది కాదని ఆరోపిస్తూ తన పదవికి రాజీనామా చేశారు."ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం ఆమోదయోగ్యం కాదని భావించిన రాజూవనింఎ లోని మాజీ సహోద్యోగులు, పరిశ్రమలోని ఇతర అధికారుల వరుసలో ఇప్పుడు నేను కూడా చేరుతున్నాను. ఏఐ భవిష్యత్తు.. దానిని నిర్మించే కంపెనీలపై ఆధారపడి ఉంది. ఆ విషయంలో కంపెనీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రమాదకరమైన టెక్నాలజీని ఎలా ఎదుర్కోవాలనే వివేకం వాటికి ఉండట్లేదు. ఇందు కోసం కొంత వినయం అవసరం. అయితే.. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే వ్యక్తులకు సహజంగా వివేకం ఉండదు. ఏఐ భద్రత పట్ల మరింత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.సమస్యలు వచ్చిన తర్వాత రక్షణ చర్యలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేపట్టడం సరైన చర్య కాదు. ఇటీవల పలు ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించాయి. 'హగ్గింగ్ సేఫ్' డేటాను హ్యాక్ చేసిన సమయంలో ఓపెన్ ఏఐ పొరపాటున ఏఐ ఏజెంట్ల సమూహాన్ని బయటకు వదిలింది. దీంతో శిక్షణలో ఉన్న మోడల్ ఇంటర్నెట్ యాక్సెస్ పరిమితులను దాటింది. కాబట్టి మానవుల కంటే ఎక్కువ సామర్థ్యం గల వ్యవస్థలను నిర్మించడానికి ఇది సరైన సమయం కాదు. ఏఐలో విపరీతమైన పురోగతి వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది" అని డేవిడ్ రాబిన్సన్ పేర్కొన్నారు. 2023లో ఓపెన్ ఏఐలో చేరిన డేవిడ్ మొదట పాలసీ ప్లానింగ్ హెడ్‌గా.. ఆ తర్వాత దాని సేఫ్టీ సిస్టమ్స్ బృందంలో కీలక అధికారిగా ఎదిగారు.

## గృహ, కారు రుణాలపై పీఎన్‌బీ పండగ ఆఫర్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పంజాబ్ నేషనల్ బ్యాంక్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. పండుగ సీజన్ సందర్భంగా పీఎన్‌బీ ఉత్సవ్-26 పేరిట ప్రత్యేక ఆఫర్లను లాంచ్ చేసింది. గృహ, కారు లోన్లు తదితర రిటెయిల్ రుణాలపై ప్రత్యేక వడ్డీ రాయితీలతో పాటు ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపులను ప్రకటించింది. పండుగ వేళ ఇళ్లు, వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రయోజనకరంగా మారనుంది.గృహ రుణాలపై ముందస్తు, ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ ఫీజులపై పూర్తి మినహాయింపు ఇస్తోంది. అంతేకాకుండా వడ్డీ రేటులో 5 బేసిస్ పాయింట్ల మేర రాయితీ అందిస్తుంది. అర్హత గల కస్టమర్లకు టేకోవర్ ఛార్జీల్లోనూ సడలింపు ఇచ్చింది. వాహన రుణాలపై కూడా ముందస్తు, ప్రాసెసింగ్ ఫీజులను పూర్తిగా మినహాయిస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది.ఇప్పటికే పీఎన్‌బీలో గృహ రుణాలు ఉన్న ఖాతాదారులకు మార్టగేజ్, టాప్-అప్ లోన్లపై 10 బేసిస్ పాయింట్ల వడ్డీ రాయితీ ఉండనున్నట్లు తెలిపింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,57,755 | ₹ 1,72,094 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,45,000

# ప్రభుత్వానికి ప్రజలకు వారధి జర్నలిస్టులు

## జర్నలిస్టుల కాలనీకి మౌలిక వసతులు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (జనంసాక్షి):** వేములవాడలో నూతనంగా ఏర్పడుతున్న జర్నలిస్టుల కాలనీకి అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం తరఫున కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారము జర్నలిస్టు కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ 60 మంది జర్నలిస్టులకు పట్టాలు రావడంతో నివాస గృహాల నిర్మాణానికి ముందుకు వచ్చిన క్రమంలో కాలనీలో తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు తదితర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.జర్నలిస్టుల కాలనీలో నీటి సమస్యను పరిష్కరించేందుకు మూడు బోర్‌బావులు వేయాలని సూచించగా, వెంటనే బోర్లు వేయడంతో పాటు మోటార్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల విషయంలోనూ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని, అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు, వీధి దీపాలు బిగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గతంలో విద్యుత్ స్తంభాల కోసం భారీ మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సరళీకృత నిర్ణయాలతో ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సదుపాయం సులభతరమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కిలోమీటర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉచితంగా అందించే విధానం అమల్లోకి వచ్చిందన్నారు.రైతులకు కూడా నిర్దిష్ట చార్జీలతో కిలోమీటర్ పరిధిలో విద్యుత్ స్తంభాలను ఉచితంగా ఏర్పాటు చేసే కార్యక్రమం కొనసాగుతోందన్నారు.ఇప్పటికే ఎన్పీడీసీఎల్ పరిధిలో సుమారు 2,800 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జర్నలిస్టుల కాలనీలో నిర్మాణం జరుగుతున్న ఇళ్లకు కూడా ఈ సదుపాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. బోర్ల వద్ద త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, స్ట్రీట్ లైట్లకు అవసరమైన విద్యుత్ సదుపాయాలను కూడా త్వరితగతిన కల్పిస్తామన్నారు.

**పచ్చదనాన్ని పెంచాలి..**

జర్నలిస్టుల కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు వనమహోత్సవం నిర్వహించాలని ఆది శ్రీనివాస్ సూచించారు.గుట్ట ప్రాంతం పక్కనే ఉన్న ఈ కాలనీ ప్రకృతి రమణీయ వాతావరణంలో ఉందని, ఇక్కడ పచ్చదనాన్ని పెంచితే నివాసానికి మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.

**జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధి.**

జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు. దేశంలో జర్నలిస్టుల రంగానికి ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల గౌరవాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. జర్నలిస్టుల అకాడమీ ఛైర్మన్ దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమం, గౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు తమవంతు సహకారం అందించాలని కోరారు.

## యస్.జి.ఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :** పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో 7వ తరగతికి చెందిన సి.హెచ్. అన్విక్ష్ నందన్ అండర్ 14 విభాగంలో, 10వ తరగతికి చెందిన బి. సుకీర్త్ అండర్ 17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబ రిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యా ర్థులను పాఠశాల ఛైర్మన్ డా. ఇ. ప్రసాదరావుతో పాటు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, కె. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, భవానీ, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, సాగర్ పాల్గొన్నారు.



## ఏకలవ్య పాఠశాలను రాష్ట్రంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దాలి

### సమస్యలను తక్షణమే పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు అధికారులు, పాలక మండలి సభ్యులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సం గ్వాన్ ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రగతి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు ప్రతి వారం ఒక్కరు చొప్పున పాఠశాలను సందర్శిం చి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల అవసరాలు, పాఠ శాలలోని సమస్యలు, వసతుల పరిస్థితిపై సమ గ్రంగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ పను లను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యా ప్రమా ణాలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. తదుపరి జిల్లా స్థాయి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించా లని నిర్ణయించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

- తెలంగాణ ప్రజా ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత
- బహుమతులు ప్రధానం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ, అక్టోబర్ 5 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గ కేంద్రం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి సన్నిధిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది.ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నాయకత్వంలో నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి బాలుర, బాలికల దాదాపు 1300 మంది క్రీడాకారులు పాల్గొన్నారూ. ఎంతో ఉత్సాహంగా, క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలు కొనసాగడం అభినందనీయం అన్నారు.సోమవారం జరిగిన ఫైనల్స్‌లో బాలికల విభాగంలో కొత్తగూడెం జట్టు, ఖమ్మం జట్టుపై విజయం సాధించగా, బాలుర విభాగంలో నల్గొండ జట్టు, వనపర్తి జట్టుపై విజయం సాధించి విజేతలుగా నిలిచాయి. విజేతలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. గెలవలేక పోయిన క్రీడాకారులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. ఓటమిని ఒక అనుభవంగా తీసుకుని మరింత పట్టుదలతో సాధన చేసి భవిష్యత్ పోటీల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నాను.రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన అవకాశాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగానే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నాం.అలాగే సీఎం కప్ ద్వారా గ్రామ గ్రామాన క్రీడా పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నాం. ఇప్పటికే ఉన్న క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అవసరమైన చోట కొత్త మైదానాలు, క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాం.క్రీడాకారులను ప్రోత్సహించడమే కాకుండా వారికి మెరుగైన శిక్షణ, సరైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలతో పాటు క్రీడాకారుల రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక కూడా జరగడం అభినందనీయం.ఈరోజు మన పిల్లలు సెల్‌ఫోన్‌లో స్క్రీన్ గేమ్స్‌కు పరిమితం కాకుండా గ్రౌండ్‌లో క్రీడలు ఆడాలి. ఆరోగ్యంగా ఉండాలి. సమయాన్ని వృథా చేసే అలవాట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చిన్నప్పటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరుతున్నాను. వేములవాడలో నిర్వహించిన ఈ కబడ్డీ పోటీలు ప్రతి క్రీడాకారుడికి చిరస్థాయిగా గుర్తుండిపోయేలా నిర్వహించినందుకు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకా రుడికి శుభాకాంక్షలు. విజేతలకు మరోసారి హృదయపూర్వక అభినందనలు.ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి, పట్టుదలతో సాధన చేసి రాబోయే పోటీల్లో విజేతలుగా నిలవాలని కోరుకుంటున్నాను .క్రీడాకారులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**పొన్నం,ఆది... పోటాపోటీ**

వేములవాడ(జనంసాక్షి): వేములవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ పోటీలలో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రధనోత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సరదాగా ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ కబడ్డీ ఆడారు. వారు కబడ్డీ ఆడుతున్న క్రమంలో అభిమానులు ఈలలు, క్రీడాకారులకు జోష్ నింపాయి కాలేజీ గ్రౌండ్ అంతా ఒక్కసారిగా కేరింతలతో మార్మోగింది. ఆది శ్రీనివాస్ కూతకు వెళ్ళిన క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టుకునే ప్రయత్నంలో వెనుకకు పల్టీ కొట్టాడు దీంతో అక్కడున్న వారంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

## రాధా గోవింద మందిరంలో మేయర్ ప్రత్యేకపూజలు

### స్థానిక డ్రైనేజీ సమస్యను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** రాధ గోవింద మందిర పరిసర ప్రాంతంలోని డ్రైనేజీ నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా సోమవారం రోజు కరీంనగర్ సిరిసిల్ల బైపాస్ రోడ్డు అల్కాపురి కాలనీలో గల శ్రీ రాధ గోవింద మందిరం( ఇస్కాన్ దేవాలయం) ను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సందర్శించారు. టెంపుల్ భాధ్యులు ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించి శ్రీ రాధ గోవింద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఇస్కాన్ దేవాలయ బాధ్యులు స్థానికంగా ఉన్న పలు రకాల సమస్యలను మేయర్ దృష్టికి తెచ్చారు. దీంతో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఇస్కాన్ దేవాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి చాలా కాలంగా భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతూ పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన డ్రైనేజీ నీటిని పరిశీలించారు. సంబధిత సమస్య పరిష్కారం పై అధికారులకు విన్నవించి సమస్య పరిష్కారంకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ నీటి సమస్యను త్వరలోనే పరిష్కరించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడిశెట్టి వసంత లక్ష్మి- భూమయ్య, ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు ప్రభుజీ, డాక్టర్ రాజభాస్కర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేష్ రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 6 అక్టోబర్ 2026

# సింగరేణికి రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

- 13న చలో హైదరాబాద్‌కు ఏఐటీయూసీ పిలుపు
- సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు
- కార్మికుల లాభాల వాటా విడుదల చేయాలని డిమాండ్
- బకాయిలతో విడిభాగాల కొనుగోలుకూ ఇబ్బందులు



**యైటింక్లైన్ కాలనీ, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రామగుండం-2 ఏరియా ఓసీపీ-3 కృషి భవన్ వద్ద ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజరత్నం ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించి గని మేనేజర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ బకాయిలతో సింగరేణి ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, భారీ యంత్రాలకు అవసరమైన విడిభాగాలు, పనిముట్లు కొనుగోలు చేయడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ప్రకటించి వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే ఈ నెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టి, సింగరేణి కార్మికులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మోట పలుకుల మహేందర్, సూదరి రమేష్, అలివెల్లి శ్రీనివాసరెడ్డి, ఈరవేణి కొమురయ్య, కైత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులు జరగడం శోచనీయం

**కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్**



**కరీంనగర్ లీగల్, అక్టోబర్ 5(జనంసాక్షి) :** న్యాయవాదుల సంరక్షణ చట్టం వచ్చినా కూడా న్యాయవాదులపై దాడులు జరగడం చాలా శోచనీయమని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ విచారం వ్యక్తం చేసారు. జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణ కరువయింది అని ఆవేదన వ్యక్తం చేసారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లో బోదాసు రమేష్ అనే న్యాయవాదిపై జరిగిన దాడి సందర్బంగా సోమవారం కరీంనగర్ జిల్లా కోర్టు లో న్యాయవాదులు విధుల బహిష్కరణ చేసి నిరసన వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాటం చేసే క్రమంలో న్యాయవాదుల పైనే దాడులు జరిగితే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందనే విషయాన్ని సమాజం గమనించాలని అన్నారు. ఇలాంటి దాడుల సంస్కృతి ఇలాగే కొనసాగితే విజ్ఞాన వంతులు న్యాయవాద వృత్తికి రాలేరని భాదను వ్యక్తం చేసారు. దాడులకు పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టరిత్యా చర్యలు తీసుకొని రమేష్ పై నమోదైన కౌంటర్ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని నిరసన లో పాల్గొన్న పలువురు న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి సుంకె దేవకిషన్, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, ట్రెజరర్ బొజ్జ స్వామి, న్యాయవాదులు పూరెల్లి రాములు, కుసుంబ కృష్ణారావు, తుమ్మనపెల్లి లక్ష్మణరావు, భోగం శంకర్, చౌడమల్ల వీరస్వామి, బండపల్లి శ్రీకాంత్ ఇతర సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

**దసరా లోగా పనులు పూర్తి చేయాలి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** డివిజన్‌లో నూతనంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లకు, అధికారులకు పనుల నాణ్యతపై పలు కీలక సూచనలు జారీ చేశారు. నిర్మాణ పనులన్నీ అత్యంత నాణ్యతాపూర్వకంగా జరగాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భవిష్యత్తులో రాబోయే 15 నుండి 20 సంవత్సరాల వరకు రోడ్లు, డ్రైనేజీల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ కాలువల నిర్మాణంలో నీరు నిలవకుండా సరిగ్గా ప్రవహించేలా స్లోప్‌లను కరెక్ట్‌గా మెయింటైన్ చేయాలని స్పష్టం చేశారు. వర్షపు నీరు సులభంగా తరలిపోయేలా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా పండుగ లోపే పనులన్నింటినీ వేగవంతంగా పూర్తిచేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అందమైన రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

**ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి పిలుపు**

- ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలి
- ఆధునిక పద్ధతుల్లో నాణ్యమైన బోధన అందించాలి
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోందని, నిజామాబాద్ జిల్లాలో పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం రూ.21 కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ బడులపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులతోపాటు మౌలిక వసతులు, కొత్త డైట్ మెనూ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల వంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, యోగా, ధ్యానం, పెద్దలను గౌరవించడం వంటి అంశాలను బోధించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఆధునిక పద్ధతుల్లో బోధించాలని, ఎఫ్ఎల్ఎన్ విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన బాలికలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

**మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వి. నాయక్**

**మంథని, అక్టోబర్ 05, (జనంసాక్షి):** వన్యప్రాణులను సంరక్షించుకోవాలని,అడవులు, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వి. నాయక్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల వేడుకల్లో భాగంగా సోమవారం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంథని రేంజ్ అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, యువతలో వన్యప్రాణుల పట్ల ప్రేమ, పరిరక్షణ భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ సమతుల్యతపై అవగాహన కల్పించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణపై క్విజ్ నిర్వహించి, పాల్గొన్న విద్యార్థులందరితో సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఓ పి. దేవదాస్, ఎఫ్ఎస్ఓలు మంగీలాల్, రవి, షా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మీనారాయణ, అధ్యాపకులు కృష్ణ, సతీష్, అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, రామకృష్ణ, రజిత, దుర్గం కృష్ణ, శేఖర్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

# డి1ఉపకాలువను రద్దు చేయాలి : ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు



**గంగాధర, అక్టోబర్ 5 (జనంసాక్షి):** గంగాధర మండల కేంద్రంలో అవసరం లేని డి1 ఉప కాలువను రద్దు చేయాలని కోరుతూ పలువురు గ్రామ రైతులు సోమవారం ప్రజావాణిలో ప్రత్యేక అధికారి డిఆర్ డిఓ పిడి గీత ఎంపీడీవో దమ్మని రాముకు వినతిపత్రం అందజేశారు. గంగాధర గ్రామంలో గంగాధర ప్రాజెక్ట నుండి గతంలో ఉన్న పాత కాలువల ద్వారానే తమ పంట పొలాలకు సాగునీరు అందుతుందని అలాగే ప్రత్యేక పైప్ లైన్లు ఏర్పాటు చేసి సాగునీరు సౌకర్యం ఏర్పాటు చేసుకున్నామని రైతులు ప్రత్యేక అధికారికి తెలిపారు.డి 1 ఉపకాలువ ద్వారా తమ గ్రామంలోని విలువైన వ్యవసాయ భూములు ఇంటి స్థలాలను కోల్పోవడం జరుగుతుందని తద్వారా తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు జారతి రాజిరెడ్డి.గంట కిషన్. పులిచెర్ల శశికిరణ్‌లు అధికారులకు విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ప్రత్యేక అధికారి గీత రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని భూసేకరణ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో డి ఈ రాజేంద్రప్రసాద్ ఎస్సై బి వంశీకృష్ణ డిప్యూటీ తహసిల్దార్ బండి రమేష్ విద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# లోవోల్టేజీ, విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

**కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై ధర్నా, రాస్తారోకో**



**గంభీరావుపేట, అక్టోబర్ 5 (జనం సాక్షి):** విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు కాలనీ వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గజసింగవరం, గోరంటాల, సముద్రాలింగాపూర్, మల్లుపల్లె గ్రామాల రైతులు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వరి పంట పొట్ట దశలో ఉండగా లోవోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని, అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోతో ప్రధాన రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విద్యుత్ అధికారులు రైతులతో మాట్లాడి సరిపడా నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మల్లుపల్లె సర్పంచ్ సత్యం, రాజేశ్వరరావు కాలనీ సర్పంచ్ పిట్ల బాబునాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో పరీక్షల శిక్షణ కేంద్రం ప్రారంభం

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 05, (జనంసాక్షి) :** కరీంనగర్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని శాతవాహన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షల శిక్షణ కేంద్రం (సెంటర్ ఫర్ కంపిటిటివ్ ఎగ్జామ్స్)ను ఈరోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లైబ్రరీ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై,కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ,సరైన మార్గదర్శకత్వం అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అన్ని రకాల సౌకర్యాలతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని,విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు.కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ పెద్దపెల్లి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే మంచి అకాడమిక్ వాతావరణం అవసరమని అన్నారు.విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించడంతో పాటు,వివిధ రంగాల్లో నిపుణులను తీసుకువచ్చి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. నిపుణుల శిక్షణను విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గౌరవ అతిథులుగా డాక్టర్ డి. హరికాంత్,వీసీ ఓఎస్‌డీ,ప్రొఫెసర్ కె.పద్మావతి,ప్రిన్సిపాల్,ఆర్ట్స్,సోషల్ సైన్సెస్ అండ్ లా కళాశాల,డాక్టర్ ఎస్.రమాకాంత్,ప్రిన్సిపాల్,సైన్స్ కళాశాల పాల్గొన్నారు.ఈ శిక్షణ కేంద్రానికి కో కోఆర్డినేటర్లుగా డాక్టర్ డి.విజయప్రకాష్ (ఇంగ్లీష్ విభాగం),డాక్టర్ డి.విజయ్ కుమార్ (కెమిస్ట్రీ విభాగం) వ్యవహరిస్తున్నారు.పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు, సరైన దిశానిర్దేశం ఈ కేంద్రం ద్వారా అందిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

# బోయినిపల్లికి రూ.12 కోట్లతో మినీ స్టేడియం

**బోయినిపల్లి, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** బోయినిపల్లి మండల కేంద్రంలో రూ.12 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు అక్టోబర్ 3న ఉత్తర్వులు జారీ చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించనున్నారు.

ఎమ్మెల్యే చొరవతో.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో ప్రత్యేకంగా మాట్లాడి మినీ స్టేడియం మంజూరుకు కృషి చేశారని బోయినిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ తెలిపారు. స్టేడియం అందుబాటులోకి వస్తే గ్రామీణ యువతకు క్రీడా శిక్షణ, ప్రతిభను వెలికితీసేందుకు మంచి అవకాశం కలుగుతుందన్నారు. మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. స్టేడియం మంజూరుపై మండల ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా సమస్యలపై ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తా

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 5( జనం సాక్షి) :** ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకు రాలు, కార్యకర్తలు జనం మెచ్చిన నేత, కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అంద జేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే తమ ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు.

# మాడుగులపల్లి ఎంపీఓకు డీపీవో ఆదేశాలు

- గజాలపురం గ్రామ పంచాయతీ వర్కర్ వేధింపుల వ్యవహారంపై విచారణ
- విధులకు అడ్డుపడుతూ కులం పేరుతో దూషిస్తున్నారంటూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వర్కర్ ఫిర్యాదు
- క్షేత్రస్థాయిలో విచారించి 7 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు


Memo No. 4430/2026-B5(Pts.)
Dated : 05-10-2026

OFFICE OF THE DISTRICT PANCHAYAT OFFICE NALGONDA

MEMO

Sub:- PRAJAVANI / PANCHAYATS – Gram Panchayat – Gajalapuram– Madugulapally Mandal - Petition filed by Sri K.Venkataiah, Gram Panchayat, Gajalapuram of Madugulapally Mandal - Enquiry report called for – Regarding.

Ref 1:- The District Collector Lr.No.C1/6099/2026, Mandal dated: 28-09-2026.
Ref 2:- Petition filed by Sri K.Venkataiah, Gram Panchayat, Gajalapuram of Madugulapally Mandal dated: 28-09-2026.

>>><<<

While enclosing herewith a copy of the reference cited, the Mandal Panchayat Officer, Madugulapally is directed to look into the matter personally duly visiting the Gram Panchayat Gajalapuram of Madugulapally Mandal and, submit detailed report to this office within (7) days taking further action in the matter.

V.Tharun Chakravarthy
DISTRICT PANCHAYAT OFFICER
NALGONDA

To
The Mandal Panchayat Officer, Madugulapally.
Copy to the Panchayat Secretary,Gram Panchayat, Gajalapuram of Madugulapally Mandal
Copy to the Petitioner. by Sri K.Venkataiah, Gram Panchayat, Gajalapuram of Madugulapally Mandal
Phone no: 7893290995

//Attested//

ADMINISTRATIVE OFFICER

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** మాడుగులపల్లి మండలం గజాలపురం గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న సిబ్బందిని విధులకు హాజరుకాకుండా అడ్డుకోవడం తో పాటు వేధింపులకు గురిచేస్తున్నారనే అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని నల్గొండ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వి. తరుణ్ చక్రవర్తి మాడుగులపల్లి మండల పరిషత్ అధికారి (ఎంపీఓ)ని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యాలయం నుండి మెమో నెం. 4430/2026-B5 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధితుని కథనం ప్రకారం... గజాలపురం గ్రామానికి చెందిన కుక్కముడి వెంకటయ్య 2019 అక్టోబర్ 30న మల్టీ పర్పస్ వర్కర్‌గా నియమితులై విధులు నిర్వహిస్తున్నారు. అయితే, 2025 డిసెంబర్ 22న నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పటి నుండి స్థానిక సర్పంచ్ బ్రహ్మాల రోజ, ఉప సర్పంచ్ ఉగ్గిడి సత్యనారాయణ, 2వ వార్డు సభ్యుడు సింగం కార్తీక్, అలాగే పంచాయతీ కార్యదర్శి శ్రావన్ రెడ్డిలు తనను విధులకు హాజరుకాకుండా అడ్డుకుంటున్నారని, మానసికంగా వేధిస్తూ కులం పేరుతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బాధితుడు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మరియు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు ఫిర్యాదును తీవ్రంగా పరిశీలించి పరిగణించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందిస్తూ తక్షణమే విచారణ చేపట్టాలని ఆదేశించడంతో, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందించిన డీపీవో, మాడుగులపల్లి ఎంపీఓను ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు ఎంపీఓ స్వయంగా గజాలపురం గ్రామ పంచాయతీని సందర్శించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి ఏడు (7) రోజుల్లోగా పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు ఈ నివేదిక ఆధారంగా శాఖాపరమైన తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.

# కీహోల్ విధానంలో విజయవంతమైన గుండె బైపాస్ శస్త్రచికిత్స

- ఛాతీ ఎముక కోయకుండా చిన్న కోతతో బైపాస్
- ఆరోగ్యశ్రీలో ఉచిత చికిత్స



**కరీంనగర్ రూరల్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** ప్రతిమ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ (కీహోల్) విధానంలో క్లిష్టమైన గుండె బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు సీటీ సర్జన్ డాక్టర్ సాయి నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోరోనరీ ఆర్టరీ డిసీజ్‌తో బాధపడుతున్న రాయపూర్ దీను అనే రోగి గుండె రక్తనాళాల ప్రారంభ భాగంలో తీవ్రమైన బ్లాకేజీలు ఉండటంతో స్టెంటింగ్ సాధ్యం కాలేదని వైద్యులు తెలిపారు. దీంతో మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో బైపాస్ శస్త్రచికిత్స నిర్వహించినట్లు చెప్పారు. సాధారణ ఓపెన్ హార్ట్ సర్జరీలో ఛాతీ ఎముకను తెరవాల్సి ఉండగా, కీహోల్ విధానంలో ఛాతీ ఎముకను కోయకుండా చిన్న కోత ద్వారా రెండు గ్రాఫ్టులను అమర్చి టోటల్ రీవాస్కులరైజేషన్ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఆధునిక శస్త్రచికిత్సను పేద కుటుంబానికి చెందిన రోగికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించినట్లు వైద్యులు తెలిపారు. బైపాస్‌తో పాటు వాల్వ్ మార్పిడి, వాల్వ్ సంబంధిత శస్త్రచికిత్సలను కూడా మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డా. జాన్ ఇజ్రాయిల్, ప్రిన్సిపాల్, డా. సి.ఎన్. ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్, ప్రసాద్ రావు, రిజిస్ట్రార్ అండ్ అడ్మినిస్ట్రేటర్, డా. సాయి నాగలక్ష్మి, సీటీ సర్జన్, డా. నిఖిల్, కార్డియాక్ అనస్థీషియా తదితరులు పాల్గొన్నారు.

**'నా భర్తకు పునర్జన్మ ఇచ్చారు'**

సిర్పూర్ కాగజ్‌నగర్ సమీపంలోని ఈజ్గాం గ్రామానికి చెందిన భీమ్‌రావుకు ఒక్కసారిగా ఛాతినొప్పి, చెమటలు రావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లామని ఆయన భార్య తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రతిమ ఆసుపత్రికి తీసుకువచ్చామని చెప్పారు. వైద్యులు వెంటనే స్పందించి అత్యవసరంగా కీహోల్ విధానంలో శస్త్రచికిత్స చేశారని, సకాలంలో చికిత్స అందించి తన భర్త ప్రాణాలను కాపాడిన ప్రతిమ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితానికి మార్గదర్శి

- పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవిత పాఠాలను నేర్పించేవారే నిజమైన గురువులు
- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** సమాజానికి జ్ఞానం, నైతికత, మానవతా విలువలను అందించే శక్తివంతమైన మార్గదర్శకులు ఉపాధ్యాయులని, గురువు చూపిన మార్గం విద్యార్థి జీవితానికి వెలుగుబాటగా నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒక మంచి ఉపాధ్యాయుడు, ఒక మంచి విద్యార్థిని మాత్రమే కాదు, ఒక మంచి పౌరుడిని కూడా తీర్చిదిద్దుతాడని, వారి అంకితభావం, సహనం, సేవా స్ఫూర్తి విద్యా వ్యవస్థకు బలమైన పునాది అని వారు అభివర్ణించారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం, వారి ప్రాధాన్యతను గుర్తించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ విద్యార్థులను, ఉత్తమ విద్యార్థులు ఉత్తమ సమాజాన్ని నిర్మిస్తారని చెప్పారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆలోచింపచేసాయి. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తూ, ఘన విజయాల వైపు పయనింపచేస్తున్న ఉపాధ్యాయులం దరిని నరేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యారంగా అభివృద్ధిపై అహర్నిశలు కృషి చేస్తున్న నరేందర్ రెడ్డిని ఉపాధ్యాయులందరూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

**రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం**

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.70 కోట్లు
- కాకా వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం
- మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల రుణాల చెక్కులు

**ఎలిగేడు/సుల్తానాబాద్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** పెద్దపల్లి నియోజకవర్గంలో విద్య, మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను సోమవారం పరిశీలించారు. 2,560 మంది విద్యార్థులకు విద్య అందించేలా పాఠశాలతోపాటు హాస్టల్, ప్లేగ్రౌండ్, డైనింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.70 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ప్రభుత్వ బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు.

**కాకా వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం**

కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి విజయరమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మికుల హక్కుల కోసం పార్లమెంటులో గళమెత్తిన జాతీయ నాయకుడిగా కాకా వెంకటస్వామి సేవలు చిరస్మరణీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, జాతీయ స్థాయిలో పలు పదవుల్లో పనిచేసిన ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల రుణాలు**

సుల్తానాబాద్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.6.94 కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విజయ రమణారావు తెలిపారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు**

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని, జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకుల రుణ విస్తరణపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా ఆదేశం



హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 05 (జనం సాక్షి) : సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడం తో పాటు ఎంఎస్ఎంఈలు, ఇతర రంగాలకు రుణాల పంపిణీని పెంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా అధికారులను ఆదేశిం చారు. రుణాల విస్తరణ ద్వారా స్థానిక వ్యాపారాల కు ఆర్థిక సహకారం అందించి జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలను మరింత పెంచాలని సూచించా రు. హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (హెచ్‌డీసీసీబీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన మేనేజ్‌మెంట్ కమి టీ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా సహకార రంగ బలోపే తం, బ్యాంకు ఆర్థిక పనితీరు, రుణాల పంపిణీ, సాంకేతిక ఆధునీకరణ, పరిపాలనా అంశాలపై సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక, ఆడిట్ సర్టిఫికేట్‌ను పరిశీలించిన కలెక్టర్ వాటిని ఆమోదించారు. కేటా యించిన లాభాలు, కాంపోజిట్ సూపర్‌వైజరీ 'ఏ' రేటింగ్, రుణాలు, అడ్వాన్సులకు సంబంధించిన ఎక్స్‌పోజర్ పరిమితుల సవరణ ప్రతిపాదనలను సమీక్షించారు.ట్రాయ్ ఆదేశాలు, ఆర్బీఐ మార్గద ర్శకాలకు అనుగుణంగా టోల్‌ఫ్రీ 1600 నంబర్ సిరీస్‌ను అమలు చేసేందుకు ఆమోదం తెలిపారు. సహకార్ సారథి ప్రైవేట్ లిమిటెడ్(ఎస్ఎస్ పిఎల్) ద్వారా ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీ ఎస్) సేవలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రస్తుత కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్)ను నాబార్డ్ అంబ్రెల్లా సీబీఎస్ ప్రాజెక్ట్‌కు మార్చడం, సైబర్ మోసాల నివేదికల వ్యవస్థను సీబీఎస్, డిజి టల్ బ్యాంకింగ్ ఛానళ్లతో అనుసంధానం చేయడా నికి కూడా ఆమోదం ఇచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జనరల్ బాడీ సమా వేశాన్ని వీలైనంత త్వరగా నిర్వహించాలని అధికా రులను ఆదేశించారు. సీజీటీఎంఎస్ఈ కింద అర్హ త కలిగిన వ్యాపారాలు, ఎంఎస్ఎంఈలకు రుణా ల పంపిణీని పెంచాలని బ్యాంకుకు సూచించారు. హెచ్‌డీసీసీబీ ద్వారా సంస్థాగత రుణ సదుపాయా లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు త్వరలో అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిం చాలని కలెక్టర్ పేర్కొన్నారు. రుణాల పంపిణీ పెరగడం ద్వారా బ్యాంకు రుణ పోర్ట్‌ఫోలియో విస్తరించడంతో పాటు స్థానిక వ్యాపారాలకు ఆర్థిక సహకారం మరింత అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కదిరవ న్ పలని, బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భా స్కర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సహకార అధికారి సుధా కర్‌తో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.






# అనుమతులు ఉన్నట్లా..? లేనట్లా..?

**ప్రభుత్వ భూమి బాధ్యత తమది కాదంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు**

**రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల సమన్వయ లోపం**

**ఆర్మూర్,అక్టోబర్ 5 (జనంసాక్షి):**

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ భూములు ప్రజా ఆస్తి కిందకు వస్తాయి. వాటిని కాపాడటంలో అధికారులందరికీ బాధ్యత ఉంటుందని చెప్పక్కర్లేదు. అక్రమ ఇంటి నిర్మాణమైన, భూమి ఆక్రమించిన నిర్ధారించిన ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ జాబితా కాదని తెలిపేందుకు ధ్రువీకరించుకోవడానికి ఇరిగేషన్ రెవెన్యూ శాఖల నుండి ఎన్ఓసి తీసుకోవాల్సి ఉంటుంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల నిజాంసాగర్ సబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ నెంబర్ 82/2/1 కాల్వ స్థలంలో ఎంజె ఆసుపత్రి ఎదురుగా 23వ వార్డులో ఒక వ్యక్తి అక్రమ కమర్షియల్ నిర్మాణం చేపడుతున్నారు.ఒక ఇంటి నిర్మాణం జరగాలంటే తప్పనిసరిగా టీజీ బిపాస్ ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేసి అనుమతులు తీసుకోవాల్సి ఉ ంటుంది.అన్ని అనుమతులు డిటిసిపి నుండి ఉన్నాయంటూ టౌన్ ప్లానింగ్ అధికార విభాగం బుకాయిస్తూ మాట దాటవేస్తున్నారు.కమర్షియల్ నిర్మాణా నికి సంబంధించిన పర్మిషన్ కాపీలు అసలు ఉన్నాయా లేవా అనేది ప్రశ్నగా మారుతుంది.డిటిసిపి జారీ చేసిన ప్లానింగ్ అనుమతి ఆమోదించిన తేదీ నుండి 8 సంవత్సరాల వరకు వాస్తవానికి చెల్లుబాటులో ఉంటుందని సమాచారం.ఇట్టి నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని మున్సిపల్ శాఖ అధికారులు పర్మిషన్లు ఇచ్చామని చెబుతున్నారు.

**ప్రభుత్వ అధికారుల ఒకరిపై ఒకరు ఆరోపణలు.**

పెర్కిట్ లో నిజాంసాగర్ సబ్ సబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ నెంబర్ 82/2/1 నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నీటిపారుదల,రెవెన్యూ శాఖల అధికారులు కలిసి జాయింట్ సర్వే చేశారు.కాల్వ స్థలంలో కమర్షియల్ నిర్మాణం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో నీటిపారుదల శాఖ ఏఈ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు కలిసి సర్వే చేశారు.డిస్ట్రిబ్యూటరీ సబ్ కెనాల్ 30 మీటర్లు (92 ఫీట్లు) ఉంటుందని అధికారులు నిర్ధారించారు.కాల్వ స్థలంతో పాటు బఫర్ జోన్ సైతం ఉంటుందని సర్వే తో పూర్తి చేశారు.నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వ భూమిని రీ సర్వే చేసి జప్తులోకి తీసుకోవాల్సింది గా రెవెన్యూ శాఖ కార్యాలయంలో నోటీసులు అందించామని చెప్పారు. రెవేన్యూ శాఖ అధికారులు అక్రమ నిర్మాణానికి నోటీసులు పంపి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయో పరిశీలించి నిర్మాణాన్ని ఆపివేసి జప్తు చేయాల్సి ఉంటుంది.కాగా కమర్షియల్ నిర్మాణంపై ఏలాంటి చర్యలు తీసుకోకుండా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వ భూమి రక్షించే బాధ్యత తమది కాదంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు.మొదటి నిర్మాణ దశలోనే మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి.ఇప్పుడు నిర్మాణం పిల్లర్ల దశకు వచ్చిన కమర్షియల్ నిర్మాణంపై ఏ అధికారులు కూడా కన్నెత్తి చూడడం లేదని, మూడు శాఖల అధికారుల సమన్వయ లోపం ప్రజలకు కనబడుతుంది. ఐదు శాఖలు సమన్వయంగా ఏర్పడిన టీం అధ్యక్షుడు, కన్వీనర్ ఏమయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**నిర్మాణానికి నాయకుల అండ..?**

మున్సిపల్ పరిధిలోని అన్ని అనుమతులు ఉన్నాయని నిర్మాణం చేపడుతున్న కమర్షియల్ నిర్మాణానికి బిజెపి, కాంగ్రెస్ నాయకుల అండ ఉందని సుస్పష్టంగా ప్రజలు చెప్పుకుంటున్నారు.బిజెపి నాయకుడు ఎక్కడో ఇంటి నిర్మాణ పర్మిషన్ కాపీని చూపించి నిర్మాణం జరుగుతున్న ఇంటి నిర్మాణ కాపీ కొలతలు తేడాగా ఉన్న నాయకుడి బంధువుకు అప్పగించి నిర్మాణం జరుపుతున్నట్లు తెలిసింది.పర్మిషన్ లేకుండా అన్ని అనుమతులు ఉ న్నాయంటూ కిందిస్థాయి అధికారులతో కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదుదారు లను మభ్యపెడుతున్నాడని తెలిసింది.బిజెపి,కాంగ్రెస్ నాయకుల అండ అక్రమ నిర్మాణదారులపై కాకుండా ప్రజలకు లబ్ధి,పథకాలు అందేందుకు ఒకటవ్వాలని కొందరు పెదవి విరుస్తున్నారు.

## ప్రజాధనం వృథా.. 15 నెలలకే మళ్లీ దిమ్మెల నిర్మాణం



**రాజేంద్రనగర్,అక్టోబర్5(జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్లోని నార్సింగ్ గ్రామంలోపాత రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు రహదారి మధ్యలో చెట్లు నాటేందుకు ఏర్పాటు చేసిన మధ్య డివైడర్ దిమ్మెలను 15 నెలలకే అధికారులు తిరిగి నిర్మిస్తున్నారు. ఇప్పటికే నిర్మించిన దిమ్మెలను కూల్చి మళ్లీ నిర్మించడంపై స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కనీసం రోడ్ల మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, అవసరం లేని పనులకు ప్రజాధనాన్ని వెచ్చించడం సరికాదని వారు మండిపడుతున్నారు. గతంలో నిర్మించి న దిమ్మెలనే మళ్లీ నిర్మించడం ప్రజాధనం వృథా చేయడమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



## కుడుగుంట రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

- మూడున్నర కిలోమీటర్ల కంకర రోడ్డుతో ఇబ్బందులు
- ఆటోలు రావడానికి సైతం నిరాకరణ.. విద్యార్థులు, గ్రామస్థులకు తప్పని తిప్పలు

**మర్పల్లి అక్టోబర్ 05 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలో ని కుడుగుంట గ్రామం నుండి మండల కేంద్రానికి రావాలంటే కంకర రోడ్డుపై మూడున్నర కిలో మీటర్లు నడిచి వస్తున్నారు. ప్రతిరోజు కంకర రోడ్డుపై నడవడం వల్ల విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు పాఠశాలకు రావా లంటే విద్యార్థు కాలినడకన కంకరపై నడిచి రావాలి. రోడ్డు బాగా లేనందు కు ఆటోలు సైతం రావడానికి ముందుకు రావడం లేదు. తప్పని పరిస్థితుల్లో గ్రామస్తులు విద్యార్థు అటు పాఠశాలలకు, గ్రామస్తులు పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ఆల స్యం అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తులు విద్యార్థులు పడుతున్న పాట్లను చూసి అధికారులు ప్రజాప్రతినిలు మేల్కొని నూతన రోడ్డును మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం

**పశ్చిమ హైదరాబాద్ ట్రాఫిక్‌కు రూ.1,090 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్**

ఖైరతాబాద్, అక్టోబర్ 5 (జనం సాక్షి) : పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో ప్రతిపాదించిన 4.3 కి.మీ. ఎలి వేటెడ్ కారిడార్‌ను జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బదావత్ సంతోష్, జిహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్,ఇతర ఉన్న తాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కేపిఆర్ పార్కు చుట్టూ పనులను పరిశీలించారు.పనుల సమయం లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేపడుతు న్న ఫౌండేషన్ తవ్వకాలు, జంక్షన్ అభివృద్ధి పను లను వారు సోమవారం పరిశీలించారు. జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్ఎఫ్సీఎల్ జంక్షన్ వరకు రూ.1,090 కోట్లతో 6-లేన్ ద్విముఖ స్టీల్ ఎలివే టెడ్ కారిడార్ నిర్మించనున్నారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ విధానం విజయవంతం కావడంతో గతంలో ప్రతిపాదించిన పలు అండర్ పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల ప్రతిపాదనలను పునఃస మీక్షించి ఈ ఏకీకృత కారిడార్‌ను ఖరారు చేసినట్లు కమిషనర్ తెలిపారు.ఈపీసీ విధానంలో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టనున్నారు. ప్యాకేజ్-1లో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి ముగ్ధా జంక్షన్ వరకు రూ.580 కోట్ల తో, ప్యాకేజ్-2లో ముగ్ధా జంక్షన్ నుంచి ముఫఖం జా కాలేజ్ వరకు రూ.510 కోట్లతో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.రెండో ప్యాకేజీలో బంజారాహిల్స్ రోడ్ నెం.1కు ప్రత్యేక కనెక్టింగ్ ర్యాంప్ ఏర్పాటు చేయనున్నారు.ఈ కారిడార్‌తో ఐదు ప్రధాన జంక్ష న్లలో సిగ్నల్ రహిత రాకపోకలు సాధ్యమై, ప్రయా ణ సమయం, ట్రాఫిక్ క్యూ, ఇంధన వినియోగం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అదనపు భూభాగం వినియోగించకుండా, పచ్చదనంపై కనిష్ట ప్రభావం తో మాడ్యులర్ స్టీల్ టెక్నాలజీతో నిర్మాణం చేప ట్టనున్నారు.భూసేకరణలో రూ.800 కోట్లు, నిర్మా ణ వ్యయంలో రూ.400 కోట్లు కలిపి మొత్తం రూ.1,200 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు వివరించారు.

## 13.31 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

- ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి అక్టోబర్ 5 (జనంసాక్షి) :** వర్షాకాలంలో కాలనీలను ముంచెత్తే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి తెరదించుతూ, మల్కాజిగిరి నియోజకవర్గంలోని యాప్రాల్, కౌకూర్ ప్రాంతాల్లో 13.31 కోట్ల వ్యయంతో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం వివిధ కాలనీల్లో చేపట్టనున్న బాక్స్ డ్రైన్లు, వరద నీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధానంగా వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా 6.68 కోట్లతో యాప్రాల్ మెయిన్ రోడ్డు, ప్రియదర్శిని ఎన్క్లేవ్ మీదుగా ఓం శ్రీ డిలైట్, వెన్‌రాగ్ ఎన్క్లేవ్ వరకు విస్తృతమైన బాక్స్ డ్రైన్ల నెట్‌వర్క్ నిర్మిస్తున్నామని తెలిపారు. వీటికితోడు మరో 4.91 కోట్లతో కౌకూర్ హనుమాన్ టెంపుల్, కింది బస్తీ, గోల్డ్ ఫ్రైడ్ లింక్స్ నుంచి పెడ్సో ఫేజ్-2 వరకు మురుగు, వరద నీటి కాలువల రీమోడలింగ్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఫార్చ్యూన్ ఎన్క్లేవ్, పటేల్ ఎన్క్లేవ్‌లలో 1.72 కోట్లతో సీసీ రోడ్లు వేస్తున్నామని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వీటిని వేగంగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.అనంతరం కౌకూర్‌లోని గోల్ఫ్ ఎన్క్లేవ్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీకి నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో పాటు పార్కును సుందరీకరించాలని, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని కాలనీవాసులు కోరారు. ప్రజా సమస్యలపై వెంటనే కార్యాచరణ సిద్ధం చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఏఈ సత్యలక్ష్మి, డీఈ కవిత, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్, స్థానిక ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి వినతుల వెల్లువ

**అదనపు కలెక్టర్ భుజంగరావు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 05 జనం సాక్షి:** జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులకు సూచించారు. వెంటదివెంట అర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 107 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు.

**ఆర్‌టీఐ చట్టంపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు**

కాగా, సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన పెంపొందించేం దుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 5 నుండి 12వ తేదీ వరకు ఆర్టీఐ వారోత్సవాలను అన్ని స్థాయిలలో నిర్వహిస్తూ, సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు
- బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన పూర్తి చేయాలి
- ఫారం-6, 7, 8 దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి
- హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఓటర్ల సందేహాలు నివృత్తి చేయాలి




**సుల్తానాబాద్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి సూచించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ 3వ వార్డు పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆమె పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌లో ఓటర్లకు అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ, నోటీసుల పరిశీలన, అవసరమైన పత్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల మాయాదేవి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, ఫారం-6, 7, 8 దరఖాస్తులు, అవసరమైన పత్రాలపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఓటర్ల హక్కులకు ఇబ్బంది కలగకుండా నిబంధనల మేరకు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు, సంబంధిత పత్రాలను పరిశీలించి దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వారిని కార్యాలయాలకు పిలిపించకుండా సాధ్యమైనంత వరకు వారి ఇళ్ల వద్దే వివరాలు పరిశీలించి అవసరమైన పత్రాలు సేకరించాలని సూచించారు. పెండింగ్ నోటీసుల పరిష్కారాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 05 (జనం సాక్షి) :** సోమవారం జిల్లా కలెక్టరేట్ లో కాన్ఫరెన్స్ హాల్ లో గోదావరి పుష్కరాలు-2027 పై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు-2027ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి, కోటిలింగాల తదితర పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల రాక భారీగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి పుష్కర ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పలు శాఖలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మొత్తం రూ.226.41 కోట్ల మేర వివిధ శాఖల పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఎండోమెంట్స్, ఇరిగేషన్, పీఆర్ఈడీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా-పారిశుధ్యం, టూరిజం, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన పనులు వివరాలు సంబంధిత అధికారులు వివరించారు.

పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల భద్రతకు అవసరమైన పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాలు తదితర అంశాలకు కూడా ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు.

ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
6 అక్టోబర్ 2026

# రామప్పకు సింగరేణి మైనింగ్‌తో ముప్పు అవాస్తవం

- సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై ముందుకు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్ తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు కేవలం అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటన లో స్పష్టం చేసింది. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ లో చేపట్టాలని తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొంది. బాధ్యతాయుతమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరి రక్ష ణ కు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. పర్యావరణహితమైన చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే సింగరేణి అధిక ప్రాధాన్యాలు అని పునరుద్ఘాటించింది.

# 68 మంది పంతుళ్లకు షోకాజ్ నోటీసులు

- ఎఫ్ఆర్ఎస్ హాజరు పట్ల నిర్లక్ష్యమే కారణం



**రంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదును పర్యవేక్షిస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానంలో గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని 68 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. హాజరు నమోదులో నిర్లక్ష్యం వహించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే ప్రక్రియలో భాగంగా షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు.

### నోటీసులకు వివరణ ఇవ్వాలని ఆదేశం..

గత నెల రోజులుగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు ఎందుకు నమోదు చేయలేకపోయారో, అందుకు గల కారణాలను వివరిస్తూ సంబంధిత ఉపాధ్యాయులు షోకాజ్ నోటీసులకు సమాధానం సమర్పించాలని డీఈఓ ఆదేశించారు. సమర్పించే వివరణలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### జీతాల విడుదలకు ఎఫ్ఆర్ఎస్ లింక్..

ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును ఆధారంగా చేసుకుని ఉపాధ్యాయుల జీతాల విడుదల చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ట్రెజరీ అధికారిని ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలన, హాజరు నమోదును మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధనా ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు విధులకు సమయానికి హాజరై, తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో క్రమశిక్షణ, సమయపాలన, బోధనా నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేకుండా చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

# లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా కిందికి దిగడం, ఎమర్జెన్సీ కోడ్ పంపడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. 7700 కోడ్‌ను విమాన సిబ్బంది సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఈ కోడ్ వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి విమానానికి ప్రాధాన్య సహాయం అందుతుంది. అయితే అత్యవసర పరిస్థితికి కారణం ఏంటో ఈ కోడ్ ద్వారా తెలియదు. సాంకేతిక సమస్య, ప్రయాణికుడికి వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఇతర కారణాలతోనూ ఈ కోడ్‌ను ఉపయోగించవచ్చు. బీఏ295 ఘటనకు అసలు కారణాన్ని బ్రిటిష్ ఎయిర్‌వేస్ వెంటనే వెల్లడించలేదు. విమానం పరిస్థితి, ఆ తర్వాతి ప్రయాణ మార్గంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో జరిగిన ఘటన తర్వాత మరో విమానం ఎమర్జెన్సీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే బీఏ295 ఘటనకు, ఫ్లైదుబాయ్ ఘటనకు సంబంధం ఉన్నట్లు ప్రస్తుతానికి ఆధారాలు లేవు. సెప్టెంబర్ 30న ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో గొడవ జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 7700తో పాటు 7500 కోడ్‌ను కూడా యాక్టివేట్ చేశారు. 7500 కోడ్‌ను విమానంలో చట్టవిరుద్ధ జోక్యం లేదా హైజాక్ పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఆ విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# మమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు సార్!

- సీఎం ఎదుట గోడు వెళ్లబోసుకున్న యువ రైతు
- కర్ణాటకలో ఓ యువరైతు వింత విజ్ఞప్తి

**మైసూరు, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** కర్ణాటకలో ఓ యువరైతు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు చేసిన ఓ విజ్ఞప్తి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదని, ఈ తీవ్రమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైసూరు జిల్లాలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఓ యువరైతు, తమ గోడును నేరుగా డీకే శివకుమార్ ముందుంచారు. "గ్రామాల్లో యువకులకు సొంత ఇళ్లు, పొలాలు ఉండి, కష్టపడి పనిచేస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ జీతం వచ్చే వారినే కోరుకుంటున్నారు. దీంతో 30, 40 ఏళ్లు దాటినా చాలా మంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ మానసిక వేదనతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలు ఇచ్చినట్లే, మా పెళ్లిళ్ల సమస్యను ఆరో గ్యారంటీగా భావించి పరిష్కరించాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు వినతికి డీకే శివకుమార్ మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అతడు చెప్పేది శ్రద్ధగా విన్నారు. సభలో కొందరు నవ్వడంతో, ఇది నవ్వుకోవాల్సిన విషయం కాదని, తీవ్రమైన సామాజిక సమస్య అని వారికి సూచించారు. మారుతున్న సామాజిక ప్రాధాన్యతలు, పట్టణ జీవనశైలి ప్రభావం, ఉద్యోగాల స్వరూపం వంటివి వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వీడియో వైరల్ కావడంతో, వ్యవసాయంపై యువతలో తగ్గుతున్న ఆసక్తి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. మంచి ఆస్తులున్న భూస్వాములకు కూడా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# 21న అమరవీరుల సంస్మరణ సభకు ఏర్పాట్లు

- పోలీసు అమరవీరులకు ఘన నివాళు లర్పించేలా ఏర్పాట్లు
- నిర్మాణ పనుల్లో జాప్యంపై వద్దు
- వచ్చే ఏడాది అక్టోబరుకల్లా పనులన్నీ పూర్తి చేయాలి
- గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్
- సభావేదిక, రాకపోకలు, పార్కింగ్‌పై సమీక్ష





**హైదరాబాద్, అక్టోబరు 5 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిజిపి సి. వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. అక్టోబరు 21న గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించి సోమవారం స్టేడియాన్ని పరిశీలించి న ఆయన పలు ఏర్పాట్లపై సమీక్షించారు. సభా వేదిక నిర్మాణం, ప్రముఖుల రాకపోకలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జన సమూహాన్ని దృష్టిలో ఉంచుకుని మార్గాలను స్పష్టంగా గుర్తించాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.

### నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

స్టేడియంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని డిజిపి సమీక్షించారు. 48 గుర్రాలకు వసతి కల్పించే ఆధునిక అశ్వశాల సముదాయం, పోలీసు జాగిలాల కెన్నెల్స్, ఐదు అంతస్తుల సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) భవనం, క్రీడా మైదానాలు, అథ్లెటిక్స్ సదుపాయాల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై చేయవద్దన్నారు. అధికారులు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి స్టేడియం సముదాయాన్ని అన్ని సదుపాయాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని గౌరవప్రదంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు డిజిపి ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు.

# ఢిల్లీ పోలీసుల తీరును ఖండిస్తున్నాం

- ఏసీపీ వివేక్ భగత్ ను సస్పెండ్ చెయ్యాలి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ముగ్గురు మహిళా జర్నలిస్టులను వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఢిల్లీ పోలీసులు నిరాకరించడాన్ని ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫోరం కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ రమా మెల్కోటే, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, డా. గోపాల్ రెడ్డి గాదే, హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ లు, సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఒకే రోజు ఏసీపీ వివేక్ భగత్‌పై మూడు ఫిర్యాదులు అందాయని, వాటిని విచారణ నిమిత్తం క్రైమ్ బ్రాంచ్‌కు పంపించామని ఢిల్లీ పోలీసులు పేర్కొంటున్నప్పటికీ, ఇప్పటివరకు క్రైమ్ బ్రాంచ్ సదరు ఏసీపీ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం విచారకరమన్నారు. మహిళలను వేధించడం తన అధికారిక విధుల్లో భాగమే అన్న భావనలో ఆ అధికారి ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. వివేక్ భగత్ ప్రవర్తన పోలీసు శాఖలోని ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ముగ్గురు జర్నలిస్టుల్లో ఇద్దరు గతంలో కూడా సదరు ఏసీపీ పై ఫిర్యాదు చేశారని, అయినప్పటికీ ఆ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఏసీపీ ని సస్పెండ్ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేసారు.

# ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణ రావు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 05(జనంసాక్షి ):** ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణ రావు ,ఎక్సైజ్,సాంస్కృతిక (జిల్లా ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోమవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్, కలెక్టర్ కె హరిత,ఆదిలాబాద్,కలెక్టర్ రాజషా నిర్మల్,భవేష్ మిశ్రా మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పాల్గొని ఆయా జిల్లాల్లోని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, పురోగతిలో ఉన్న పనులు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించలని అన్ని అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ సేవలు, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, గృహ నిర్మాణాల పురోగతి వంటి అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, భూ సమస్యలు, ధరణి,భూ రికార్డుల సంబంధిత అంశాలు, పట్టాదారు పాస్‌బుక్‌లు, భూ హక్కులు, వివిధ రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ లను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, భూ ఆక్రమణలకు తావులేకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ఇతర భూ సంబంధిత అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. జిల్లాల వారీగా మంజూరైన ఇళ్లు, నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లు, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లు, పూర్తయిన ఇళ్లు తదితర వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గృహ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా అందాల్సిన ప్రభుత్వ సహాయాన్ని సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. నిర్మాణ సామగ్రి, స్థలం, అనుమతులు తదితర అంశాల కారణంగా గృహ నిర్మాణాల్లో ఆలస్యం జరుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎక్కడ అయిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంలో అటవీ సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌ంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, కొమరం భీమ్ కలెక్టర్ కె హరిత నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన ఇండిగో విమాన ఛార్జీలు

- అక్టోబర్ 6 నుంచి అమల్లోకి కొత్త ఛార్జీలు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది. నూతన ఛార్జీల ప్రకారం.. దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375... 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,001-1,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900... 1,501-2,000 కి.మీ. దూరానికి రూ. 1,150... 2,000 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.




### 6,021 మీటర్ల పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థి బన్నీ

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా ఘన సన్మానం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తుది సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ అరుదైన ఘనత సాధించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన తరంగ్-2 పర్వతాన్ని అధిరోహించి తన సాహస ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ కామారెడ్డి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. బన్నీ సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా తమలోని ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. పట్టుదల, కృషితో లక్ష్యాలను సాధించవచ్చని బన్నీ నిరూపించారని పేర్కొన్నారు.

### హైదరాబాద్ జైలు నుంచి విజయవాడకు కారుమూరి తరలింపు

**హైదరాబాద్, అక్టోబర్ 05 (జనంసాక్షి):** ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370